

ఉదయగిరి : పింఛన్‌దారులతో కిటకిటలాడుతున్న కెనరా బ్యాంకు



బుచ్చిరెడ్డిపాళెం : మండుటెండలో పింఛను కోసం వెళ్ళి నీరసించి పడిపోయిన వృద్ధురాలు

పింఛన్ నగదు పడిందో..లేదో..!

సంగం : తమ బ్యాంకు ఖాతాలో పింఛన్ పడిందో లేదో ఆతృతతో పింఛన్‌దారులు ఉదయాన్నే స్థానిక కెనరా బ్యాంకు వద్ద పడిగాపులు కాశారు. సిబ్బంది వచ్చి తలుపులు తీయడంతో ఒక్కసారిగా పింఛన్‌దారులు లోపలకు వెళ్లేందుకు తోపులాడారు. లోపలకు వెళ్లి తమ ఖాతాల్లో నగదు పడిందో లేదో కనుగొన్నారు. కొందరికి పడకపోవడంతో ఉసురుమంటూ వెనుతిరిగారు. నగదు ఖాతాల్లో పడినా విత్‌డ్రా స్లిప్పులు రాసిచ్చే వారు లేక వృద్ధులు, చదువురాని వారు అక్కడ ఉన్నవారిని బతిమలాడుకొని రాయించుకున్నారు. మరోవైపు క్యూలో నిలబడలేక వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దూర ప్రాంతం నుంచి వచ్చిన పింఛన్‌దారులు తిరిగి వెళ్లలేక ఆటోలు అద్దెకు తీసుకుని వెళ్లారు.

కమీషన్ ఇచ్చి...

సీతారామపురం : మండలంలోని బ్యాంకుల వద్ద పెన్షన్ సొమ్ము కోసం వృద్ధుల బారులుతీరారు. ఎక్కువసేపు క్యూలైన్‌లో నిలబడలేక, నగదు ఏ బ్యాంకులో జమ అయ్యిందో ఆధార్ లావాదేవీలతో డబ్బులు ఇచ్చే ప్రైవేట్ షాపుల వద్దకు చేరుకున్నారు. రూ.30 నుంచి 60 కమీషన్ ఇచ్చి పింఛన్ డబ్బును తీసుకున్నారు. కొంత మంది ఖాతాలో మైనస్ బ్యాలెన్స్ ఉండటంతో డబ్బులు కట్టయ్యాయి. మరోవైపు చాలామందికి రూ.3వేల సొమ్ము జమ కాలేదు.



సంగం : కెనరా బ్యాంకు తెరవక ముందే పింఛనుదారుల పడిగాపులు



ఆధార్ సెంటర్ వద్ద కమీషన్ ఇచ్చి పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారులు

నీరసించి..
సొమ్మసిల్లి!

- పింఛనుదారులతో వైసీపీ సర్కారు ఆటలు
- మండుటెండలో బ్యాంకుల వద్ద క్యూ
- చాలా మంది ఖాతాల్లో జమకాని నగదు
- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం

నెల్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : పేదలపై ప్రభుత్వం పగ పట్టింది. ప్రతిపక్షాలపై నెపం నెట్టాలన్న కుట్రతో పింఛను నగదును బ్యాంకుల్లో జమ చేసింది. ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేసేందుకు సచివాలయ వ్యవస్థ ఉన్నా దానిని కాదని బ్యాంకుల్లో నగదు జమ చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం పేదలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. గురువారం జిల్లాలోని బ్యాంకుల వద్ద కనిపించిన దృశ్యాలే ఇందుకు నిదర్శనం. వృద్ధులు, దివ్యాంగులు మినహా మిగిలిన వారికి బ్యాంకుల్లో పింఛన్ నగదు జమ చేశామని అధికారులు వెల్లడించారు. 1వ తేదీ మేడే కావడంతో బ్యాంకులు పని చేయలేదు. దీంతో లబ్ధిదారులు గురువారం బ్యాంకులకు క్యూ కట్టారు. జిల్లా వ్యాప్తంగా అన్ని బ్యాంకులు పింఛన్‌దారులతో కిటకిటలాడాయి. ఓ వైపు 43 డిగ్రీల ఎండ కాస్తుంటే మరోవైపు ఆ వేడిని తట్టుకుంటూ పేదలు క్యూలో నిలబడి అవస్థలు పడుతున్న దృశ్యాలు కదిలించాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచే లబ్ధిదారులు బ్యాంకుల వద్దకు రావడం ప్రారంభించారు. అక్కడ సరైన వసతులు ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు అల్లాడిపోయారు. గ్రామాల్లోని లబ్ధిదారులు కిలోమీటర్ల దూరం నడిచి, ప్రయాణించి బ్యాంకుల వద్దకు వచ్చే సరికే అలసిపోయారు. గంటల కొద్దీ క్యూలో నిల్చున్నాక తీరా మీ ఖాతా పనిచేయడం లేదని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో చాలా మంది ఉసూరుమన్నారు. జిల్లాలో 3,15,423 మంది పింఛన్‌దారులు ఉండగా, రూ.94.38 కోట్లు పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఈ నెల 79,734 మందికి ఇళ్ల వద్దనే పింఛన్ ఇచ్చేల్లా నిర్ణయించారు. మిగిలిన 2,35,689 మందికి వారి ఆధార్‌తో లింక్ అయిన బ్యాంకు ఖాతాలో పింఛన్ నగదు జమ చేశారు. ఇంటింటికి పంపిణీ చేయాల్సిన పింఛన్లలో 91 శాతం పంపిణీ చేశారు. కాగా బ్యాంకుల్లో చాలా మంది లబ్ధిదారుల ఖాతాలు ఇన్‌యాక్టివ్‌లో ఉన్నాయి. కొందరికి చాలా దూరంలోని బ్యాంకులో ఆధార్ లింక్ అయ్యింది. ఇంకొందరి ఖాతాలు మైనస్ బ్యాలెన్స్‌లో ఉన్నాయి. ఇటువంటి వారందరికీ పింఛన్ నగదు అందలేదు. దీంతో బ్యాంకులకు వచ్చిన చాలా మంది పింఛన్ తీసుకోకుండానే వెనుదిరిగారు. ఇలా ఎంత మందికి నగదు జమ కాలేదన్న వివరాలు ఇంకా తెలియలేదు.

లబ్ధిదారుల్లో ఆగ్రహం

బ్యాంకుల్లో జమకాని నగదు తిరిగి పంచాయతీ కార్యదర్శుల ఖాతాల్లో శుక్రవారం రిటర్న్ అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఆ నగదును సచివాలయ సిబ్బంది డ్రా చేసి లబ్ధిదారులకు అందించాల్సి ఉంది. అయితే ఈ పద్ధతిపై లబ్ధిదారుల నుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వలంటీర్ల వ్యవస్థ లేకపోయినా గత నెలలో సచివాలయ సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు లేకుండా పింఛన్లు పంపిణీ పూర్తి చేశారు. మరి ఎందుకు ఈ నెల బ్యాంకుల్లో జమ చేయాల్సి వచ్చిందని పేదలు ప్రశ్నిస్తున్నారు. ఒక సచివాలయ సిబ్బంది బ్యాంకుకు వెళ్లి డబ్బులు డ్రా చేసుకొని వచ్చి పంపిణీ చేసేందుకు, లబ్ధిదారులంతా బ్యాంకుకు వెళ్లేందుకు ఎంత తేడా ఉందని నిలదీస్తున్నారు. ఊరిలో ఉండే సచివాలయంలో పింఛన్ తీసుకునే అవకాశం ఉన్నా, దానిని కాదని తమను మండల కేంద్రాల్లోని బ్యాంకులకు పంపడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు.



పొదలకూరు : ఎస్‌బీఐ సర్వీసు సెంటర్ వద్ద వృద్ధులు...



అల్లూరు : ఎస్‌బీఐ బ్యాంకు వద్ద నిరీక్షిస్తున్న వృద్ధులు

నేడు చంద్రబాబు, పవన్ రాక

నెల్లూరులో రోడ్ షో

నెల్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శుక్రవారం నెల్లూరుకు రానున్నారు. సాయంత్రం నగరంలో వీరిద్దరు కలిసి రోడ్ షో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. సాయంత్రం ఆరు గంటలకు హెలికాప్టర్‌లో నారాయణ మెడికల్ కాలేజీ ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన కేవీఆర్ పెట్రోల్ బంకు జంక్షన్‌కు చేరుకొని సాయంత్రం 6.15 గంటలకు రోడ్ షో ప్రారంభిస్తారు. ఆర్టీసీ బస్టాండు, మద్రాసు బస్టాండ్, వీఆర్సీ సెంటర్, గాంధీబొమ్మ మీదుగా నర్తకీ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు ఈ రోడ్ షో సాగుతుంది. అక్కడ జరిగే బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి చంద్రబాబు, పవన్ ప్రసంగిస్తారు.

ఏర్పాట్ల పరిశీలన

నర్తకి సెంటర్‌లో శుక్రవారం రాత్రి జరిగే సభాస్థలిని టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పరిశీలించారు. అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. వారి వెంట టీడీపీ నగరాధ్యక్షుడు మామిడాల మధు, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



సభాస్థలి ఏర్పాట్లు పరిశీలిస్తున్న నారాయణ, కోటంరెడ్డి

బండ్లు తిప్పుకుని బాడుగ డబ్బులివ్వరేం!

కందుకూరు, మే 2: 'నెలరోజులుగా మాచేత బండ చాకిరీ చేయించుకుంటున్నారు. మండుటెండలో పొద్దస్తమానం వాహనాలను పరుగులు తీయిస్తున్నారే కానీ మా బాగోగులు పట్టించుకోవడం లేదు. పైగా ఇవ్వాల్సిన బాడుగలు కూడా ఇవ్వడం లేదు. మా జేబులో డబ్బులు పెట్టి ఆయిల్ పోయించి తిప్పుతున్నాం. మేమేమన్నా లక్షాధికారులమా!?' అంటూ గురువారం కందుకూరులో కార్ల డ్రైవర్లు, యజమానులు ఆందోళనకు దిగారు. ఎన్నికల సందర్భంగా వివిధ విధుల కోసం సబ్ కలెక్టరు నేతృత్వంలో ప్రైవేటు వాహనాలను అద్దెకు తీసుకున్నారు. కందుకూరు టాక్సీ స్టాండులో ఉండే దాదాపు 30కిపైగా వాహనాలను నెల రోజులుగా సబ్ కలెక్టరు కార్యాలయానికి కేటాయించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్), చెక్‌పోస్టు చెకింగ్ విధుల కోసం సదరు వాహనాలను తిప్పుతున్నారు. ప్రతివారం అద్దె బిల్లులు ఇస్తామని చెప్పి నెలరోజులుగా ఇవ్వకపోవడంతో వాహనదారుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. బిల్లులు చెల్లిస్తే తప్ప విధులకు కదిలేది లేదని వాహనాలన్నీ సబ్ కలెక్టరు కార్యాలయంలో పెట్టి నిరసనకు దిగారు. దీంతో సబ్ కలెక్టరు విద్యాధరి వాహనాల యజమానులతో చర్చలు జరిపి కొంతమొత్తం అద్దెలు చెల్లించి మిగిలిన బకాయిలను కూడా త్వరగా క్లియర్ చేస్తానని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

కందుకూరులో వాహన యజమానుల ఆందోళన



సబ్ కలెక్టరు కార్యాలయంలో వాహనాలు నిలిపివేసి నిరసన తెలుపుతున్న డ్రైవర్లు, యజమానులు

టీడీపీ పాలనలోనే తీరప్రాంత అభివృద్ధి

- ఫిషింగ్ హార్బర్ మంజూరు ఘనత చంద్రబాబుదే..
- బీద రవిచంద్ర వెల్లడి

విడవలూరు, మే 2: టీడీపీ ప్రభుత్వ పాలనలోనే జిల్లాలోని తీర ప్రాంతం అభివృద్ధి చెందిందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. బోగోలు మండలం సీఆర్ పాలెం, జువ్వలదిన్నె పంచాయతీల్లో గురువారం టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ప్రజలు భారీగా తరలివచ్చి నేతల రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర మాట్లాడుతూ జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్ మంజూరు చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు.జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీలు ఓడిపోయినా మత్స్యకార ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి రూ.300 కోట్లు మంజూరు చేసింది చంద్రబాబేనని అన్నారు. మత్స్యకారుల వ్యాపార లావాదేవీల కోసం చిప్పలేరు వంతెన ఏర్పాటు కూడా టీడీపీ హయాంలోనే జరిగిందని తెలిపారు. మండల ప్రజల దాహార్తి తీర్చేందుకు సోమశిల జలాల ద్వారా శుద్ధినీటిని అందించేందుకు నిధులు మంజూరు చేయించానని బీద తెలిపారు. అయితే జేపీగూడూరు నుంచి తీరప్రాంతం వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేయించేందుకు వైసీపీ నేతలకు తీరికలేకుండా పోయిందని ఆయన దుయ్యబట్టారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కావలి ఎమ్మెల్యేగా కావ్య కృష్ణారెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. వీపీఆర్‌ను పార్లమెంట్‌కు పంపితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా తీరప్రాంత అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తారని ఆయన వివరించారు. తనను గెలిపిస్తే కావలి నియోజకవర్గ అభివృద్ధి ఎలా ఉంటుందో మాటలతో చెప్పడం కాకుండా, చేతల్లో చూపుతానని కావ్య కృష్ణారెడ్డి గంగపుత్రులకు హామీ ఇచ్చారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తీరం ఎంత గంభీరంగా ఉంటుందో... అంతకన్నా నిర్మలమైన మనసుతో మత్స్యకారులు ఉంటారని, నేడు వారు చూపిన ప్రేమాభిమానాలు మరువలేనన్నారు. తాను ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని,వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా తీరప్రాంత అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాలేపాటి నాగేశ్వరావు, బీద గిరిధర్ యాదవ్, పాలిశెట్టి, సుధీర్‌బాబు, వై.వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సుధాకర్, మాధవరావు, గ్రామకాపులు, మత్స్యకార పెద్దలు తదితరులు పాల్గొన్నారు. కాగా పాతపాలెం కూడలి నుంచి రోడ్లపై టీడీపీ ఎన్నికల గుర్తు సైకిల్‌తోపాటు రంగవల్లులు తీర్చిదిద్ది నేతలకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలుగ్రామాల్లోని రామాలయాల వద్ద గ్రామ కాపులు, పెద్దలు బీద రవిచంద్ర, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావ్య కృష్ణారెడ్డిలను శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.



ప్రచారరథంపై అభివాదం చేస్తున్న వీపీఆర్, బీద, కావ్య

ఇదేం నిబంధన!?

- పోస్టల్ బ్యాలెట్ స్థానంలో ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు
- 5, 6, 7 తేదీల్లోనే వినియోగించుకోవాలని ఆదేశాలు
- ఉద్యోగం చేసే ప్రాంతం ప్రాతిపదికన ఓటు కల్పన
- ఈ నిబంధనలతో ఉద్యోగ ఉపాధ్యాయుల బేజారు
- కందుకూరు నియోజకవర్గంలో కొత్త సమస్య
- ఓటుకు దూరం చేసే కుట్రేనని ఆందోళన

కందుకూరు, మే 2 : ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగ ఉపాధ్యాయులకు కొత్త సమస్య వచ్చింది. గతంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉండేది. ఈదఫా ఆ స్థానంలో ఈ నెల 5, 6, 7 తేదీలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఫెసిలిటేషన్ సెంటర్లకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ మూడు తేదీలలో ఆయా ఉద్యోగులకు ఏ రోజు కేటాయిస్తే ఆ రోజు ఆ కేంద్రాలకు వెళ్లి బ్యాలెట్ తీసుకుని అక్కడే ఓటుహక్కు వినియోగించుకుని సీల్డ్ బ్యాలెట్‌ను సిబ్బందికి ఇవ్వాలి.

ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో అయోమయం

జిల్లాల పునర్విభజనలో నెల్లూరు జిల్లాలో కలిసిన కందుకూరు నియోజకవర్గానికి సంబంధించిన ఉద్యోగ ఉపాధ్యాయులకు కొత్త సమస్య ఏర్పడింది. కందుకూరులో స్థిరనివాసం ఉంటూ కందుకూరులో ఓటుహక్కు కలిగి ఉన్న వారు వందలాదిమంది పాత కందుకూరు రెవిన్యూ డివిజన్ పరిధిలోని కొండపి, కనిగిరి నియోజకవర్గాలలో విధులు చేస్తున్నారు. అలాగే కందుకూరు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయులు చాలామంది ఒంగోలు, టంగుటూరు, సింగరాయకొండలలో స్థిరనివాసం ఉంటూ అక్కడ ఓటుహక్కు కలిగి ఉన్నారు. అయితే ఎన్నికల అధికారులు ఓటుహక్కును ప్రాతిపదికగా కాకుండా ఉద్యోగం చేస్తున్న ప్రాంతాన్ని ప్రాతిపదిక చేసుకుని ఓటుహక్కు వినియోగించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అంటే కందుకూరు నియోజకవర్గంలో పనిచేస్తూ ఇతర ప్రాంతాల్లో ఓటుహక్కు ఉన్నవారు నెల్లూరులో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌కు వెళ్లి ఓటువేయాలి. అలాగే కందుకూరులో ఓటుహక్కు ఉండి కనిగిరి, కొండపి నియోజకవర్గాల పరిధిలో పని చేస్తున్న వారు ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలుకు వెళ్లి ఓటుహక్కు వినియోగించుకోవాలి. అయితే కందుకూరులో ఓటుహక్కు ఉండి కందుకూరు నియోజకవర్గంలోనే పనిచేస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు మాత్రం కందుకూరు జడ్పీ హైస్కూల్లోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఉద్యోగ ఉపాధ్యా యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నందున వారి ఓట్లు పోలింగ్ శాతాన్ని తగ్గించాలన్న దురుద్దేశంతోనే ఇలాంటి తికమక ఆదేశాలు ఇస్తున్నారన్న ఆందోళన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. అంత దూరం వెళ్లి ఓటుహక్కు వినియోగించుకోవటానికి ఇష్టపడక చాలామంది మానుకునే అవకాశం ఉందని, ఆ లక్ష్యం కోసమే ఈ ఆదేశాలని విమర్శిస్తున్నారు. ఎన్నికల కమిషన్, ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి ఉద్యోగ ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించాలని లేనిపక్షంలో కనీసం వారి ఓటుఉన్న నియోజకవర్గ కేంద్రంలో ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటుహక్కు వినియోగించుకునే వెసులుబాటు ఇవ్వాలని కోరుతున్నారు.



ఓట్లు పోల్ కాకుండా ఉండేందుకే!

ఉద్యోగులు, ఉపాధ్యాయులు సుదూరప్రాంతానికి వెళ్లి నిరీక్షించేలా చేస్తే ఓటుహక్కు వినియోగించుకోకుండా వదిలేస్తారన్న దురాలోచనతోనే ఈ నిబంధనలు పెట్టారనిపిస్తోంది. ఉద్యోగ ఉపాధ్యాయులంతా రానున్న ఎన్నికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటువేస్తారని స్పష్టమైనందున కొంతమేరకైనా వారి ఓట్లు పోల్‌కాకుండా నిరోధించాలన్న ఉద్దేశం తప్ప మరొకటి కాదు. తికమక నిబంధనల వల్ల కలిగే ఇబ్బందులను వివరిస్తూ కందుకూరు సబ్ కలెక్టరుకు వినతిపత్రం కూడా అందజేశాం. జిల్లా కలెక్టరు, ఎన్నికల కమిషన్ అధికారులు వాస్తవికంగా ఆలోచన చేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకోవాలి.

- టీవీ రామచంద్రరావు, టీచర్

ఆత్మకూరు ఉదయగిరి

నేటి నుంచి ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ఉదయగిరి రూరల్, మే 2: ఈ నెల 13న జరిగే పోలింగ్‌కు సంబంధించి ఎన్నికల సిబ్బందికి శుక్ర, శనివారాల్లో పట్టణంలోని మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహి స్తున్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ కు పీవో, ఏపీవోలు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

వలంటీర్ల రాజీనామా

ఉదయగిరి రూరల్, మే 2: శకునాలపల్లి సచివాలయ పరిధిలోని ముగ్గురు గ్రామ వలంటీర్లు గురువారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు వారు తమ రాజీనామా లేఖలను ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మకు అందజేశారు.

శిథిలావస్థలో దువ్వూరు కాలువ హెడ్ రెగ్యులేటర్



ప్రమాదకరంగా ఉన్న దువ్వూరు బ్రాంచ్ కాలువ హెడ్‌రెగ్యులేటర్ వంతెన

సంగం, మే 2 : మండలంలో ఐదువేల ఎకరాలకు సాగునీటి సరఫరా చేసే దువ్వూరు బ్రాంచ్ కాలువ హెడ్‌రెగ్యులేటర్ వంతెన దెబ్బతిని శిథిలావస్థకు చేరింది. పెన్నానది నుంచి కనిగిరి రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు కనిగిరి ప్రధాన కాలువకు పడమటిపాళెం సమీపంలో దువ్వూరు బ్రాంచి కాలువను ఏర్పాటు చేశారు. ఇది హెడ్ రెగ్యులేటర్ కం బ్రిడ్జిగా ఉంది. ఈ బ్రిడ్జి మీదనే సంగం నుంచి గాంధీజనసంఘం బైపాస్ రహదారిగా ఉంది. 130 ఏళ్ల కిందట బ్రిటీష్ హయాంలో దీన్ని నిర్మించారు. ఈ కాలువ ద్వారా పడమటిపాళెం, వెంగారెడ్డిపాళెం, అనసూయనగర్, సిద్ధీపురం, మక్తాపురం, దువ్వూరు, అన్నారెడ్డిపాళెం, బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని మినగల్లు, పంచేడు గ్రామాల్లోని పొలాలకు సాగునీరు సరఫరా అవుతోంది. శతాబ్దకాలం దాటడంతో బ్రిడ్జితో పాటు హెడ్‌రెగ్యులేటర్ దెబ్బతిని శిథిలాస్థితికి చేరింది. గతంలో ఇసుక లారీలు, టిప్పర్ల రాకపోకలతో బ్రిడ్జి కుంగి ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ఎన్నికల సమయంలో పార్టీ అభ్యర్థులు పునః నిర్మాణం చేస్తామని హామీ ఇస్తున్నారు. ఎన్నికలైన తరువాత ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

వైద్యశాల ఆకస్మిక తనిఖీ



దువ్వూరు విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను తనిఖీ చేస్తున్న అడిషనల్ డీఎండీహెచ్‌వో ఖాదర్‌వలి

సంగం, మే 2: స్థానిక ప్రభుత్వ వైద్యశాలను గురువారం అడిషనల్ డీఎండీహెచ్‌వో, టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి ఎస్‌కే ఖాదర్‌వలి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలోని టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ రికార్డులను పరిశీలించారు. టీబీ, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ గురించి స్థానిక వైద్యుడు అశోక్, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. త్వరలో బీసీజీ వ్యాక్సిన్ వస్తుందని ఆ వ్యాక్సీన్‌ని 60ఏళ్లు పైబడిన వారికి వేయాలన్నారు. అనంతరం దువ్వూరు, సిద్ధీపురం విలేజ్ హెల్త్ క్లినిక్‌లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. తరువాత దువ్వూరులో ఓ క్షయవ్యాధిగ్రస్థుడి ఇంటిని సందర్శించి మందులు వాడుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.

అధికారంలోకి వస్తే సీఏఏ రద్దు

ఉదయగిరి, మే 2: కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయిన వెంటనే సీఏఏ రద్దు చేస్తుందని ఏఐసీసీ కోఆర్డినేటర్ నసీర్‌అహ్మద్ తెలిపారు. గురువారం ఉదయగిరి షాదీ మంజిల్‌లో నెల్లూరు పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కొప్పుల రాజు, ఉదయగిరి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి సోము అనిల్ కుమార్‌రెడ్డిల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. మైనారిటీలకు సముచితస్థానం కల్పించడం కాంగ్రెస్‌కే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు సయ్యద్ రఫీ, ఎంపీటీసీ కాకు విజయమ్మ, కాకు వెంకటయ్య, ఫరుద్దీన్‌బాషా, బాలయ్య, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సొసైటీ కార్యాలయ ఉద్యోగి మృతి

చేజర్ల, మే 2: స్థానిక సొసైటీ కార్యాలయ అకౌంటెంట్ పారా యానాదయ్య (59) గురువారం ఆకస్మికంగా మృతి చెందాడు. నాగులవెల్లటూరుకు చెందిన ఈయన కొన్ని సంవత్సరాలుగా చేజర్లలో పనిచేస్తున్నాడు. గురువారం సెలవు పెట్టి కలువాయి మండలంలోని తోపుగుంటలో అత్తమ్మ ఇంట్లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సమయంలో హఠాత్తుగా గుండె నొప్పి రావడంతో బంధువులు ఆయన్ను కలువాయికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం మృతదేహాన్ని నాగులవెల్లటూరు గ్రామానికి తరలించారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదచాయలు నెలకున్నాయి. అటు జిల్లా సొసైటీ ఉద్యోగులు తమ సంతాపాన్ని తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

చేజర్ల, మే 2: తిరుపతినాయుడుపల్లిలో నిద్రిస్తున్న మహిళ మెడలో సరుడు చోరీ చేసిన సంఘటన గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. అయితే దొంగతనం చేసిన వ్యక్తి అదే గ్రామంలో కల్లు తాగేందుకు వచ్చి ఉండడంతో గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. అతని చెప్పుల ముద్ర ఆధారంగా పట్టుకుని చేజర్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ ప్రభాకర్ నిందితుడిని పట్టుకుని విచారించగా పొదలకూరులో కుదవపెట్టినట్లు అసలు విషయం ఒప్పుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా రమణారెడ్డి



వింజమూరు, మే 2: టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియోజకవర్గానికి చెందిన ఎల్‌సీ రమణారెడ్డి నియమితులయ్యారు. చంద్రబాబు నాయుడు తనను గుర్తించి రాష్ట్ర కార్యదర్శిగా పదవి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు.

మద్యం పట్టివేత

మర్రిపాడు, మే 2: ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న 34 మద్యం సీసాలు, 41 సెల్ ఫోన్లను గురువారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌తో అధికారులు మర్రిపాడు పోలీసులతో కలిసి పట్టుకున్నారు. చిన్నమాచునూరు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నెల్లూరు నుంచి ఉదయగిరి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మద్యం, సరైన పత్రాలు లేని సెల్ ఫోన్లు, రూ.26వేలను వేర్వేరు వ్యక్తుల వద్ద పట్టుకున్నారు. పట్టుకున్న మద్యం, సెల్ ఫోన్లను ఆత్మకూరు సీఐ వేణుకు అప్పగించారు. మద్యానికి సంబంధించి ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న పోలీసులు

సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా: కాకర్ల

ఉదయగిరి రూరల్, మే 2: ఎమ్మెల్యే పదవంటే తనకు ఆశలేదని, మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు సేవ చేసేందుకు తాను రాజకీయాల్లోకి వచ్చానని ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ తెలిపారు. గురువారం మండలంలోని దాసరిపల్లి, వడ్లమూడిపల్లి, అప్పసముద్రం, తిరుమలాపురం, సున్నంవారిచింతల, గుడినరవ, దుంపవారిపల్లి వెంగళరావునగర్, గండిపాళెం గ్రామాల్లో టీడీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓటు లేని వ్యక్తి ఏం అభివృద్ధి చేస్తాడో ప్రజలు ఆలోచించాలన్నారు. కష్టం ఎక్కడుంటే అక్కడ తానుంటానని, ప్రతి కుటుంబానికి అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా, వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందన్నా రు. సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి పేదవాడికి లబ్ధి చేకూరుతుందన్నారు. వైసీపీకి మరో అవకాశం ఇస్తే రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోతాయని, ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలసపోవాల్సిన దుస్థితి నెలకొంటుందని చెప్పారు. నియోజకవర్గంలో ప్రధానంగా తాగు, సాగునీటి కష్టాలు తీర్చడంతో పాటు పరిశ్రమలు ఏర్పాటు చేసి వలసల నివారణకు చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. మహిళలు ఆర్థిక చైతన్యం సాధించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ ఎన్నికల్లో తనతోపాటు నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందన్నారు.



దాసరిపల్లిలో పార్టీలో చేరిన వారితో కాకర్ల, టీడీపీ నాయకులు

టీడీపీలో చేరిక: దాసరిపల్లిలో మాజీ సర్పంచ్ జమృత్‌జాఫర్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన గాడి ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సయ్యద్ అహ్మద్‌అలీ, సయ్యద్ మాబాషాలు, అప్పసముద్రంలో చేజర్ల రాములరెడ్డి తన అనుచరులతో కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి కాకర్ల సురేష్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబుయాదవ్, మన్నేటి వెంకటరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, పరిశీలకుడు గంగాధర్, నాయకులు సయ్యద్ నవాజ్, అక్రమ్, గడ్డం వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, ఓబులరెడ్డి, శివకృష్ణ, యూనస్ పాల్గొన్నారు.

సీతారామపురం: చిన్ననాగంపల్లి పంచాయతీలో కాకర్ల వెంకట్ సతీమణి కాకర్ల రుక్మిణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకర్ల రుక్మిణి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడుని చేసుకుంటేనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందన్నారు. తల్లికి వందనం పథకం కింద విద్యార్థులకు ఏటా రూ.15వేలు, అన్నదాత ఏటా రూ.20వేలు టీడీపీ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. దీపం పథకం కింద ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, 18 నుండి 59ఏళ్లు ఉన్న మహిళలకు ఆడబిడ్డ నిధి ద్వారా నెలకు రూ.1500 ఇస్తామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తామన్నారు. కలలకు రెక్కలు పథకం కింద వడ్డీ లేని రుణాలను వస్తాయన్నారు. ఉదయగిరి శాసనసభ అభ్యర్థిగా కాకర్ల సురేష్, పార్లమెంట్ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు, సూపర్ సిక్సర్ క్యాలెండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ కప్పా ప్రభకర్ రాజు, మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు, సీతారామపురం సర్పంచ్ భాగ్యకుమారి,మాజీ జెడ్పిటిసి కలివెల జ్యోతి, ఉదయగిరి నియోజకవర్గ వడ్డెర సంఘ అధ్యక్షుడు తురక వెంకటేశ్వర్లు, జాషువా, పాలిశెట్టి శ్రీనివాసులు, మాలకొండయ్య పాల్గొన్నారు.



దాసరిపల్లిలో మాట్లాడుతున్న కాకర్ల సురేష్



చిన్ననాగంపల్లిలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తున్న కాకర్ల రుక్మిణి

పొలం రైతులది.. పాస్‌బుక్కుపై జగన్ ఫొటోనా!

- రైతుల భూములు స్వాహాకు వైసీపీ పన్నాగం
- ఆనం రామనారాయణరెడ్డి విమర్శ

సంగం, మే 2: సీఎం జగన్‌రెడ్డి తెచ్చిన ల్యాండ్ టైటిల్ చట్టంతో రైతుల పొలాల స్వాహాకు పన్నాగం పన్నాడని ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి విమర్శించారు. గురువారం ఆయన వీర్లగుడిపాడు ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మొదటిఏడాది మద్యం, రెండో ఏడాది ఇసుక, మూడో ఏడాది మట్టి, గ్రావెల్, నాలుగో ఏడాది మాదకద్రవ్యాల విక్రయాలతో దోచుకున్నారని మండిపడ్డారు. ఇప్పుడు ప్రజల ఆస్తులు దోచుకునేందుకు ల్యాండ్ టైటిల్ చట్టం తెచ్చి రైతుల పాసుబుక్కులపై జగన్ ఫొటోను పెట్టడం విచారకరం అన్నారు. పాస్ పుస్తకం మంజూరు చేసి ఒరిజినల్ ఆయన వద్ద ఉంచుకుని జిరాక్స్ రైతులకు ఇస్తాడని చెప్పడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. ప్రజలు అప్రమత్తమై వైసీపీని ఇంటికి సాగనంపాలని లేకపోతే ఆస్తులకు రక్షణ ఉండదన్నారు. రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, తాళ్లూరి గిరినాయుడు పాల్గొన్నారు.

ఆత్మకూరు: అప్పారావుపాళెం, బట్టేపాడు, నల్లపురెడ్డిపల్లి, మురగళ్ల గ్రామాల్లో ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కిమ్స్ డైరక్టర్ తాళ్లూరి గిరినాయుడు, కర్నాటి ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు. అనంతరం బీజేపీ నేతలు ఆత్మకూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి అసెంబ్లీ అభ్యర్థి ఆనం, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. వారి వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ కుడుముల సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కరటంపాటి సుధాకర్ ఉన్నారు.



అప్పారావుపాళెంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఆనం రామనారాయణరెడ్డి

సంగం: ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం కుమార్తె ఆనం కైవల్యారెడ్డి మర్రిపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

అనంతసాగరం: మండలకేంద్రంలో టీడీపీ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధ్యక్షురాలు మునగపాటి సునీత, ఎంపీటీసీ రాపూరు సుజాతమ్మ, చల్లా శివారెడ్డి, నర్సారెడ్డి, తిరుపతి నాయుడు, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు: చిలకపాడు, శెట్టిసముద్రంలో ఆరికట్ల జనార్ధన్‌నాయుడు, నారాయణ, మధు సూదన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు.



ఆత్మకూరులో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నేతలు



మర్రిపాడులో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఆనం కైవల్యారెడ్డి

పరిశుభ్రత పట్టదా..?

ఉదయగిరి రూరల్, మే 2: స్థానిక యాదవపాళెంలో మురుగు కాలువ చెత్తాచెదారంతో నిండిపోయి మురుగు రోడ్డుపై పారుతోంది. ఈ సమస్యతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. చెత్తాచెదారంతో నిండి దుర్వాసన వెదజల్లుతుండడంతో అటువైపు అడుగేయాలంటే స్థానికులు జంకుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మురుగు కాలువను శుభ్రం చేసి రోడ్డుపై మురుగు నిలువకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మురుగు కాలువ పూడిపోయి రోడ్డుపై పారుతున్న మురుగునీరు

ముళ్లపొదలు తొలగించరూ..

అనంతసాగరం: మండలంలోని బద్వేల్‌కు వెళ్లే రోడ్డులో ముళ్లపొదలు విస్తరించి ప్రమాదకరంగా ఉన్నాయి. గౌరవరం పల్లవోలు వాగు వద్ద నుంచి కామిరెడ్డిపాడు సబ్‌స్టేషన్ వరకు సుమారు 3కిలో మీటర్లు రహదారికి ఇరువైపులా దట్టంగా ముళ్లపొదలు కమ్మేసి ఉన్నాయి. ఈ సమస్యతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యతో కొన్నిసార్లు ఎదురెదురుగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురి అవుతున్నాయి. ఇప్పటికైనా వాహనాలు కనిపించాలంటే ముళ్లపొదలు తొలగించే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



బీసీ కార్పొరేషన్ పరిపాలనా భవనం

అటకెక్కిన ‘ఆదరణ’

- పథకాలకు బీసీలు దూరం
- అయినా నోరుమెదపని సంఘాలు
- గతమెంతో ఘనం

నెల్లూరు (వీఆర్సీ) మే 2 : సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్రంలోని కులానికో కార్పొరేషన్‌ను ప్రకటించారు. అలా ప్రకటించిన 56 కార్పొరేషన్లకు చైర్మన్లను, డైరెక్టర్‌లను కూడా నియమించారు. ప్రస్తుతం ఆ కార్పొరేషన్లు ఎక్కడా కనిపించడం లేదు. కాగా గతంలో ఉన్న బీసీ, ఈబీసీ, కాపు, ఎంబీసీ కార్పొరేషన్‌లు మాత్రమే ఉన్నాయి. అవికూడా పేరుకు మాత్రమే. వాటికి ఎలాంటి నిధులూ లేవు. గతంలో బీసీల్లో కులవృత్తులు చేసుకునే వారికి అవసరమైన పనిముట్లను ఆదరణ పథకం ద్వారా అందించేవారు. ప్రస్తుతం అవేవీ ఇవ్వడంలేదు.

● ఐదేళ్లుగా నిరాదరణే..

సంవత్సరం	లబ్ధిదారులు (బీసీలు)	సబ్సిడీ (రూ. లక్షల్లో)
2014-15	3351	1074.52
2015-16	2533	922.23
2016-17	2427	1333.75
2017-18	3098	2136.20
	11409	5466.7

ఐదేళ్లుగా 100కు పైగా ఉన్న బీసీ కులాలకు నిరాదరణే మిగిలింది. సంచార జాతుల ఊసే లేకుండా పోయింది. ప్రకటనలకు పరిమితమేకానీ బీసీలకు పైసా కూడా అందనే లేదు. గతంలో బీసీలకు బీసీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులకు పలురుణాలను బ్యాంకుల అనుసంధానంతో ఇచ్చేవారు. ఇందుకుగానూ రూ. లక్షకు తగ్గకుండా ప్రతి లబ్ధిదారునికి సబ్సిడీ రూపంలో అందించే వారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకులు రుణ రూపంలో ఇచ్చేవి.

అలాగే కాపులకు 2015-16 నుంచి 2019 వరకు 6925 మందికిగానూ రూ.4789.00 లక్షలను సబ్సిడీగా అందించారు. ఈబీసీలు 481 మందికి గత ప్రభుత్వ హయాంలోనే రూ.393.55 లక్షలను సబ్సిడీగా అందించి ఆర్థికంగా అండగా నిలిచారు. అలాగే కుల వృత్తులు చేసుకునే వారికి ఆదరణ పథకం ద్వారా 14208 మంది రూ.2281.40 లక్షల విలువైన పనిముట్లు అందించారు. కానీ ఈ మూడేళ్ల కాలంలో బీసీలు ఎంత నిరాదరణకు గురయ్యారో అర్థమవుతుంది. ఇంతటి దారుణ పరిస్థితులు ఉన్నా ఏ ఒక్క బీసీ నాయకుడు కూడా తమకు సబ్సిడీ రుణాలు అందలేదని కానీ, ఆదరణ పథకం దక్కలేదనికానీ నోరు తెరచిన పాపాన పోలేదు.

సోమశిలలో 8.137 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మే 2: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు. గురువారానికి జలాశయంలో 8.137 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

హత్య కేసులో ఆరుగురి అరెస్ట్



నిందితుల వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ బాబీ

నెల్లూరు(క్రైం), మే 2: నెల్లూరులోని జాకీర్‌హుస్సేన్ నగర్‌లో ఇటీవల జరిగిన రవితేజ అనే యువకుడి హత్య కేసులో పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. గురువారం నవాబుపేట పోలీసు స్టేషన్‌లో నిందితుల వివరాలను స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎం బాబీ వెల్లడించారు. నగరంలోని కుసుమ హరిజనవాడకు చెందిన రౌడీషీటర్ పుట్టా బాలాజీ గత నెల 28వ తేదీ రాత్రి జాకీర్ హుస్సేన్ నగర్ వైపు వెళుతుండగా స్థానికంగా ఉన్న సాజిద్, సుల్తాన్ దాడిచేశారు. గాయపడ్డ బాలాజీ ఇంటికి వెళ్లి తన సోదరుడు చంద్రశేఖర్, స్నేహితులు శ్యాం అలియాస్ అంబాకబ్, బాబు, మరో ఇద్దరు మైనర్లతో కలిసి జాకీర్ హుస్సేన్‌నగర్‌కు వచ్చి సాజిద్, సుల్తాన్‌పై దాడిచేయసాగాడు. ఈ విషయం తెలుసుకున్న సాజిద్ స్నేహితుడు రవితేజ ఘటనా స్థలానికి చేరుకుని బాలాజీ బృందాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో నిందితులు కర్రతో రవితేజ తలపై దాడిచేయగా తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. రవితేజ తండ్రి శేషాద్రి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ బాబీ కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కర్రలు, మోటారుబైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ బాబీ, ఎస్‌ఐలు ఎస్‌ఏ రెహమాన్, సీహెచ్ చంద్రావతి, ఎం జోజి, హెడ్ కానిస్టేబుల్ పవన్‌కుమార్, కానిస్టేబుళ్లు రత్నయ్య, సురేంద్రబాబు, మోహన్ బాబు, వేణు, మస్తానయ్య, వెంకటేశ్వర్లు, బీ మస్తానయ్యను డీఎస్పీ అభినందించారు.

మద్యంపై ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్

- ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైం), మే 2: మద్యం అక్రమ రవాణా, నిల్వకు సంబంధించి, ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లకు సంబంధించిన ఫిర్యాదుల కోసం జిల్లా ఎక్సైజ్ కార్యాలయం లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి కే నాగమల్లేశ్వరరెడ్డి తెలిపారు. ఫిర్యాదులను 0861-2331 159 నెంబరుకు తెలియజేయాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం నెల్లూరులోని పలు ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన ప్పటి నుంచి ఇప్పటి వరకు మద్యం దుకా ణాలు, బార్లలో తనిఖీలు చేపట్టి అక్రమంగా మద్యం అమ్ముతున్న వారిపై 17 కేసులు పెట్టి 23 మందిని అరెస్ట్ చేశామన్నారు. సుమారు రూ.1.20 కోట్ల విలువ చేసే 79,492 మద్యం సీసాలు, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అవకతవకలకు పాల్పడుతున్న 23 మంది సిబ్బందిని విధుల నుంచి తొలగించామని చెప్పారు. మద్యం దుకాణాల సిబ్బంది బార్ల యజమానులకు పెద్ద మొత్తంలో మద్యం అమ్మకాలు జరిపితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నగరంలోని మద్యం మాల్‌లో తనిఖీలు చేస్తున్న నాగమల్లేశ్వరరెడ్డి

ములాఖత్ వేళల మార్పు

నెల్లూరు(క్రైం). మే 2: వేసవి తీవ్రత దృష్ట్యా జిల్లాలోని కావలి, ఆత్మకూరు సబ్ జైళ్లలో ఖైదీలతో వారి బంధువులు మాట్లాడుకునేందుకు నిర్వహించే ములాఖత్ వేళల్లో మార్పు చేశామని జిల్లా సబ్ జైళ్ల అధికారి సోపిరాల వెంకటేశ్వర రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ములాఖత్ సమయాన్ని మార్చామని తెలిపారు. ఖైదీల కుటుంబ సభ్యులు ఆ వేళలను పాటించాలని కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	140
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	248
స్కిన్‌లెస్	278
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6783
వెండి కిలో ధర	రూ. 82,200
వెండి ఒక గ్రాము	రూ. 84.20

నేడు లింగసముద్రంలో తెలుగుదేశం రోడ్‌షో

లింగసముద్రం: లింగసముద్రంలో శుక్రవారం నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులు రోడ్‌షో నిర్వహించను న్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, జనసేన మండల అధ్యక్షుడు అంగుళూరి నరసింహారావులు ఓ ప్రకటనలో తెలిపారు. వాకమళ్లవారిపాలెం నుంచి ర్యాలీగా బయలుదేరి లింగసముద్రం చేరుకుని బహిరంగ సభలో మాట్లాడతారని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అల్లూరు, మే 2 : గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మచిలీపట్నంకు చెందిన పసుపులేటి మల్లికార్జున (34) మండలం గ్రద్దగుంటలోని తన అత్తగారింటికి కొద్దిరోజుల క్రితం తన భార్యతో కలసి వచ్చాడు. ఈనెల 30న ఇంటిలోని గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరులోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి హోమ్ పోలింగ్

● వృద్ధులు, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి

● నియోజకవర్గంలో 4,737 మంది అర్హులు ● సబ్ కలెక్టరు విద్యాధరి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ విద్యాధరి

కందుకూరు, మే 2: వృద్ధులు, వికలాంగులు ప్రయాసపడి పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాల్సిన అవసరం లేకుండా హోమ్ పోలింగ్ విధానం అమలు చేస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని కందుకూరు సబ్ కలెక్టరు జి.విద్యాధరి కోరారు. గురువారం సాయంత్రం ఆమె తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో 85 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులు 4,737 మంది ఉన్నట్లు గుర్తించామని, వారందరికీ పోలింగ్ సిబ్బంది ఈనెల 3,4,5 తేదీలలో వారి ఇళ్లవద్దకే ఈవీఎం మిషన్లు తీసుకెళ్లి వారితో ఓటు వేయిస్తారని తెలిపారు. హోమ్ పోలింగ్‌కు అర్హులైన వారు తమ అభీష్టం మేరకు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ సిబ్బంది వెళ్లిన సమయంలో వారి కుటుంబ సభ్యుల్లో ఒకరిని సహాయకుడిగా అనుమతిస్తామని, రహస్య పద్ధతిలోనే వారితో ఓటు వేయిస్తామని వివరించారు. హోమ్ పోలింగ్‌ను పూర్తి చేసేందుకు ప్రతి మండలానికి ఒక టీమ్‌ను ఏర్పాటు చేశామని, ఈ మూడు రోజుల్లో ఆ టీమ్ మండలంలోని అన్ని గ్రామాల్లో తిరిగి ఓటింగ్ వేయిస్తారని వివరించారు. ఇంకా ఎవరైనా ఓటర్లు మిగిలి ఉంటే తిరిగి ఈనెల 8,9,10 తేదీలలో మరో విడత హోమ్ పోలింగ్ టీమ్ ఆయా గ్రామాలకు వెళ్లి ఓట్లు వేయిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియను ఎంతో పారదర్శకంగా నిర్వహిస్తామని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా పోలింగ్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టరు విద్యాధరి హెచ్చరించారు.

వైసీపీ మాయమాటలు నమ్మొద్దు

● టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ మహ్మద్



ముస్లింల సమావేశంలో మాట్లాడుతున్న ఇక్బాల్

కావలి, మే 2: టీడీపీ హయాంలో ముస్లింలకు ఒక్క చిన్నపాటి అన్యాయమైనా జర గలేదని, వైసీపీ నేతలు ముస్లింలను ఆకట్టుకునేందుకు చెపుతున్న మాయమాటలు నమ్మవద్దని టీడీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ షేక్ ఇక్బాల్ మహ్మద్ తెలిపారు. పట్టణంలోని ముసునూరులో గురువారం కావలికి చెందిన ముస్లింలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ కలిసి ప్రభుత్వాలు ఏర్పాటు చేసినపుడల్లా ముస్లింలకు మంచే జరిగింది తప్ప ఎవరికీ అన్యాయం జరుగలేదన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ఇచ్చిన రంజాన్‌తోఫా, దుల్హన్, విదేశీవిద్య, స్వయం ఉపాధికి ఇచ్చే రాయితీ రుణాలు, ఇమామ్, మౌసిన్‌లకు జీతాలు తదితర అన్నిపథకాలకు జగన్ ప్రభుత్వంలో మంగళం పాడారన్నారు. ముస్లింలకు అనేక రకాలుగా నష్టం చేసిన జగన్ మోహన్‌రెడ్డికి ఓటు వేస్తే ఎవరికి వారు ఉరివేసుకున్నట్లేనన్నారు. పార్లమెంట్‌లో జగన్‌కు అమోఘబలం ఉన్నప్పటికీ సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఉమ్మడిపౌరస్మృతి వంటి కీలక ముస్లిం వ్యతిరేక బిల్లులను ఆపకుండా భేషరతుగా జగన్ మద్దతిచ్చింది వాస్తవం కాదాని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన 4 శాతం ముస్లిం రిజర్వేషన్‌లను రద్దు చేయాలని కోర్టుకు వెళ్లింది వైసీపీ ఎంపీ ఆర్ కృష్ణయ్య కాదా అని ప్రశ్నించారు. ముస్లిం కుటుంబాలపై దాడులు జరుగుతుంటే జగన్ ముఖ్యమంత్రి స్థాయిలో ఒక్క సారైనా ఖండించారా అని ప్రశ్నించారు. రూ.30 వేల కోట్ల విలువైన వక్ఫ్ భూములు కబ్జాకు గురైతే జగన్ ఏమిచేశారన్నారు. ముస్లింలకు మేలు చేసే చంద్రబాబు నాయుడికి అందరం అండగా నిలిచి ఆయనను ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ముసిం నేతలు సయ్యద్ అబ్దుల్ రహీం, షేక్ హజరత్, కరిముల్లా, అబ్దుల్ హఫీజ్, రఫీ అహ్మద్, హుస్సేన్, అబ్దుల్ అన్సర్, ఆసిఫా, ఖమరబాబు, ఇబ్రహీం, నాయబ్ రసూల్, షానవాజ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం జెండా ఆవిష్కరణ

కందుకూరు, మే 2: కందుకూరు పట్టణం భవన నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్‌లో గురువారం జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.మాల్యాద్రి, అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఆదాము, గౌరవాధ్యక్షుడు ఎస్ఏ గౌస్, ఎస్కే రంతుల్లా, ఏ.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారిగా సుధాకర్‌రావు బాధ్యతల స్వీకరణ



న్యాయాధికారి సుధాకర్‌రావును సత్కరిస్తున్న పోట్లూరు

కావలిటౌన్, మే 2: కావలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారిగా ఈ సుధాకర్ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కావలి గ్రామ దేవత కలుగోళశాంభవి ఆలయం, సాయిబాబా గుడిలో పూజలు నిర్వహించారు. ఆయనను మాజీ ఏజీ పీ పోట్లూరు శ్రీనివాసులు న్యాయవాదులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి స్వాగతించారు. బాబా గుడి పెద్దలు టంగుటూరి ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోకు పాలభిషేకం



మేనిఫెస్టోకు పాలభిషేకం చేస్తున్న టీడీపీ శ్రేణులు

కలిగిరి, మే 2: ఎన్నికల మేనిఫెస్టోలో రూపొందించిన ప్రతి సంక్షేమ పథకాన్ని టీడీపీ నూరు శాతం అమలు చేస్తుందని, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, టీడీపీ రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి బీవీ రామారావులు పేర్కొన్నారు. కలిగిరి పట్టణంలోని శివాలయం సమీపంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టోకు పాలాభిషేకం చేశారు. రాజధాని నిర్మాణంతో పాటు, పరిశ్రమల స్థాపన. ఉపాధి అవకాశాలు కల్పన, సంపద సృష్టించడం చంద్రబాబుకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాకు మహేష్, గంజాం రాఘవేంద్ర, చంద్రమౌళి, ప్రభాకర్, జీ.మదన్‌కుమార్, బొగ్గవరపు వేణు, నిశ్శంకర సురేష్, నాగిరెడ్డి, సుబ్బారెడ్డి, ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి వరి గడ్డి దగ్ధం



ట్రక్‌లో దగ్ధమవుతున్న గడ్డి

కావలి రూరల్, మే 2: పశువుల మేత కోసం ట్రాక్టర్‌లో తరలిస్తున్న వరి గడ్డికి విద్యుత్ వైర్లు తగలడంతో గడ్డితో పాటు ట్రాక్టర్ ట్రక్ దగ్ధమైన ఘటన గురువారం కావలి మండలం కొత్తపల్లి వద్ద జరిగింది. బాధితుడి కథనం మేరకు.. కొండాపురం మండలం కొమ్మికి చెందిన చెరుకూరి క్రిష్ణ కొత్తపల్లిలో గడ్డి కొనుగోలు చేసి కొమ్మికి తరలిస్తుండగా మార్గమధ్యంలో విద్యుత్ వైర్లు తగలడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వారు గమనించి ట్రాక్టర్ నుంచి ట్రక్‌ను వేరుచేసి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి మంటలు పూర్తిగా వ్యాపించటంతో ట్రక్ పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.1,50,000 ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

మీ కుటుంబ సభ్యుడిగా ఆశీర్వదించండి : ఇంటూరి



గుడ్లూరు : ఎన్నికల ప్రచారంలో ఇంటూరి నాగేశ్వరరావు



వలేటివారిపాలెం : మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, మే 2 : ప్రతి ఒక్కరూ మీ కుటుంబ సభ్యుడిలా ఆదరించి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కందుకూరు నియోజకవర్గం టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. వలేటివారిపాలెంలో ఏర్పాటు చేసిన టీడీపీ ఎన్నికల కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాంతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ వలేటివారిపాలెం మండలం ఎప్పుడూ టీడీపీకి కంచుకోట అన్నారు. మండలంలో గతం కంటే ఈసారి భారీ మెజారిటీ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. నాకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంలోనూ, ఎమ్మెల్యే అభ్యర్థిగా చంద్రబాబు నాయుడు టిక్కెట్ కేటాయించడంలోనూ దివి శివరాం సహాయ సహకారం ఎంతో ఉందని తెలిపారు. పార్టీ కోసం, రాష్ట్రం కోసం అధిష్ఠానం ఎవరికి ఏ బాధ్యతలు అప్పగిస్తే ఆ బాధ్యతలు చేయాలని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా శివరాంను గురువుగానే భావించి ఆయన అడుగుజాడల్లోనే నడుస్తానని తెలిపారు.



లింగసముద్రం : టీడీపీలో చేరిన వారితో ఇంటూరి

భావితరాల భవిష్యత్ చంద్రబాబుతోనే సాధ్యం : శివరాం

భావితరాల భవిష్యత్ చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం తెలిపారు. గ్రామాల్లో టీడీపీ కార్యకర్తల్లో చిన్న చిన్న విభేదాలను ఉన్నప్పటికీ అవి పక్కనపెట్టి నెల్లూరు పార్లమెంటు టీడీపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కందుకూరు నియోజకవర్గం టీడీపీ ఉమ్మడి ఎమెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావును అత్యధిక మెజారిటీతో గెలిపించి చంద్రబాబునాయుడను ముఖ్యమంత్రిని చేసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వలేటి శ్రీధర్‌నాయుడు, వలేటి నరసింహం, గుత్తా కొండయ్య, కొంకా రమేష్, వలేటి మధుసూదన్‌రావు. కుంబాల అంజయ్య, కాకుమాను అంజనేయులు, వీరమోసు అంజయ్య, కాకుమాను హర్ష, నవ్వులూరి రాజారమేష్, ఘట్టమనేని చెంచునాయుడు, టీ.రమణయ్య పాల్గొన్నారు.

వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరిక

లింగసముద్రం : మండలంలోని చినపవని పంచాయతీ పరిధిలోని సత్యనారాయణపురం గ్రామంలో వైసీపీకి చెందిన పలువురు టీడీపీలో చేరారు. గురువారం మధ్యాహ్నం కందుకూరు ఎన్‌డీఏ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో గ్రామంలోని వైసీపీకి చెందిన కేతినేని మాలకొండయ్య, సత్యనారాయణ, మాల్యాద్రి, గిరి, అయ్యప్ప, చొప్పరపు శేషయ్య, శ్రీనివాసులు, వేణు, నలగంగు మాల్యాద్రి, గొరైపాటి శంకర్ తదితరులు పార్టీలో చేరారు. నాగేశ్వరరావు వారికి టీడీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సోంపల్లి మనోహర్, ముళ్లపాటి చౌదరి, పారా బుచ్చయ్య, బోయపాటి వెంకటేశ్వర్లు, గొరైపాటి శ్రీనివాసులు, కొడాలి కోటేశ్వరరావు, చాగంటి మల్లికార్జున, మాధవరపు బ్రహ్మయ్య, ముళ్లపాటి మహేష్, ఉమ్మనేని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు 25వ వార్డులో...

కందుకూరు : పట్టణంలోని 25వ వార్డు ఎర్రవడ్డిపాలెంకు చెందిన యన మల పెదపోతురాజు, యనమల వెంకి, కుమార్, మల్లికార్జున, పల్లాపు శ్రీను, బెల్లంకొండ బాలరాజు కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుర్రం మల్లికార్జున, అత్తోట మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

1వ వార్డులో ప్రచారం

పట్టణంలోని 1వ వార్డు పరిధిలో ఉన్న ఎస్టీ కాలనీ, 23వ వార్డు స్కంధపురి సోమేశ్వరాలయం ప్రాంతాలలో టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి మ్యానిఫెస్టోలో కరపత్రాలు పంపిణీచేశారు. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, ప్రతిఒక్కరూ టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు, మన్నేపల్లి వరప్రసాదు, టీడీపీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసాదు, ముచ్చు శ్రీను, బెజవాడ వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటు.. అభివృద్ధికి పునాది

గుడ్లూరు : టీడీపీకి ఓటు వేస్తే రాష్ట్ర అభివృద్ధికి పునాది వేసినట్లేనని కందుకూరు నియోజక వర్గ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. రానున్న ఎన్నికల్లో తనఉ ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఇచ్చిన మాట తప్పకుండా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండడమే కాకుండా అండగా ఉంటామని కందుకూరు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని అమ్మవారిపాలెం, గుడ్లూరు ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఆయన ప్రచారం నిర్వహించారు. గుడ్లూరు ఎస్సీకాలనీలోని మాతమ్మ గుడి, రామాలయం, చర్చీలలో పూజలు, ప్రార్థనలు చేశారు. అనంతరం అమ్మవారిపాలెంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి రాగానేఅమలుపరిచే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని, ఆ తరువాత అక్రమంగా దోచుకోవడం, దాచుకోవడం తప్ప చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఒక్క అవకాశంతో ఐదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు అబద్ధపు వాగ్దానాలు, మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెట్టేందుకు జగన్ ప్రయత్నిస్తున్నాడన్నారు. విజనరీ కలిగిన నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాకపోతే రాష్ట్రంలో రౌడి రాజ్యం మళ్లీ రాజ్యమేలుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చగలిగిన నేత చంద్రబాబు నాయుడికి అందరం అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, పువ్వాడి వేణు, మేకపోతుల రాఘవయ్య, చెన్నారెడ్డి మహేష్, గద్దె సుందరావు, రావూరి వేణు, స్టీఫెన్ పాల్, చిత్తారి మల్లికార్జున, కావలి ఏసుదాస్ పాల్గొన్నారు.

ఓటేసే ముందు ఒక్క క్షణం ఆలోచించండి

● అభివృద్ధికి బ్రాండ్ చంద్రబాబునాయుడు ● తుమ్మలపెంటలో వేమిరెడ్డి, కావ్య, బీద ప్రచారం



రోడ్‌షోలో వేమిరెడ్డి, కావ్య, బీద రవిచంద్ర



టీడీపీలో చేరిన చెన్నాయపాలెం, పెదపట్టపుపాలెం మత్స్యకారులు

కావలి/కావలిరూరల్, మే 2: ప్రతి వ్యక్తి ఓటు వేసేముందు ఒక్క క్షణం ఆలోచించాలని, ఓటేసే ఐదు సెకన్లలో చేసే తప్పునకు ఐదేళ్లు బాధపడాల్సి వస్తోందని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అభివృద్ధికి ఒక బ్రాండ్ అని, ఆయనను గెలిపించుకుంటే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. గురువారం కావలిరూరల్ మండలం తుమ్మలపెంట పంచాయతీలోని తుమ్మలపెంట నుంచి కొత్తసత్రం వరకు కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డిలతో కలసి ఆయన రోడ్‌షో నిర్వహిస్తూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్‌కు టీడీపీ హయాంలోనే నిధులు మంజూరయ్యాయని, వాటిని వైసీపీ తెచ్చినట్లు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కావలి, తుమ్మలపెంట రోడ్డుకు గత టీడీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయని, వైసీపీ పాలనలో బిల్లులు రావని కాంట్రాక్టర్ పనులు చేయలేదంటే ఆ పాలనపై ఎంత విరక్తి చెందారో అర్థమవుతోందన్నారు.



తీరంలో రోడ్లపై వేసిన టీడీపీ గుర్తును పరిశీలిస్తున్న నాయకులు

● తీర ప్రాంత భూములపై ఎమ్మెల్యే కన్ను

కావలి తీర ప్రాంతంలో ఉన్న 4వేల ఎకరాలపై కావలి ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి కన్ను పడిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర తెలిపారు. వాటిని ఎమ్మెల్యే కాజేయాలని చూస్తున్నారని, వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని, ఆయన ఆటలు సాగనివ్వమన్నారు. జన్మభూమి కార్య క్రమంలో భాగంగా నారా లోకేష్ తుమ్మలపెంట వచ్చినపుడు ఈ ప్రాం తవాసులు తుమ్మలపెంట రోడ్డు డబుల్ రోడ్డు చేయాలని అడిగారన్నారు. దీంతో అప్పట్లో రోడ్డుకు నిధులు మం జూరు చేసినా వైసీపీ దాని నిర్మాణం చేపట్ట లేదన్నారు. రోడ్డు కోసం ఆందోళ నలు చేపట్టినా ఈ ప్రభుత్వానికి సీమ కుట్టిన ట్లు కూడా లేదన్నారు. ఎమ్మెల్యే ఈ రోడ్డు వెంబడి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి వాటికి వేల ట్రిప్పులు గ్రావెల్ తోలి రోడ్డును ధ్వంసం చేసినా గుంటలకు తట్టెడు మట్టి వేయలే దన్నారు. తుమ్మలపెంట ప్రాంతంలో పేదలు ఇళ్లు అడిగితే ఎమ్మెల్యే గుడిలో పడుకోమని ఎద్దేవా చేశారన్నారు. ఈ ప్రాంతానికి రారాజులు మత్స్యకారులేనని, అందుకు తగిన బుద్ధి చెపతారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అటవీశాఖ క్లియరెన్స్ చేసి నివేశ న స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించే బాధ్యత మా నలుగురుం తీసు కుంటామని చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి మాట్లా డుతూ రాష్ట్రంలో అరాచక, విధ్వంసక పాలన సాగిస్తున్న వైసీపీ ఫ్యాన్ రెక్కలు విరగకొ ట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. అరాచక ఎమ్మెల్యేను మరోసారి గెలిపిస్తే కావలి నియోజకవర్గంలో ఇంకేమీ మిగ లదన్నారు. టీడీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్ర మంలో కావలి రూరల్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆవుల రామకృష్ణ, ఉప్పాల వెంక ట్రావు, జనసేన నేత తిరుపతి స్వామి, బీజేపీ నాయకుడు మామిడి వెంకటేశ్వర్లు, టీడీపీ నేతలు, కాపులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు

కావలి : కావలి పట్టణం, రూరల్ మండలాల నుంచి పలువురు వైసీపీ నాయకులు గురువారం టీడీపీలో చేరారు. కావలిరూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ, ప్రళయకావేరి సురేష్ ల ఆధ్వర్యంలో చెన్నాయపాలెం పెద పట్టపుపాలెంకు చెందిన వెంకయ్య, తాతయ్య, జయరాం, నరసింహం, శ్రీను, ప్రసాద్, ముని, లక్ష్మయ్య తదిత ర 40 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరగా కావ్య క్రిష్ణారెడ్డి కపండువా కప్పి ఆహ్వానించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే వంటేరు ఆధ్వర్యంలో ఆయన అనుచరులు పామంజి తిరుపతి, గంగనగారి రాము, వాయిల తిరుప తితో కలిసి 10 కుటుంబాలు చేరగా వారికి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాక ర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిలు కండువాలు వేసి ఆహ్వానించారు. చెన్నాయపాలెంకు చెందిన 25 వైసీపీ కుటుంబాలు ఒక వలంటీర్ సహా టీడీపీలో చేరారు. తుమ్మలపెంట పంచాయతీ ఇందిరానగర్‌కు చెందిన 10 వైసీపీ కుటుంబాలు, అన్నగారిపాలెం పంచాయతీ మామిళ్ల దొరువుకు చెందిన 25 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. చలంచర్లకు చెందిన వైసీపీ కీలక నేతలు, రుద్రకోటకు చెందిన వైసీపీ ముఖ్యనేతలు టీడీపీలో చేరారు. పట్టణం లోని 14వ వార్డుకు చెందిన వైసీపీ సానుభూతిపరుడు కసుమూరు భాస్కర్ రెడ్డి, ఇంటూరి రమణయ్య, మందా పెద్దబ్బయ్యలు, 26వ వార్డుకు చెందిన వైసీపీ కీలకనేతలు కన్నె బాలకృష్ణ, జయంత్ టీడీపీలో చేరారు. పాతూరుకు చెందిన ప్రభాస్ ఫ్యాన్స్ గౌరవాధ్యక్షుడు పల్లెబోయిన కార్తీక్ వైసీపీని వీడి టీడీపీలో చేరారు.



వేమిరెడ్డికి తిలకం దిద్దుతున్న మహిళ

మాలేపాటి సోదరుల ప్రచారం

దగదర్తి(బిట్రగుంట), మే 2: దగదర్తి మండలంలోని పలు గ్రామాలలో మాలేపాటి సోదరులు, వారి కుమారుడు వేర్వేరుగా గురువారం ప్రచారం నిర్వహించారు. కౌరుగుంట పంచాయతీ సున్నపుబట్టిగ్రామం, ఎస్టీ కాలనీల్లో ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు ప్రచారం చేశారు. వైసీపీ ఏడవ వార్డు మెంబరు సుబ్బమ్మ, ఆమె భర్త శ్రీనివాసులుతో పాటు 30 మంది రవీంద్రనాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. దగదర్తి మెయిన్ విలేజ్ అరుగు సెంటర్, తదితర ప్రాంతాల్లో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు ఇంటింటి ప్రచారం చేపట్టారు. దగదర్తి గిరిజన కాలనీల్లో పార్టీ యువనేత మాలేపాటి భానుచందర్‌నాయుడు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ, బీజేపీ, జనసేనల ఉమ్మడి అభ్యర్థులు నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కావలి ఎమ్మెల్యేగా దగుమాటి క్రిష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు.

బోగోలులో తెలుగు తమ్ముళ్ల...

బిట్రగుంట : బోగోలు మండలంలో తెలుగు తమ్ముళ్లు విడివిడిగా ఎన్నిలక ప్రచారం నిర్వహించారు. బోగోలు మాజీ ఎంపీటీసీ చిలకపాటి వెంకటేశ్వర్లు, సీనియర్‌నాయకులు గనిపినేని నాగరాజుల ఆధ్వర్యంలో బోగోలు మార్కెట్ వీధి, కుమ్మరవీధి, మసీదు వీధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట టీడీపీ మండల మహిళ అధ్యక్షురాలు అరుణమ్మ, పార్వతి, వెంకట్రావు, ఎస్ఎస్ యాదవ్ తదితరులు ఉన్నారు. బోగోలు, అక్కరాజువారి కండ్రిక గ్రామాల్లో బోగిరి ప్రభాకర్ ఆధ్వర్యంలో యువత ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

జోరందుకున్న టీడీపీ ప్రచారం



ఇంటింటి ప్రచారంలో బినీత్‌రెడ్డి, చందన్‌రెడ్డి

అల్లూరు, మే 2 : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తెలుగు తమ్ముళ్ల ప్రచార జోరు పెంచారు. ఏ వార్డు నాయకులకు ఆ వార్డు కేటాయించిన నాయకులు తమ కార్యకర్తలతో కలసి ప్రచారాలను ముమ్మరం చేశారు. గురువారం అల్లూరు పేటలో కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మేనల్లుడు ఎ.చందన్‌రెడ్డిలతో కలసి స్థానిక నాయకులు మేడా రామకృష్ణారెడ్డి, మేడా కృష్ణారెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, యరటపల్లి శేఖర్‌రెడ్డి, బిట్రగుంట చైతన్య రెడ్డి, దయాకర్‌రెడ్డిలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. లీగల్ సెల్ నాయకుడు షేక్ రఫీమాలిక్ ఆధ్వర్యంలో అల్లూరు పట్టణ పరిధిలో పలు ప్రాంతాల్లో ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వం వస్తే వచ్చే పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే టీడీపీ పట్టణ అధ్యక్షుడు రామిశెట్టి కృష్ణచైతన్య ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అల్లూరు ఆర్‌డీఆర్ కాలనీలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను వివరిస్తూ కావలి అభ్యర్థిగా పోటీ చేస్తున్న కావ్య కృష్ణారెడ్డి, ఎంపీగా పోటీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పెనుమల్లి శ్రీనివాసులు రెడ్డి, ఖదీర్, వెంకటశేషయ్య, శీనయ్య, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

48 మంది వలంటీర్ల రాజీనామా

లింగసముద్రం, మే 2 : లింగసముద్రం మండలంలోని 13 సచివాలయాల పరిధిలోని ఉన్న 201 మంది వలంటీర్లలో ఇప్పటి వరకు 48 మంది రాజీనామా చేశారు. మరో ఇద్దరిని అధికారులే తొలగించారు. ప్రస్తుతం 13 151 మంది వలంటీర్లు ఉన్నారు. అయితే వైసీపీకి సేవ చేసేందుకు ఈ 48 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టు తెలిసింది.

ఎన్‌డీఏ అభ్యర్థులను గెలిపించండి

కొండాపురం, మే 1: ఉదయగిరి నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో ఉన్న ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మండలంలోని గుడవళ్లూరు పంచాయతీలో టీడీపీ నాయకులు పోలినేని చంద్రబాబు, పోలినేని రమేష్ ఆధ్వర్యంలో గురువారం కాకర్ల సురేష్ సోదరుడు సునీల్ సతిమణి సురేఖ ఇంటింటి ప్రచారం చేపట్టారు. ముందుగా గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలతోపాటు జనసేన, బీజేపీ ఉమ్మడి మ్యానిఫెస్టోలో ప్రవేశపెట్టిన అంశాలు అన్ని వర్గాల వారి సంక్షేమానికి తోడ్పడుతుందని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎం.ఓంకారం, పరిశీలకుడు కే.సుబ్బారావు, టీడీపీ నాయకులు దాసరి అశోక్, నర్రా శివన్నారాయణ, చిమ్మిలి రాంబాబు, సర్పంచు మాచెర్ల, యారవ క్రిష్ణయ్య, సీహెచ్.వెంకటాద్రి, దామా మహేశ్వరరావు, బీజేపీ అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున, జనసేన నాయకులు ఆకుల వెంకట్, ఎమ్ఆర్‌పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న కాకర్ల సురేఖ




బ్యాంకు గోడలపై వైసీపీ రంగులు

'కోడ్'లోనూ తొలగించని వైసీపీ రంగులు

కావలి రూరల్, మే 1: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా నిత్యం ఏదో ఒక చోట ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి. కావలి పట్టణం ఉదయగిరి రోడ్డులోని జనతాపేటలోబ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకుకు ఎదురుగా గతంలో వైసీపీ పార్టీ జెండా దిమ్మెను ఏర్పాటు చేశారు. అయితే పార్టీకి చెందిన మూడు రంగులను జెండా దిమ్మెతో పాటుగా విద్యుత్ స్తంభానికి, వెనుక వైపున ఉన్న విశ్వోదయ బాలుర పాఠశాల ప్రహరీకి రంగులు వేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో పాటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కూడా ఆ రంగులు అలాగే ఉండటం పట్ల అధికారుల తీరుపై పట్టణ వాసులు చర్చించుకుంటున్నారు.



సెంటిమెంట్



నృసింహుడిని దర్శించుకున్నాకే ప్రచారం

ఏ ఎన్నికలైనా, ఏ పార్టీ అభ్యర్థులైనా మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నాకే ప్రచారం మొదలు పెడతారు. కందుకూరు నియోజకవర్గంలో ఈ సెంటిమెంట్‌ను ప్రతి ఒక్క నేత కూడా పాటిస్తారు. స్వర్గీయ మాజీ స్పీకర్ దివి కొండయ్య చౌదరి, మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం, స్వర్గీయ జడ్పీ మాజీ చైర్మన్ గుత్తా వెంకటసుబ్బయ్య తదితరులు ఈ సెంటుమెంట్‌ను కొనసాగించారు. తాజాగా పోటీలో ఉన్న టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు, వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్‌లు కూడా ఇదే పద్ధతిని కొనసాగించారు. ఈ ఎన్నికల్లో సెంటిమెంట్ ఎవరికి వర్క్ అవుట్ అవుతుందో జూన్ 4 వరకు ఎదురుచూడాల్సిందే.

- వలేటివారిపాలెం

హలో.. అక్కడ ఎవరు గెలుస్తారు ?



'హలో.. మన దగ్గర ఎలక్షన్ ట్రెండ్ ఎలా ఉంది... ఈసారి ఎవరు గెలవబోతున్నారు. మన జిల్లాలో ఆ పార్టీకి ఎన్ని సీట్లు... ఈ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి..? పలానా అభ్యర్థికి మెజార్టీ ఎంత'... ? అంటూ దేశ, విదేశాల్లోనూ, పక్క జిల్లాల్లో ఉన్న బంధువులు, స్నేహితులు ఫోన్ల ద్వారా సమాచారం తెలుసుకుంటున్నారు. ప్రతిరోజు ఏదో ఒక సమయంలో స్థానికంగా ఉన్నవారికి కానీ ఫోన్ చేసి సమాచారం కనుక్కుంటున్నారు. ఎక్కువగా తెలంగాణ, మహారాష్ట్ర, చెన్నై, అమెరికా, దుబాయ్‌ల నుంచి ఉదయగిరి వాసులకు ఫోన్లు వస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఉద్యోగాలు/ వ్యాపారాలు చేస్తూ అక్కడ స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నవారు జిల్లా రాజకీయాలపై ఆసక్తి చూపుతున్నారు. వీరితోపాటు ఉద్యోగం, చదువుల కోసం అమెరికాకు వెళ్లిన వారు కూడా గెలుపోటములపై ఆరా తీస్తున్నారు.

- ఉదయగిరి

ప్రలోభాల పర్వం షురూ !

- ఓటర్ల ఫోన్ నెంబర్ల సేకరణ
- వేర్వేరు నెంబర్ల నుంచి మనీ ట్రాన్స్‌ఫర్

పంపకాల జోరు



ఇన్నాళ్లూ ఓ ఎత్తు. ఈ 10 రోజులు మరో ఎత్తు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను తమ దారిలోకి తెచ్చుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. బూత్‌ల వారీగా కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించి ఓటర్ల మొబైల్ నెంబర్లు సేకరిస్తున్నారు. కొంతమంది నాయకులు ఇప్పటికే ఫోన్ కాల్స్ ద్వారా వారిని పలకరిస్తున్నారు. కాగా మొబైల్ నెంబర్ల సేకరణపై భిన్న ప్రచారాలు సాగుతున్నాయి. నగదు బదిలీ కోసం వివరాలు తీసుకుంటున్నారన్న అభిప్రాయం పలువురిలో వ్యక్తమవుతోంది. నేరుగా నగదు పంపిణీకి క్షేత్రస్థాయిల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్న దృష్ట్యా పలువురు ఆన్‌లైన్‌లో బదిలీ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. యూపీఐ లావాదేవీలపై కూడా నిఘా ఉంటుందన్న ఎన్నికల అధికారుల హెచ్చరికల నేపథ్యంలో కొందరు కార్యకర్తలు జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. ఒక నెంబరు నుంచి ఎక్కువ మందికి డబ్బులు పంపడం కంటే, వేర్వేరు నెంబర్ల నుంచి పంపేందుకు వారు చర్యలు తీసుకుంటున్నారు. ఓటర్లకు సంబంధించి ఒకరిద్దరి నెంబర్లకు డబ్బులు పంపుతున్నారు. వారి ద్వారా ఆయా కుటుంబాల వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

- వలేటివారిపాలెం

- 'అమ్మఒడి' పథకంలో కోతలే కోతలు
- కొత్త నిబంధనలతో జాబితాలో పేర్ల గల్లంతు
- నిధులు మిగుల్చుకోవడంలో వైసీపీ సర్కారు సఫలీకృతం



జగన్మావయ్యా.. మోసం గురూ! ఇదేం మాయ!


పేద కుటుంబాల్లో తల్లిదండ్రులు తమ బిడ్డల విద్యావసరాల కోసం ఇబ్బంది పడకుండా అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులను జగన్మాయతో నమ్మించారు. ఎన్నికల సమయంలో ఓటర్లను బురిడీ కొట్టించేలా హామీలిచ్చిన జగన్ వీటి అమలు విషయంలో మాత్రం మాయలు చేశారు. పథకం ఆరంభం నుంచి ప్రతి ఏడాది కొత్త నిబంధనలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించుకుంటూ వచ్చారు. అనేక కొర్రీలతో అనర్హుల జాబితాను పెంచేశారు. అర్హులకు సైతం పూర్తిస్థాయిలో నగదు విడుదల చేయకుండా రెండో ఏడాది వెయ్యి, 3, 4 సంవత్సరాలు రూ.2వేలు తగ్గిస్తూ నిధులు మిగుల్చుకునేందుకు పన్నిన పన్నాగంలో సఫలీకృతమయ్యారు. గడిచిన ఐదేళ్లలో నాలుగు సార్లు మాత్రమే కోతలతో పథకాన్ని అందించి మాయ చేశారు.

- నెల్లూరు (విద్య)

జిల్లావ్యాప్తంగా 4,531 పాఠశాలల్లో 4 లక్షల మంది విద్యార్థులు, 215 జూనియర్ కళాశాలల్లో 50 వేల మంది ఇంటర్ చదువుతున్నారు. అమ్మఒడి ప్రారంభించిన తొలి సంవత్సరం 2019-20లో తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డులనే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన 2,20,607 మంది అర్హులకు రూ.15వేల చొప్పున నగదు జమ చేశారు. ఆ తర్వాత 2021-22లో 3,75,849 మందిని లబ్ధిదారులుగా గుర్తించగా వీరిలో 81,561 మందిని అనర్హులుగా ప్రకటించారు. మరో 6,698 దరఖాస్తులు పరిశీలనలో ఉంచామని చెపుతూ 2,43,497 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. పాఠశాలల పారిశుధ్యం మెరుగు పేరుతో ఒక్కో లబ్ధిదారుడికి వెయ్యి రూపాయలను తగ్గించి రూ.14వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. 2022-23లో ఈ జాబితాను మరింత వడబోసి 2,00,366 మందిని ఎంపిక చేసి విద్యా సంవత్సరం మధ్యలో మూడుసార్లుగా ఖాతాల్లో జమచేశారు. 2023-24లో అసలు ఈ పథకం ఇస్తారా లేదా అన్న సందేహాలు వ్యక్తం కాగా చివరకు నిబంధనలను మరింత కఠినతరం చేసి లబ్ధి దారుల సంఖ్యను 1,94,842 మందికి కుదించి నాలుగు విడతలుగా అందచేశారు.

నిబంధనలతో మెలిక

పథకం అమలుకు కొత్త నిబంధనలు తీసుకురావడంతో లబ్ధిదారుల సంఖ్యను కుదించేశారు. పలు కుటుంబాల్లో రూ.12వేల కంటే అధికంగా వేతనం పొందడం, అత్యధిక శాతం మంది 300 యూనిట్ల కంటే ఎక్కువగా విద్యుత్ వాడకం, 75శాతం విద్యార్థులకు హాజరు లేకపోవడం, తల్లుల పేరున్న రేషన్ కార్డుల్లో పిల్లల పేర్లు లేకపోవడం వంటి సాంకేతిక కారణాలతో ఎక్కువమందికి అమ్మఒడి తొలగించారు. రేషన్ కార్డులో కుటుంబ సభ్యులు ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లింపుదారుడు ఉన్నా, ఇంటి విస్తీర్ణం మోతాదుకు మించినా సంక్షేమ పథకాలు ఆపేశారు. అమ్మఒడికీ ఇవే నిబంధనలు వర్తింప చేసి విద్యార్థులపై అనర్హత వేటు వేశారు. వీటికి తోడు అన్ని అర్హతలు ఉన్నా అకౌంట్ల ఇన్‌యాక్టివ్ చూపడంతో మరికొంతమంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అమ్మఒడి లబ్ధిదారుల జాబితాలను సచివాలయాల్లో వెల్లడించగా వీటిలో అత్యధికంగా తిరస్కరణకు గురైన జాబితాలే ఉండటం గమనార్హం. ప్రధానంగా ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతోపాటు అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, ప్రైవేట్ సంస్థల్లో పీఎఫ్ సౌకర్యం ఉండే వారికి ఈ పథకం అందని పరిస్థితి ఏర్పడింది. ఇక విద్యుత్ వాడకం విషయానికి వస్తే మారిన జీవనశైలి నేపథ్యంలో గృహ అవసరాలకు విద్యుత్ ఆధారిత వస్తువుల వాడకం అధికమైంది. వీరిని అమ్మఒడికి అనర్హులంటూ తీసేశారు. అలాగే ఎన్నడూ లేని 75 శాతం హాజరు తప్పనిసరి చేయడంతో చాలామంది విద్యార్థులు ఈ పథకానికి దూరమయ్యారు. కరోనా నేపథ్యంలో చాలామంది పిల్లలను స్కూళ్లకు పంపకపోవడం, అత్యధికంగా వలసలు ఉండడం వలన హాజరు శాతం తగ్గతా దీనికి కోత విధించారు. అదేవిధంగా పట్టణాల్లో వెయ్యి చదరపు అడుగుల స్థలంలో ఇల్లు ఉన్నవారిని సైతం నిబంధనల పేరుతో నిలిపివేస్తూ కోతలే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరించడంతో విమర్శలకు గురైంది.



బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు

అమ్మఒడి జాబితాల్లో చాలామంది అర్హుల పేర్ల పక్కన ఇన్‌యాక్టివ్ అకౌంట్ అని చూపించింది. దీంతో వలంటీర్లు లబ్ధిదారులకు ఫోన్ చేసి మీ అకౌంట్ ఎన్‌పీసీఐ కాలేదని, వెంటనే బ్యాంకుకు వెళ్లి చేయించుకోవాలని, లేనిపక్షంలో అమ్మఒడి నగదు పడదని చెప్పడంతో తల్లులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. బ్యాంకుల వద్ద సర్వర్ పనిచేయడం లేదని కొందరు, తమ బ్యాంకులో నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)కు సంబంధించిన సర్వర్ లేదని, ప్రధాన బ్రాంచ్‌లకు వెళ్లాలని తెలపగా, కొన్నిచోట్ల గంటల తరబడి వేచిచూసిన తరువాత అకౌంట్‌కు ఎన్‌పీసీఐ చేయించుకున్నా అది మూడు రోజుల తర్వాత కానీ యాక్టివ్ కాదని చెప్పడంతో నిరుత్సాహానికి గురయ్యారు.

రెండుసార్లే ఇచ్చారు!

కావలిలోని ముసునూరుకు చెందిన ఆటోడ్రైవర్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు, జ్యోతి దంపతులకు వెంకట అనీష్, రిషేంద్ర ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఈ అన్నదమ్ముళ్లలో ఒక్కరికి మాత్రమే అమ్మఒడి అందింది. అదికూడా రెండుసార్లు మాత్రమే. మూడోసారి ఎందుకు రాలేదని అధికారుల చుట్టూ తిరిగినా వారు పట్టించుకున్న దాఖలాలు లేవు.

- బెల్లంకొండ జ్యోతి, ముసునూరు, కావలి

ఇంకా డబ్బులు పడలేదయ్యా!

2023-2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంకా డబ్బులు పడలేదు. పెనుబల్లి హైస్కూల్లో నా కూతురు భవ్యశ్రీ 10వతరగతి చదివి, పాసైంది. ఇంటర్‌లో చేర్పిద్దాం అనుకుంటే ఇంకా అమ్మఒడి డబ్బులు పడలేదు. ఇంతకూ పడతాయే లేదననే అనుమానం ఉంది. ఆ డబ్బు పడితే కాలేజీ ఫీజు అవసరాలు తీరుతాయి.

- కావేటి కల్యాణి, పెనుబల్లి, బుచ్చిరెడ్డిపాళెం

చిత్తశుద్ధి గల నేతకే నా ఓటు

యువగళం



నాకు కొత్తగా ఓటు వచ్చింది. నిజమైన పేదలందరికీ మేలు చేకూర్చాలన్న చిత్తశుద్ధి గల నేతకే నా ఓటు. నిరుపేదల కోసం పథకాలు ప్రవేశపెట్టే నాయకుడిని ఎన్ను కోవాలి. విద్య, వైద్యం అందరికీ అందుబాటు లోకి తీసుకు రావడంపై దృష్టి పెట్టే నేతను ఎన్నుకోవాలి. పార్టీలకతీతంగా ఆలోచించి చిత్తశుద్ధి కలిగిన నాయకుడిని అసెంబ్లీకి పంపాలి. అదే నా ఆలోచన. అలాంటి వారినే గెలిపించాలి.

- మోడెం దేవర్షి, కోవూరు

ప్యాకేజీల వీరులు.. ఓట్లు లేని ధీరులు !





తమ చేతిలో వందలాది ఓట్లు ఉన్నాయని, తాము ఏ పార్టీకి చెబితే వారంతా ఆ పార్టీకే ఓట్లు వేస్తారని చెప్పి కొంత మంది చోటా మోటా నేతలు అభ్యర్థుల వద్ద నుంచి రూ. లక్షల్లో ప్యాకేజీలు తీసుకోవడం నేడు అలవాటుగా మారింది. వీరి ధాటికి గ్రామాల్లో కొద్దోగొప్పో ఓట్లు ఉన్న నేతలు జీరోలుగా మారారు. ఓట్లు లేని ప్యాకేజీ వీరులు మాత్రం.. ఆహో... ఓహో... అంటూ ప్రచారం ఆర్భాటం చేస్తున్నారు. ఇలాంటి వారికి ప్యాకేజీలు ఇవ్వకపోతే అభ్యర్థులపై, పార్టీపై నెగిటివ్‌గా ప్రచారం చేస్తున్నారు. అంతేగాక వీరు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకుండా అజ్ఞాతంలోకి వెళ్తున్నారు. మరికొందరైతే ప్యాకేజీల కోసం పార్టీ మారుతున్నా మంటూ ప్రచారం చేసుకొంటున్నారు. ప్యాకేజీ వీరులు చేస్తున్న ఈ ప్రచారం ఆ నోటా ఈ నోటా పడి మండల స్థాయి నాయ కుల ద్వారా అభ్యర్థుల దృష్టికి వెళ్తోంది. దీంతో తమ గెలుపునకు ఎక్కడ ఇబ్బంది జరుగుతుందోననే భయతో అభ్యర్థులు వారిని పిలిపించి ప్యాకే జీలు ఇస్తున్నారు. కాగా ఓట్లులేని నాయకులకు ప్యాకేజీలు ఇవ్వ డంతో అవతల పార్టీ వారు ఎక్కడ విజయం సాధిస్తారోనని పలువురు గుసగుస లాడుతున్నారు.

- వలేటివారిపాలెం

మళ్లీ పాత రోజులొస్తున్నాయ్..!



ఏందిరా వచ్చేది పాత రోజులు...! ఎట్టావస్తయిరా కొండయ్యా...?

వస్తాయిలే ఎంకన్నా.. నిన్న చంద్రబాబు చెప్పిల్లా...!

ఏం చెప్పిండ్రా కొండయ్యా... చంద్రబాబు !

మన రైతులకు గతంలో మాదిరే గొర్రులు, నాగళ్లు, తైవాన్ పంపులు, డ్రిప్ పైపులు, స్ప్రింక్లర్లు గట్రా... అన్నీ కూడా సబ్సిడీపై ఇస్తాడంట ఎంకన్నా ...

ఓ బౌనా... ఐతే పరవా లేదురా కొండయ్యా... జగన్ ఈ ఐదేళ్లలో రైతు భరోసా తప్పనిచ్చి ఏమీ ఈలేదురా మన రైతులకి... గతంలో చంద్రబాబు అన్నీ ఇచ్చిండు. మన జిల్లావోడు సోమిరెడ్డి వ్యవసాయమంత్రిగా ఉన్నప్పుడు జింక్, బోరాన్, ఐరన్ లాంటి సూక్ష్మపోషకాలు ఉచితంగా ఇస్తే కదా..? మనకి అప్పట్లో వడ్ల దిగుబడి బాగా వొచ్చి ఎకరాకి యాభై బస్తాలకి పైనైనే అయినయ్యి కొండయ్యా...

అవును ఎంకన్నా.. అదే నేను చెప్పేది... అంతే కాదన్నా రైతులకు ఏడాది ఇరవైవేల రూపాయలు కూడా ఇస్తాడంట !

ఏందీ... కొండయ్యా.. ఇరవైవేలా ?

అవునన్నా మనకి జగను, మోదీ కలిపి ఇప్పుడు ఇచ్చేది ఏడాదికి పదమూడువేలా ఐదొందలు కదా... చంద్రబాబు ఇరవైవేలిస్తాడంట ఎంకన్నా...!

మరి జగను ఎంతిస్తానన్నాడు కొండయ్యా...?

ఏంది ఎంకన్నా... ఆయనిచ్చేది... పదారుయేలు ఇస్తాడంట !



ఏందిరో పదారేలా.. నిజమా.. అదేంద్రా నాయనా ఐదేళ్లు సీఎం ఉంటే ఒక్క రైతుకు కూడా గొర్రులు, నాగేళ్లు, పంపులు కూడా ఈయలే... మళ్లా వచ్చినా కూడా ఇయ్యు డేమో... ఒరే... మన రైతులకు మేలు చేసేది... చంద్రబాబేరా... ఆయన్నప్పుడు ట్రాక్టర్ నాగళ్లకు పదేలు కడితే ఇచ్చేవాళ్రా... మొన్నీమధ్య డెమానిస్ట్రేటర్‌ని అడిగితే సబ్సిడీలు లేవని చెప్పినారు. చేసేది లేక కావలికి పోయి ఇరవైయేలు పెట్టి కనుక్కొచ్చారా...

అవును ఎంకన్నా... మన రైతులకి చంద్రబాబు ఐతేనే సబ్సిడీలు ఇచ్చేది... అందుకే ఆయనకే మన ఓట్లు ఏస్తే పోలా !

అంతేరా... రైతులందరం సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు ఇచ్చే చంద్రబాబుకే ఓట్లేసి గెలిపించుకుందాం రా... కొండయ్యా...!

- జలదంకి

ప్రతి 'సారీ'!

- అందరికీ ఉద్యోగ కల్పన.. కాలుష్యాన్ని నివారిస్తాం
- ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార అస్త్రాలివే!
- తీరా గెలిచాక ముఖం చాటేస్తున్న వైనం
- ఐదేళ్లయినా నెరవేరని, జగన్, కాకాణి హామీలు

ఎన్నికల అస్త్రం





ముత్తుకూరు : ఎన్నికల్లో బరిలో నిలిచే అభ్యర్థులకు యుద్ధప్రాతిపదికన గుర్తొచ్చేవి నిరుద్యోగం, కాలుష్యం. ప్రతి ఎన్నికల్లోనూ ఇవే అంశాలను ప్రధాన ప్రచార అస్త్రాలుగా మార్చుకుని ఓట్లు దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశాలను వదిలేసి మళ్లీ ఐదేళ్లు కాగానే నెత్తిన పెట్టుకోవడం పరిపాటిగా మారింది. 2005 ఎన్నికల్లో అప్పట్లో నిరుద్యోగం నిర్మూలన అనే అంశం తెరపైకి వచ్చింది. 2009లో దీనికి కాలుష్య నియంత్రణ తోడైంది. 2014, 2019 ఎన్నికల్లో ఈ రెండు అంశాలనే ప్రస్తావిస్తూ అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్న చేశారు. నియోజకవర్గంలో ఎక్కడా నిరుద్యోగం అనే మాటే కనిపించదని, కాలుష్యాన్ని తరిమికొట్టే చర్యలు తీసుకుంటామని హామీలు గుప్పించారు. మండలంలో థర్మల్ కేంద్రాలు, అదానీ కృష్ణపట్నం పోర్టు, పామాయిల్ పరిశ్రమలు ఉన్నా స్థానికులు ఉద్యోగ అవకాశాలు కల్పించింది స్వల్పమే. అందులో అధిక శాతం రోజువారి కూలీలు కావడం గమనార్హం. కాంట్రాక్ట్ ఉద్యోగులుగా కొందరికి అవకాశం దక్కినా ఇప్పటివరకు పర్మినెంట్ చేసిన దాఖలాలు లేవు. మళ్లీ సార్వత్రిక ఎన్నికలు వచ్చిన నేపథ్యంలో మరోసారి నిరుద్యోగ నిర్మూలన, కాలుష్య నియంత్రణ తెరపైకి వచ్చాయి. ప్రధానంగా కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ తరలింపు అంశం ప్రధాన సమస్యగా ప్రస్తావనకు వస్తోంది. ఈ మూడు అంశాలను తాము అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామంటూ హామీలు గుప్పిస్తూ అధికార ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ముమ్మరం చేశారు. గత ఐదేళ్లలో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని, తాము అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామని ప్రజలకు చెప్పడంలో ప్రతిపక్షం కొంతమేర సఫలమైంది.

పేలని జ'గన్'!

వైసీపీ అధికారంలోకి రాగానే స్థానికులకు 70 శాతం ఉద్యోగాలు ఇస్తామని జగన్ తన పాదయాత్రలో హామీ ఇచ్చారు. మూడున్నరేళ్ల కిందట ప్రభుత్వం నుంచి జీవో తీసుకువచ్చి నిరుద్యోగం అనే మాటే కనిపించదని ప్రస్తుత మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి డాంబీకాలు పలికారు. ఆ తర్వాత ఉద్యోగాలు కల్పించే దిశగా ఎలాంటి చర్యలు లేవు. నైపుణ్య శిక్షణ కల్పిస్తామని ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పిన మాటలు గాలిలో కలిసిపోయాయి. మళ్లీ ఎన్నికలు రాగానే నిరుద్యోగ నిర్మూలన అంశాన్ని తెరపైకి తెచ్చారు.

కాలుష్య నియంత్రణ ఏదీ!?

ఏర్పడిన పరిశ్రమల ద్వారా ఏర్పడుతున్న కాలుష్యంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. థర్మల్ కేంద్రాల నుంచి వచ్చే బూడిద కాలుష్యం ఒకవైపు గ్రామాలను ముంచెత్తుతుండగా, కృష్ణపట్నం పోర్టులో దిగుమతి అవుతున్న బొగ్గు కాలుష్యం పరిసర గ్రామాలను తీవ్ర ప్రభావితం చేస్తోంది. అంతకుమించి పంటపాలెంలోని పామాయిల్ పరిశ్రమల వల్ల ఏర్పడుతున్న వాయు కాలుష్యం చుట్టుపక్కల గ్రామాల ప్రజలను అనారోగ్యం పాలుచేస్తోంది. రాత్రుళ్లు వచ్చే దుర్గంధం భరించలేక పోతున్నారు. గ్రామాల్లో ఊపిరితిత్తులు శ్వాసకోశ వ్యాధులతో రోజురోజుకు అధికమవుతుంది. పట్టించుకోవాల్సిన ప్రజాప్రతి నిధులు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేయగా మామూళ్ల మత్తులో తేలియాడుతున్న అధికారులు తూతూ మంత్ర చర్యలతో చేతులు దులుపుకుంటున్నారు.

నిరుద్యోగులను నట్టేట ముంచేశారు!



పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పిస్తూ జీవో తెచ్చామని చెప్పి నిరుద్యోగులను మభ్యపెట్టారు. ఒకరికి కూడా పరిశ్రమల్లో ఉద్యోగం కల్పించిన దాఖలాలు లేవు. మళ్లీ ఇప్పుడు నిరుద్యోగ నిర్మూలిస్తామని మాటలు చెబుతూ ఓట్లు దండుకునేందుకు వచ్చేశారు. వైసీపీ ప్రభుత్వం, మంత్రి కాకాణి నిరుద్యోగుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశారు.

- యల్లసిరి రాజేష్, పైనంపురం

పట్టించుకునేదెవరు!?



పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంతో ప్రజలు ప్రాణాలు పోతున్నా పట్టించుకునే వారు లేరు. పామాయిల్ పరిశ్రమల వల్ల వచ్చే వాయుకాలుష్యం కృష్ణపట్నం పోర్టులని బొగ్గు కాలుష్యం, థర్మల్ కేంద్రాల ద్వారా వచ్చే బూడిద కాలుష్యం ప్రజలను అనారోగ్యం పాలుచేస్తున్నాయి. పామాయిల్ కాలుష్యం వల్ల పరిసర గ్రామాల ప్రజలు ఊపిరితిత్తులు శ్వాసకోశ వ్యాధులతో అల్లాడుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రజాప్రతినిధులు, కాలుష్య నియంత్ర మండల అధికారులు పట్టించుకోలేదు.

- రొయ్యల రంగనాథ్, పంటపాలెం

రాష్ట్ర ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని ఓటేయాలి

- వైసీపీ నేతలు రాష్ట్రాన్ని పూర్తిగా దోచేశారు
- కండలేరు డ్యాంలో చేపలు.. గుడ్లను కూడా వదల్లేదు
- వెనుకబడ్డ రాపూరును అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తా
- వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ



పెనుబర్తిలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ

రాపూరు,(డక్కిలి) మే 2: రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని ప్రతిఒక్కరూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ ఓటర్లకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన గోనుపల్లి, ఆకలివలస, పెనుబర్తి, గుండవోలు, రాపూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి నారా చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిని చేయాలని విజ్ఞప్తి చేశారు. వెంకటగిరి నియోజకవర్గంలో వైసీపీ నేతల అరాచకాలు మితిమీరి పోయాయని మండిపడ్డారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పేదలకు ఉచితంగా ఇసుక, గ్రావెల్‌ను ఇస్తే.. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. కండలేరు జలాశయంలోని చేపలు.. వాటి గుడ్లను వైసీపీ నేతలు వదిలి పెట్టకుండా కొల్లగొట్టారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే వైసీపీ నేతలు తిన్నదంతా కక్కిస్తామని హెచ్చరించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కండలేరు జలాశంలో చేపలను పట్టుకోనే హక్కు అక్కడి గిరిజనులకు ఇస్తామన్నారు. ఇప్పుడు వైసీపీ పాలనలో అందుకు విరుద్ధంగా ఒక నేత కనుసన్నుల్లోనే మత్స్య సంపదంతా తరలిపోతుందన్నారు. ఈ వ్యవహారంపై టీడీపీ అధికారంలోకి రాగానే విచారణ చేపట్టి తిన్న ప్రతిపైసా కక్కిస్తామన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం గాలి వీస్తోందని, ఈ గాలికి ఫ్యాన్ రెక్కలు విరిగిపోవడం ఖాయమన్నారు. వెంకటగిరిలో తాను రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ఎంతో అభివృద్ధి చేశానన్నారు. ఈ సారి కూడా వెంకటగిరి నియోజకవర్గంలో టీడీపీ జెండానే ఎగురుతుందని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో వున్న పాలకుల దోపిడీతో గడిచిన ఐదేళ్ల ప్రజలు తీవ్రంగా నష్టపోయినట్లు చెప్పారు. నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు తప్పకుండా అమలు చేస్తారన్నారు. తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ కమలం గుర్తు, తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి, చెన్ను తిరుపాలరెడ్డి, చెన్ను అశోక్‌రెడ్డి, మధురెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, నువ్వుల శివరామకృష్ణ, దందవోలు వెంకటేశ్వర్లు రెడ్డి, ఖాజామొహిద్దీన్, ఏదోటి కోటేశ్వర నాయుడు, గూడూరు వెంకటేశ్వర్లు రెడ్డి, వలస రాఘవరెడ్డి, కండే రమణ్య, గుండవోలు రవీంద్రారెడ్డి, నలవడ్ల వెంకటరమణారెడ్డి, రమణమ్మ, కస్తూరి, పచ్చిగళ్ల రత్నయ్య పాల్గొన్నారు.

● నృసింహుడి సేవలో కురుగొండ్ల

అంతకముందు పెంచలనృసింహ స్వామిని మాజీ జిల్లా సెంట్రల్ బ్యాంకు చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, పెంచలకోన దేవస్థానం మాజీ చైర్మన్ తిరుపాలరెడ్డిలతో కలిసి కురుగొండ్ల దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటగిరిలో తనకు విజయం చేకూర్చేలా ఆశీర్వదించాలని రామకృష్ణ నృసింహస్వామిని వేడుకున్నారు. రాపూరులో మాజీ జడ్పీటీసీ సభ్యురాలితోపాటు పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు

సైకిల్ సునామీకి కాకాణి కొట్టుకుపోవడం ఖాయం

● మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



వెంకటాచలం: పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి సోమిరెడ్డి

వెంకటాచలం, మే 2: ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గంలో సైకిల్ సునామికి కాకాణి కొట్టుకుపోవడం ఖాయమని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తిక్కవరప్పాడు, వెంకటాచలం గ్రామాల నుండి 35 కుటుంబాలతో సహా వెంకటాచలం మాజీ ఉపసర్పంచ్ గంటా బాబు వైసీపీని వీడి వేదాయపాళెంలోని సోమిరెడ్డి కార్యాలయంలో టీడీపీలో చేరారు. వీరికి సోమిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజా యాదవ్, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి 30 కుటుంబాలు టీడీపీలో చేరిక

పొదలకూరు: మండలంలోని పులికల్లు, వెంకటాపురం, ఊసపల్లి, వావింటపర్తి, మొగళ్లూరు గ్రామాల్లో మాజీ మంత్రి, సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వెల్లువలా చేరికలు జరుగుతున్నాయని, గురువారం 30 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ చేరారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, పులిపాటి వెంకటరత్నంనాయుడు, నెల్లెం పెంచలయ్య, నల్లగట్ల వెంకటేశ్వర్లు, మల్లిశెట్టి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మనీ కల్చర్ మంత్రి కాకాణిని తరిమికొట్టండి

ముత్తుకూరు: టోల్గేట్ వసూళ్లు, అక్రమాలు, అరాచకాలతో మనీ కల్చర్ మంత్రిగా మారిన కాకాణిని తరిమికొట్టాలని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం దొరువులపాలెంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వనరులను దోచుకోవడం పనిగా పెట్టుకున్న కాకాణికి ఓటు అడిగే హక్కు లేదన్నారు. ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, బాబిరెడ్డి, మల్లికార్జునయాదవ్, బీజేపీ, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడి కోసం అక్క ప్రచారం

మనుబోలు: ఎన్నికల్లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన అక్క కట్టంరెడ్డి సంయుక్త మండలంలోని బద్దెవోలు, పల్లిపాళెం గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పొన్నూరు రామకృష్ణయ్య ఆధ్వర్యంలో ఆమె, ఆమె కుమారుడు విక్రమ్‌రెడ్డి ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు అందించి సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీని గెలిపించాలని అభ్యర్థించారు. కాగా, మనుబోలు గ్రామ టీడీపీ అధ్యక్షుడు సాని వెంకటరవణయ్య ఆధ్వర్యంలో కోదండరామపురానికి చెందిన పలు దళిత కుటుంబాలు గురువారం టీడీపీలో చేరాయి. నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి సోమిరెడ్డి కండువాలు వేసి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నాయకులు, తదతరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం

తోటపల్లిగూడూరు: మండలంలోని కొత్తపాలెం, వీలుకానిపల్లి, వరిగొండ, సౌత్‌ఆములూరు, నరుకూరు గ్రామాల్లో గురువారం టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపిరెడ్డి, పావని, మాజీ సర్పంచ్ చేవూరు శ్రీనివాసులు, మద్దిన గోపాల్‌నాయుడు, ఏపూరి కృష్ణగౌడ్, కర్పూరం శ్రీనివాస్‌రెడ్డి, గోపిరెడ్డి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 703 మంది గైర్హాజరు

వెంకటాచలం, మే 2: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలలో 703 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలలో 397 మంది మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 306 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

కామాక్షితాయి సేవలో కేంద్ర ఎన్నికల అధికారి

బుచ్చిరెడ్డిపాళెం, మే 2: మండలంలోని జొన్నవాడ ఆలయంలో గురువారం కేంద్ర ఎన్నికల అధికారి శ్రీరాంకుమార్‌గౌతమ్ (ఐఎఎస్) శ్రీమల్లికార్జునస్వామి, కామాక్షితాయి వార్లను దర్శించుకున్నారు. ముందుగా అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు, అనంతరం వారి గోత్ర నామాలతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రసన్న అండతో శ్మశానాన్ని సైతం ఆక్రమించారు : ప్రశాంతిరెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం: దామరమడుగులో ప్రచారం చేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



ఇందుకూరుపేట: ప్రచారం నిర్వహిస్తున్న నీలిమారెడ్డి

కోవూరు, మే 2: ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి అండతో వైసీపీ నాయకులు శ్మశానాన్ని సైతం ఆక్రమించుకున్నారని, తాను గెలిచిన వెంటనే కబ్జా చెర నుంచి శ్మశానాన్ని విముక్తి చేస్తానని నియోజకవర్గ ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం పడుగుపాడులో ఆమె ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రైతులు చితికి పోయారన్నారు. పెన్నానది పొర్లుకట్టల్ని సైతం నాయకులు దిగ మింగడంతో వరదల వల్ల కోవూరు, పడుగు పాడు ప్రాంత ప్రజానీకం తీవ్రంగా నష్ట పోయిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పంట కాలువల మరమ్మతులకు ప్రాధాన్యతనిస్తామని, నియోజక వర్గంలోని గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, ప్రతీ ఇంటికీ తాగునీరు అందిస్తామని, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును ఎన్ను కుంటే సూపర్‌సిక్స్ పథకాల్ని అమలుపరచుకోవచ్చన్నారు. పార్లమెంటు స్థానానికి పోటీచేస్తున్న తన భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించా ల్సిందిగా ఆమె కోరారు. ప్రచార కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇండ్ల రాఘవేంద్ర, గాదిరాజు చక్రవర్తి, జనసేన నాయకుడు చప్పిడి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, డీసీఎన్ శ్రీనివాసులు, విన్నకోటి రాఖీ, చెంబేటి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

జక్కా వెంకయ్య ఆదర్శంతో కోవూరు అభివృద్ధి చేస్తా

బుచ్చిరెడ్డిపాళెం : జక్కా వెంకయ్యను ఆదర్శంగా తీసుకొని అందరి సహకారంతో కోవూరు నియోజకవర్గాన్ని అవినీతి రహితంగా తీర్చిదిద్ది అభివృద్ధి చేస్తానని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం దామరమడుగు పంచాయతీలోని పల్లిపాళెం, దామరమడుగు, ఆర్ఆర్ (మతం కాలనీ) నగర్‌లో ఆ గ్రామ నాయకులు మహేష్, హరి, విష్ణు, అహ్మద్‌బాష రావచంద్రయ్య, లక్ష్మయ్య, జాఫర్‌లతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. పెన్నానది తీరం వెంబడి గ్రామాలకు వరదముంపు రాకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేయించి గ్రామంలో అన్ని సామాజిక వర్గాల ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని మాటిచ్చారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే రైతులు, ప్రజలు, యువతీ యువకుల నిరుద్యోగ సమస్యలు పరిష్కరిస్తానని, వైసీపీ తొలగించిన ఇళ్ళు, స్థలాలు, పింఛన్లు అర్హులైన ప్రతి ఒక్కరికీ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.

ధైర్యంగా వ్యాపారాలు చేసుకోవచ్చు

నియోజకవర్గంలో ఇకమీదట షాడో ఎమ్మెల్యేలు, నాయకులు ఉండరు... చిరు వ్యాపారుల నుంచి పెద్ద వ్యాపారులు దాకా నిర్భయంగా ఎవ్వరికీ కమిషన్లు ఇవ్వాల్సిన అవసరం లేకుం డా వ్యాపారాలు చేసుకోవచ్చని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆర్యవైశ్యులు, వ్యాపారస్తులకు హామీ ఇచ్చారు. గురువారం బుచ్చిలోని ఎస్ ఎస్ కల్యాణ మండపంలో మండల నాయకుడు ఎంవీ శేషయ్య అధ్వ ర్యంలో నిర్వహించిన ఆర్యవైశ్యులు, వ్యాపారస్థుల ఆత్మీయ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తిరివీధి రాధాకృష్ణయ్య, డి హరనాథ్, మయూరి ప్రభాకర్, దరిశి బాలనరసింహులు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు ఆర్యవైశ్య వ్యాపారస్థులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి : అర్జున్‌రెడ్డి

వేమిరెడ్డి దంపతులను గెలిపించాలంటూ బుచ్చి నగర పంచాయతీలోని 8,9 వార్డుల్లో వార్డుల ఇన్‌చార్జులు వింజం రామానాయుడు, మహేష్‌లతో కలిసి కుమారుడు అర్జున్‌రెడ్డి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రజలకు సూపర్ సిక్స్ ఎన్నికల మేనిఫెస్టో పథకాలను వివరించారు. ఈకార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడగా మారుస్తాం : నీలిమారెడ్డి

ఇందుకూరుపేట: కోవూరు నియోజకవర్గాన్ని పారి శ్రామికవాడగా మారుస్తామని ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమారెడ్డి పేర్కొన్నారు. మండలం లోని కొత్తూరు మేనాటిపాలెంలో గురువారం ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీచేసి బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తామని, ఇల్లు లేని ప్రతి పేదవారికి నివాస స్థలం ఇప్పిస్తామని తెలిపారు. ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను ఆశీర్వదించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కైలాసం ఆదిశేషారెడ్డి, మునగాల రంగారావు, రామచంద్రయ్య, కుమార్, నరసయ్య, బీజేపీ నాయకులు కైలాసం లావణ్య శ్రీనివాస్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపే లక్ష్యం : కోడూరు

కొడవలూరు: ఎన్నికల్లో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపే తమ లక్ష్యమని టీడీపీ మండల కమిటీ ఉపాధ్యక్షుడు కోడూరు సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలో మిక్కిలింపేట గ్రామంలో సర్పంచ్ కోడూరు బుజ్జిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని ఇంటింటికీ తిరిగి టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రజలు వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహేష్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కోవూరు సర్వేపల్లి

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

సైదాపురం, మే 2: టీడీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల పరిశీలకుడు తానంకీ నానాజీ అన్నారు. గురువారం రామసాగరం పంచాయతీ పరిధిలోని తూర్పుపూండ్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబు సూపర్-6 పథకాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణకు సైకిల్ గుర్తు, తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావుకు కమలం గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే నారా చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కట్టా మోహన్ కృష్ణారెడ్డి, జోగిపల్లి సర్పంచ్ గుంటమడుగు కృష్ణంరాజు, రాపూరు ఏఎంసీ మాజీ చైర్మన్ బెల్లంకొండ మస్తాన్ నాయుడు, మాజీ సర్పంచ్ అమ్మినేని సుబ్రమణ్యం నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ సరుపూరు వసంతలక్ష్మి, పెమ్మసాని దిలీప్‌చౌదరి, అరికట్ల మస్తాన్ నాయుడు, మేడికొండ రమణయ్య నాయుడు, దశయ్య నాయుడు, కేపీ రాజు పాల్గొన్నారు.

ఓటర్లను భయాందోళనకు గురిచేయడం తగదు : కరకటి

కొడవలూరు, మే 2: తమకు ఓటు వేయకపోతే సంక్షేమ పథకాలు అందవని ఓటర్లను, ప్రజలను భయాందోళనకు గురిచేయడం తగదని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరకటి మల్లికార్జున అన్నారు. నార్తు రాజుపాళెం టీడీపీ కార్యలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నార్తురాజుపాళెం గ్రామంలో రాజీనామా చేసిన వలంటీరు ఉద్యోగులతో కలిసి వైసీపీకి ఓటు వెయ్యకపోతే గురువారం అవ్వతాతలకు పింఛను రాదని భయాందోళనకు గురిచేశారని, వారిపై ఎలక్షన్ కమిషన్ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు రమా, విల్సన్ తదితరులున్నారు.

సైనిక్ స్కూల్ సొసైటీలో 'అదానీ'కి ప్రథమ స్థానం



అదానీ సైనిక్ స్కూల్ విద్యార్థులు

ముత్తుకూరు, మే 2 : సైనిక్ స్కూల్ సొసైటీ ప్రణాళిక అమలులో కృష్ణపట్నంలోని అదాని వరల్డ్ (సైనిక్) స్కూల్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈసందర్భంగా గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ సిరియాల మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం, సాయుధ దళాలలో చేరే విద్యార్థుల సంఖ్యను పెంచడం, దేశభక్తి, స్వావలంబన, నాయకత్వ లక్షణాలతో కూడిన యువజన సమాజాన్ని సృష్టించడం అదాని సైనిక్ స్కూల్ లక్ష్యమని తెలిపారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలి

మనుబోలు, మే 2: ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని ఈవోఆర్‌డి జీవిఎస్‌వి ప్రసాద్ కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఇన్‌చార్జి ఎంపీడీవో, తహసీల్దార్ రాకపోవడం విశేషం. గ్రామాల్లో ప్రజలకు నీటిసమస్య లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వజ్రమ్మ అధికారులను కోరారు. సమావేశానికి అధికార పార్టీ నాయకులు వచ్చినా అధికారులు అడ్డుచెప్పలేదు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపటిలోగా హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేయండి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (హరనాథపురం), మే 2: జిల్లాలోని అన్నీ నియోజకవర్గ కేంద్రాల్లోనూ, మున్సిపల్ కేంద్రాల్లోనూ శనివారం (4వతేదీ)లోగా ఓటరు హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగంపై రానున్న పదిరోజులపాటు స్వీప్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికలు నిర్వహణకు అన్నీ ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని ఆదేశించారు. ఈవీఎంల కమీషనింగ్, పోలింగ్ అధికారులకు శిక్షణ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లు, పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, కుర్చీలు, తాగునీటి వసతి ఏర్పాట్లకు సంబంధించి అన్నీ చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను ఈనెల 8వ తేదీలోగా ఏర్పాటు చేసుకుని, ట్రయల్‌రన్ నిర్వహించా లని కూడా ఆయన ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు ఫెసిలిటేషన్ సెంటర్లు అందరికీ తెలిసేలా ప్రచారం చేపట్టాలన్నారు.

15 మద్యం సీసాల స్వాధీనం



పట్టుబడిన మద్యం సీసాలు

మనుబోలు : మండల పరిధిలోని జాతీయరహదారి పక్కన వీరంపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఎన్నికల నేపథ్యంలో గురువారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మడమనూరు గ్రామానికి చెందిన బెల్టుషాపు నిర్వా హకుడు పన్నెం నరసయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనివద్దనున్న 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నరసయ్య గూడూరు, విందూరు ప్రాంతాల నుంచి మద్యంసీసాలు తీసుకువచ్చి బెల్టుషాపు నిర్వహిస్తున్నాడని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి అజయ్‌కుమార్ తెలిపారు.



బీసీ కార్పొరేషన్ పరిపాలనా భవనం

అటకెక్కిన 'ఆదరణ'

- పథకాలకు బీసీలు దూరం ● అయినా నోరుమెదపని సంఘాలు
- గతమెంతో ఘనం

నెల్లూరు (వీఆర్సీ) మే 2 : సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్రంలోని కులానికో కార్పొరేషన్‌ను ప్రకటించారు. అలా ప్రకటించిన 56 కార్పొరేషన్లకు చైర్మన్లను, డైరెక్టర్లను కూడా నియమించారు. ప్రస్తుతం ఆ కార్పొరేషన్లు ఎక్కడా కనిపించడం లేదు. కాగా గతంలో ఉన్న బీసీ, ఈబీసీ, కాపు, ఎంబీసీ కార్పొరేషన్‌లు మాత్రమే ఉన్నాయి. అవికూడా పేరుకు మాత్రమే. వాటికి ఎలాంటి నిధులూ లేవు. గతంలో బీసీల్లో కులవృత్తులు చేసుకునే వారికి అవసరమైన పనిముట్లను ఆదరణ పథకం ద్వారా అందించేవారు. ప్రస్తుతం అవేవీ ఇవ్వడంలేదు.

● ఐదేళ్లుగా నిరాదరణే..

సంవత్సరం	లబ్ధిదారులు (బీసీలు)	సబ్సిడీ (రూ. లక్షల్లో)
2014-15	3351	1074.52
2015-16	2533	922.23
2016-17	2427	1333.75
2017-18	3098	2136.20
	11409	5466.7

ఐదేళ్లుగా 100కు పైగా ఉన్న బీసీ కులాలకు నిరాదరణే మిగిలింది. సంచార జాతుల ఊసే లేకుండా పోయింది. ప్రకటనలకు పరిమితమేకానీ బీసీలకు పైసా కూడా అందనే లేదు. గతంలో బీసీలకు బీసీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులకు పలురుణాలను బ్యాంకుల అనుసంధానంతో ఇచ్చేవారు. ఇందుకుగానూ రూ. లక్షకు తగ్గకుండా ప్రతి లబ్ధిదారునికి సబ్సిడీ రూపంలో అందించే వారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకులు రుణ రూపంలో ఇచ్చేవి.

అలాగే కాపులకు 2015-16 నుంచి 2019 వరకు 6925 మందికిగానూ రూ.4789.00 లక్షలను సబ్సిడీగా అందించారు. ఈబీసీలు 481 మందికి గత ప్రభుత్వ హయాంలోనే రూ.393.55 లక్షలను సబ్సిడీగా అందించి ఆర్థికంగా అండగా నిలిచారు. అలాగే కుల వృత్తులు చేసుకునే వారికి ఆదరణ పథకం ద్వారా 14208 మంది రూ.2281.40 లక్షల విలువైన పనిముట్లు అందించారు. కానీ ఈ మూడేళ్ల కాలంలో బీసీలు ఎంత నిరాదరణకు గురయ్యారో అర్థమవుతుంది. ఇంతటి దారుణ పరిస్థితులు ఉన్నా ఏ ఒక్క బీసీ నాయకుడు కూడా తమకు సబ్సిడీ రుణాలు అందలేదని కానీ, ఆదరణ పథకం దక్కలేదనికానీ నోరు తెరచిన పాపాన పోలేదు.

సోమశిలలో 8.137 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మే 2: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు. గురువారానికి జలాశయంలో 8.137 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

హత్య కేసులో ఆరుగురి అరెస్ట్



నిందితుల వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ బాబీ

నెల్లూరు(క్రైం), మే 2: నెల్లూరులోని జాకీర్‌హుస్సేన్ నగర్‌లో ఇటీవల జరిగిన రవితేజ అనే యువకుడి హత్య కేసులో పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. గురువారం నవాబుపేట పోలీసు స్టేషన్‌లో నిందితుల వివరాలను స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎం బాబీ వెల్లడించారు. నగరంలోని కుసుమ హరిజనవాడకు చెందిన రౌడీషీటర్ పుట్టా బాలాజీ గత నెల 28వ తేదీ రాత్రి జాకీర్ హుస్సేన్ నగర్ వైపు వెళుతుండగా స్థానికంగా ఉన్న సాజిద్, సుల్తాన్ దాడిచేశారు. గాయపడ్డ బాలాజీ ఇంటికి వెళ్లి తన సోదరుడు చంద్రశేఖర్, స్నేహితులు శ్యాం అలియాస్ అంబాకబ్, బాబు, మరో ఇద్దరు మైనర్లతో కలిసి జాకీర్ హుస్సేన్‌నగర్‌కు వచ్చి సాజిద్, సుల్తాన్‌పై దాడిచేయసాగాడు. ఈ విషయం తెలుసుకున్న సాజిద్ స్నేహితుడు రవితేజ ఘటనా స్థలానికి చేరుకుని బాలాజీ బృందాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో నిందితులు కర్రతో రవితేజ తలపై దాడిచేయగా తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. రవితేజ తండ్రి శేషాద్రి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ బాబీ కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కర్రలు, మోటారుబైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ బాబీ, ఎస్ఐలు ఎస్ఏ రెహమాన్, సీహెచ్ చంద్రావతి, ఎం జోజి, హెడ్ కానిస్టేబుల్ పవన్‌కుమార్, కానిస్టేబుళ్లు రత్నయ్య, సురేంద్రబాబు, మోహన్ బాబు, వేణు, మస్తానయ్య, వెంకటేశ్వర్లు, బీ మస్తానయ్యను డీఎస్పీ అభినందించారు.

మద్యంపై ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్

● ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వరరెడ్డి



నగరంలోని మద్యం మాల్‌లో తనిఖీలు చేస్తున్న నాగమల్లేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైం), మే 2: మద్యం అక్రమ రవాణా, నిల్వకు సంబంధించి, ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లకు సంబంధించిన ఫిర్యాదుల కోసం జిల్లా ఎక్సైజ్ కార్యాలయం లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి కే నాగమల్లేశ్వరరెడ్డి తెలిపారు. ఫిర్యాదులను 0861-2331 159 నెంబరుకు తెలియజేయాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం నెల్లూరులోని పలు ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన పుటి నుంచి ఇప్పటి వరకు మద్యం దుకా ణాలు, బార్లలో తనిఖీలు చేపట్టి అక్రమంగా మద్యం అమ్ముతున్న వారిపై 17 కేసులు పెట్టి 23 మందిని అరెస్ట్ చేశామన్నారు. సుమారు రూ.1.20 కోట్ల విలువ చేసే 79,492 మద్యం సీసాలు, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అవకతవకలకు పాల్పడుతున్న 23 మంది సిబ్బందిని విధుల నుంచి తొలగించామని చెప్పారు. మద్యం దుకాణాల సిబ్బంది బార్ల యజమానులకు పెద్ద మొత్తంలో మద్యం అమ్మకాలు జరిపితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ములాఖత్ వేళల మార్పు

నెల్లూరు(క్రైం). మే 2: వేసవి తీవ్రత దృష్ట్యా జిల్లాలోని కావలి, ఆత్మకూరు సబ్ జైళ్లలో ఖైదీలతో వారి బంధువులు మాట్లాడుకునేందుకు నిర్వహించే ములాఖత్ వేళల్లో మార్పు చేశామని జిల్లా సబ్ జైళ్ల అధికారి సోపిరాల వెంకటేశ్వర రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ములాఖత్ సమయాన్ని మార్చామని తెలిపారు. ఖైదీల కుటుంబ సభ్యులు ఆ వేళలను పాటించాలని కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	140
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	248
స్కిన్‌లెస్	278
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6783
వెండి కిలో ధర	రూ. 82,200
వెండి ఒక గ్రాము	రూ. 84.20

ఎన్నికల పర్వం

నేడు సిటీలో 152 మందికి హోం ఓటింగ్



అధికారులతో సమీక్ష జరుపుతున్న ఆర్వో వికాస్ మర్మత్

నెల్లూరు(సిటీ), మే 2 : నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలో 152 మందికి శుక్రవారం హోం ఓటింగ్ నిర్వహించనున్నట్లు రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ తెలిపారు. ఈ మేరకు పరిశీలకులు, సెక్టార్ అధికారులతో ఆయన గురువారం సమీక్ష జరిపారు. హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వారు వారి ఇళ్ల వద్దనే ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే తయారు చేసి మ్యాప్ ఆధారంగా ఈ ఓటింగ్ ప్రక్రియ నడవాలన్నారు. ఎలాంటి లోపాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

జగన్‌ను సాగనంపాలి : కోటంరెడ్డి



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (వైద్యం), మే 2 : ఆర్టీసీ బస్ చార్జీలతోపాటు తొమ్మిది సార్లు కరెంటు చార్జీలు పెంచిన సీఎం జగన్‌ను గద్దె దిగాల్సిన అవసరం ఉందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. గురువారం నగరంలోని ఎన్టీఆర్ నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్‌డీఏ కూటమి మేనిఫెస్టో అందరినీ ఆకట్టుకుంటోందన్నారు. సిటీ నియోజకవర్గం నుంచి పొంగూరు నారాయణ గెలుపు ఆవశ్యకతను ఓటర్లకు వివరించారు. నగరం స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చెందాలంటే నారాయణను ఎమ్మెల్యేగా, జిల్లా అభివృద్ధి చెందాలంటే ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. వైసీపీ పాలనలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచేశారని, చివరకు చెత్తపై కూడా పన్ను వేశారని విమర్శించారు.

టీడీపీ మేనిఫెస్టోలో బ్రాహ్మణ అభివృద్ధికి హామీలు

నెల్లూరు (సాంస్కృతికం), మే 2 : బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమానికి ఎన్‌డీఏ కూటమి మేనిఫెస్టోలో పలు హామీలు పొందుపరిచారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బ్రాహ్మణ సాధికార సమితి సభ్యురాలు సుధా రవీంద్ర తెలిపారు. గురువారం నగరంలోని ఆమె స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే హిందూ దేవాలయాల ఆస్తులు, సత్రాల ఆస్తుల పరిరక్షణకు హిందూ ఎండోమెంట్ బోర్డు ఏర్పాటు చేస్తామనడం హర్షణీయమన్నారు. ప్రైవేటు దేవాలయాల్లో పని చేసే అర్చకులకు కనీస వేతనం ఉండేలా చట్టం చేస్తామని చెప్పారన్నారు. వైదిక, ఆగమ సంబంధ విషయాల్లో ఆయా ఆలయాలకు పూర్తి స్వయం ప్రతిపత్తి కల్పిస్తామని మేనిఫెస్టోలో తెలియజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ హామీ పత్రం బ్రాహ్మణులకు భరోసా కల్పిస్తోందని, బ్రాహ్మణ సంఘాలన్నీ ఎన్డీఏ కూటమి విజయానికి కృషి చేయాలని కోరారు.

కవితలతో ఓటర్లకు అవగాహన



కవిత వినిపిస్తున్న విద్యార్థిని హర్షిత

నెల్లూరు (సాంస్కృతికం), మే 2 : ఓటరు చైతన్యానికి నవ్యాంధ్ర రాష్ట్ర రచయితల సంఘం వినూత్న కార్యక్రమం నిర్వహిస్తోంది. పలు ప్రాంతాల్లో కవి సమ్మేళనాల ద్వారా ఓటు విలువ, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఆ సంఘం నాయకురాలు గోవిందరాజుల సుభద్రాదేవి కృషి చేస్తున్నారు. గురువారం ఎస్ఆర్‌కే విశ్వసాయి స్కూలులో ఓటరు చైతన్య కవి సమ్మేళనం జరిగింది. అంకబాబు, హర్షిత, సయ్యద్ నజ్మ, భారతి, రాజా, సునీల్, దయాకర్‌రెడ్డి, తదితరులు కవితలు వినిపించారు.

నెల్లూరు సిటీ
నెల్లూరు రూరల్

విచ్చలవిడిగా మందుబాబుల సంచారం

నాలుగ్గోడల నుంచి

నడివీధిలోకి!

- వైసీపీ పాలనలో మద్యం ధరల బాదుడే బాదుడు
- ప్రభుత్వం రాగానే పాత బ్రాండ్లకు మంగళం
- ప్రెసిడెంట్ మెడల్ నుంచి స్పెషల్ స్టేటస్ వరకు.. కొత్త కొత్త పేర్లతో అమ్మకం
- బార్లలో ఫుల్... దుకాణాల్లో నిల్
- ఓపెన్ డ్రింకింగ్ పేరుతో వేలాది కేసుల నమోదు

నెల్లూరు(క్రైం), మే 2 : గుట్టుచప్పుడు కాకుండా ఇంటికి దూరంగా ఉన్న మద్యం దుకాణంలో నాలుగు గోడల మధ్య కూర్చొని మద్యం సేవించి... వాసన రాకుండా చాక్లెట్ లేదా వక్కపొడి వేసుకొని ఇంటికి చేరుకునే వారు మందుబాబులు. ఇంట్లో పెద్దలకు తెలిసినా తెలియనట్లుగా హుందాగా ప్రవరిస్తూ మందు తాగొచ్చే వారు మరికొందరు... ఇవన్నీ ఐదేళ్ల కిందటి మాటలు. ప్రస్తుతం రోడ్ల పక్కన ఎక్కడ చెట్టు నీడ కన్పిస్తే అక్కడ కూర్చొని బహిరంగంగా మద్యం సేవించే స్థాయికి మందుబాబులను తీసుకు వచ్చింది వైసీపీ ప్రభుత్వం. ఎప్పుడూ కూడా పోలీసుస్టేషన్ వైపు కన్నెత్తి చూడని ఎంతోమంది మందుబాబులను ఓపెన్ డ్రింకింగ్ పేరుతో స్టేషన్‌మెట్లు ఎక్కేలా చేసింది ఈ ప్రభుత్వం.

2019 ఎన్నికలకు ముందు దశలవారీగా మద్య నిషేధం చేస్తామని, అప్పుడే వచ్చే (2024) ఎన్నికల్లో ఓటు అడుగుతామని జగన్ సెలవిచ్చారు. మద్యపాన నిషేధం విషయం పక్కన పెడితే ఊరూవాడా అంతా బెల్ట్ దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకువచ్చాయి. అంతేకాక మద్యం రేట్లను అమాంతం పెంచేసి ప్రజలను దోచుకుంది ఈ ప్రభుత్వం.



బజార్లో ఇలా ఏర్పాటు చేస్తేకానీ మందుబాబులు ఓటింగ్‌కు రారట...!

చక్రం తిప్పిన అధికార పార్టీ నేతలు

2022 ఆగస్టులో జిల్లాలోని బార్లకు టెండర్లను ప్రభుత్వం ఆహ్వానించింది. జిల్లా వ్యాప్తంగా 47 బార్లకు టెండర్లు పిలవగా, 69 మంది మాత్రమే పోటీలో నిలిచారు. టెండర్లు వేస్తామని ముందుకు వచ్చిన వారిని వేయనీయకుండా బెదిరింపులు చేపట్టి ప్రభుత్వం కేటాయించిన నగదు కంటే ఐదు నుంచి పదిశాతం మాత్రమే అధికంగా టెండర్లు తక్కువ మంది వేసేలా అధికార పార్టీ నాయకులు వ్యవహారం నడిపారు. బార్లు ఏర్పాట్లాక మద్యం ఎమ్మార్పీ కంటే రూ.60 నుంచి రూ.150 వరకు క్వార్టర్‌పై అమ్ముతూ మందుబాబులను దోచుకుంది.

● వైన్ షాపుల స్థానే ప్రభుత్వ మద్యం దుకాణాలు

వైసీపీ అధికారంలోకి వచ్చాక నూతన మద్యం పాలసీని అమల్లోకి తీసుకు వచ్చింది. అందులో భాగంగా ప్రైవేటు వైన్స్ స్థానంలో ప్రభుత్వ మద్యం దుకాణాలను తీసుకువచ్చింది. జిల్లాలో 2019 సెప్టెంబరు నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంతాలు, అద్దెకు ఇచ్చే ఇళ్లు, విధులు నిర్వహించే సిబ్బంది... ఇలా అనేక అంశాలు స్థానిక వైసీపీ నేతల కనుసైగల్లో నడిచాయి. ఇక ప్రభుత్వ మద్యం దుకాణాల వేళలు.. ఉదయం 10 నుంచి రాత్రి 8 వరకు అని నిర్దేశించారు. దీంతో ప్రభుత్వ దుకాణాలు మూసిన వెంటనే ఆయా ప్రాంతాల్లో బెల్ట్ దుకాణాల్లో మద్యం అమ్మకాలు జోరందుకునేవి. మద్యం ద్వారా ఆదాయం పెంచుకోవాలని చూసిన ప్రభుత్వం, ప్రభుత్వ మద్యం దుకాణాలతోపాటు లిక్కర్ ఎలైట్, మాల్స్‌ను ఏర్పాటు చేసింది.ఆలయాల వద్ద కూడా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో పలువురు ఆందోళనలకు దిగారు. అయినా ప్రభుత్వం దిగిరాలేదు. ఇక ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసే మందుబాబులను సిబ్బంది చులకనగా చూడటం, విసుక్కోవడం, అడిగిన బ్రాండ్లు లేవని చెప్పడం, చీప్ మద్యం లేవని చెప్పడంతో మందుబాబులు విసిగిపోయేవారు.

● అన్నీ కొత్త బ్రాండ్లే

రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా గతంలో మందుబాబులు సేవించే స్టాండెడ్ బ్రాండ్‌లు అందుబాటులో ఉండేవి. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక రాయల్‌స్టాక్, మెగ్‌డాల్, నాక్‌అవుట్, క్లాస్‌బర్గ్ ఇలా పాల బ్రాండ్ల మద్యాన్ని నిలిపివేసింది. గతంలో ఎప్పుడూ చూడని, కనీసం వినని బ్రాండ్ల మద్యంను తీసుకు వచ్చింది. ఆ మద్యం సేవించిన మందుబాబులు ఇదేమి మద్యం స్పిరిట్‌లా ఉంది, ఆకలి వేయటం లేదు, పిచ్చిపిచ్చిగా ఉంటుంది, అనారోగ్య సమస్యలు వస్తున్నాయి.... అంటూనే తాగుతూ ఉన్నారు. ఇప్పటికైనా దశలవారీగా మద్యనిషేధానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

ఏపీ భవిష్యత్తుకు బాబు గ్యారెంటీ

- జూన్ 4 తరువాత అన్నీ మంచి రోజులే
- టీడీపీ కూటమి రూరల్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మే 2 : అన్ని రంగాలలో చితికిపోయిన ఏపీని తిరిగి గాడిలోపెట్టే గ్యారెంటీ చంద్రబాబు తీసుకుంటారని నెల్లూరు రూరల్ టీడీపీ కూటమి అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొండ్లపూడి, దేవరపాళెం గ్రామాల్లో ఎన్నికల ప్రచార రోడ్ షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలు, నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలకు భరోసా ఇచ్చే విధంగా కూటమి మేనిఫెస్టో ఉందన్నారు. 2014-19 మధ్య టీడీపీ అందించిన పాలనకంటే మెరుగైన పరిపాలన కూటమి ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. జూన్ 4వ తేదీ తరువాత రాష్ట్రానికి అన్నీ మంచి రోజులేనని తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలన్నా, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలన్నా, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు రావాలన్నా, మహిళలకు భద్రత దక్కాలన్నా ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. నెల్లూరు రూరల్లో వైసీపీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా నిలిపివేసిన ప్రాజెక్టులన్నీ టీడీపీ అధికారంలోకి వచ్చాక పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

సౌత్‌మోపూరులో టీడీపీలో చేరిక..

మండలంలోని సౌత్‌మోపూరు గ్రామంలో వైసీపీకి టీడీపీ షాకిచ్చింది. గ్రామంలో బలమైన సామాజిక వర్గం నుంచి మన్నవరం వెంకటేశ్వర్లు, మధు, డబ్బుగుంట రమేష్, మాల్యాద్రి, వారి మిత్రబృందం రూరల్ టీడీపీ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి, ఆ పార్టీ నేత గిరిధర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, నారాయణరెడ్డి, తాటిపర్తి బాబు, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, పముజుల ప్రదీప్, రాపూరు చంద్రశేఖర్, భాస్కర్ యాదవ్, తుళ్లూరు రామయ్యగౌడ్ పాల్గొన్నారు.

నేటి రోడ్ షోకు తరలిరండి

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేనాని పవన్‌కల్యాణ్ శుక్రవారం నగరంలో రోడ్ షో నిర్వహిస్తారని కూటమి అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కేవీఆర్ పెట్రోలు బంకు కూడలి నుంచి ఆర్టీసీ, మద్రాసు బస్టాండ్ మీదుగా వీఆర్సీ కూడలి వరకు నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో రోడ్ షో సాగుతుందన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



ప్రచారంలో పాల్గొన్న కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు



రోడ్‌షోలో అభివాదం చేస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నారాయణ, వీపీఆర్‌ను ఆశీర్వదించండి

● పొంగూరు రమాదేవి

నెల్లూరు (విద్య), మే 2 : నగర ఎమ్మెల్యేగా నారాయణను, నెల్లూరు ఎంపీగా వీపీఆర్‌ను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి, ఎన్‌డీఏ కూటమి నగర అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి కోరారు. గురువారం నగరంలోని 13, 50 డివిజన్లలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి మేనిఫెస్టోను ప్రతి సామాజిక వర్గానికి ఉపయోగపడేలా రూపొందించారన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ పనిచేస్తుందని చెప్పారు. గతంలో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధే దీనికి నిదర్శనమని, నగరంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించడం ఆనందంగా ఉందన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు మేలు...

సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు మేలు జరుగుతుందని పొంగూరు నారాయణ కుమార్తె శరణి తెలిపారు. నగరంలోని 11వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు, మహిళలు గడిచిన ఐదేళ్లలో పడ్డ ఇబ్బందులను ప్రచారంలో తెలియచేశారన్నారు. కరోనా సమయంలో కుటుంబ పెద్ద మృతి చెందితే కనీసం తమను ఆదుకునేందుకు కూడా ఎవరూ రాలేదని ఆవేదన చెందారన్నారు. ప్రజలంతా రానున్న ఎన్నికల్లో నగర ఎమ్మెల్యేగా నారాయణను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



ప్రచారంలో చిన్నారితో నారాయణ సతీమణి రమాదేవి



ఎన్‌డీఏ కూటమి పథకాలను వివరిస్తున్న నారాయణ కుమార్తె శరణి

టీడీపీ వస్తే 20లక్షల ఉద్యోగాలు...

టీడీపీ ప్రభుత్వంలో యువతకు 20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని నారాయణ మరో కుమార్తె సింధూర తెలిపారు. నగరంలోని 45, 47 డివిజన్లలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అధికారం చేపట్టిన తొలి వంద రోజుల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తారన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీకి అండగా ఉండి ఎమ్మెల్యేగా నారాయణను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

నేడు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సభ

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ శుక్రవారం నెల్లూరు నగరంలో పర్యటిస్తున్నారని మాజీ మంత్రి, కూటమి నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని గోమతినగర్ క్యాంపు కార్యాలయంలో ఆయన గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఇద్దరు అధినేతల పర్యటనకు ఇప్పటికే విస్తృత ఏర్పాట్లు చేశామని, పార్టీ శ్రేణులంతా కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని కోరారు. సాయంత్రం 6.15 గంటలకు కేవీఆర్ పెట్రోల్ బంక్ వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని, నర్తకి సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

బీసీలను విస్మరించిన జగన్

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌రావు

నెల్లూరు (విద్య), మే 2 : రాష్ట్రంలో బీసీలను సీఎం జగన్మోహన్‌రెడ్డి పూర్తిగా విస్మరించి వారికి అన్యాయం చేశారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌రావు విమర్శించారు. నగరంలోని గోమతినగర్‌లోగల నగర అభ్యర్థి పొంగూరు నారాయణ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గానే చూస్తున్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమతో చర్చించి భావితరాల భవిష్యత్‌కు సహకరించాలని, రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారన్నారు. దీనికి బీసీ రాష్ట్ర సంఘం ఆమోదం తెలియచేయడంతోపాటు పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. బీసీల పక్షపాతి అయిన టీడీపీని కాపాడుకుంటామన్నారు. అభివృద్ధికి మారుపేరైన పొంగూరు నారాయణను నెల్లూరు ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు ప్రజలు ఇప్పటికే సిద్ధమయ్యారని తెలిపారు. నారాయణ మాట్లాడుతూ బీసీలందరూ టీడీపీకి మద్దతు ప్రకటించడం సంతోషకరమన్నారు. రానున్న ఎన్నికల్లో 160 సీట్లు ఎన్‌డీఏ కూటమి సాధించడం ఖాయమన్నారు. బీసీలంతా కూడా ఎన్నికల్లో టీడీపీకి అండగా ఉండి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీహరియాదవ్, నేతలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రావు, పక్కన నారాయణ తదితరులు

నేడు తుపాను నాటిక ప్రదర్శన

నెల్లూరు (సాంస్కృతికం), మే 2 : సాహితీకారుడు పులుగుండ్ల రామకృష్ణయ్య 70 ఏళ్ల క్రితం రచించిన తుపాను నాటికను శుక్రవారం పురమందిరంలో ప్రదర్శిస్తున్నట్లు అభినయ ఆర్ట్స్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఉదయం 9గంటల నుంచి పాటలు, డ్యాన్సుల పోటీలు జరుగుతాయని తెలిపింది. అభినయ ఆర్ట్స్ 10వ వార్షికోత్సవం, సీఆర్ రాఘవ సతీమణి సులోచనమ్మ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కళాభిమానులు పాల్గొనాలని కోరింది.

జనసేనాని పర్యటనను జయప్రదం చేయండి

● జనసేన పార్టీ నగర అధ్యక్షుడు సుజయ్



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 2: ఎన్నికల ప్రచారంలో భాగంగా జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం నగరంలో పర్యటించనున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు సుజయ్‌బాబు పిలుపునిచ్చారు. పార్టీ నగర కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్, చంద్రబాబు రోడ్‌షో నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంకు సెంటర్ నుంచి ప్రారంభమవుతుందన్నారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, పవన్‌కల్యాణ్ అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

టీడీపీతోనే మహిళ సాధికారత




సైకిల్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న దేవి

నెల్లూరు(సిటీ), మే 2 : టీడీపీ అధికారంలోకి వస్తేనే మహిళ సాధికారిత సాధ్యమవుతుందని కేతంరెడ్డి దేవి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 48వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం ఆమె పర్యటించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 13న ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుకు ఓటేయాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు భద్రత ఉంటుందన్నారు. ఆర్థిక పరమైన ప్రయోజనాలన్నీ మహిళల ద్వారానే కుటుంబానికి అందచేయడం జరుగుతుందని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం లభిస్తుందని తెలిపారు.

పశు వైద్యం ... అందని దైన్యం

- మృత్యువాత పడుతున్న మూగజీవులు
- నష్టపోతున్న పాడిరైతులు

కొడవలూరు, మే 2 : గ్రామాల్లో పశువైద్యం అందడం గగనంగా మారింది. గ్రామాల్లో పాడిరైతులకు సలహాలు, సూచనలిస్తూ వైద్యసేవలదించాల్సిన సిబ్బంది జాడ కనిపించడంలేదు. పశువులకు కాలానుగుణంగా వచ్చే వ్యాధుల నివారణపై అవగహన కల్పించే పరిస్థితి కూడా లేదని రైతులు వాపోతున్నారు. కొన్ని వ్యాధులకు మందులు ఆర్బీకే, పశువైద్యశాలల్లో లేకపోవడంతో బయటి నుంచి కొనుగోలు చేయాల్సివస్తోందని వాపోతున్నారు. కొడవలూరు మండలం కొత్తవంగల్లు, యల్లయపాలెం, పెయ్యలపాలెం, కమ్మపాలెం, రేగడిచెలిక గ్రామాల్లో ప్రజలు ఎక్కువ పాడిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కొడవలూరు, యల్లయపాలెం, కమ్మపాలెంలో పశు వైద్యశాలలున్నాయి. గతంలో పెయ్యలపాలెంలో ఆవులు, ఎద్దులకు లీపీ వైరస్ చర్మవాధిసోకి సూమారు రెండునెలల్లో పదుల సంఖ్యలో మృత్యువాతపడ్డాయి. కొత్త వంగల్లులో గొర్రెలు, మేకలకు గాలి, పిల్లి ముసురు, నోటి జబ్బు, బొబ్బర , గాలికుంటు వ్యాధులు సోకాయి. సూమారు 70కి పైగా గొర్రెలు, మేకలు మృత్యువాత పడ్డాయి. దీంతో తీవ్రంగా నష్టపోతున్నట్లు పాడి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సకాలంలో వైద్య సేవలు అంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



● పశువులు చనిపోతున్నాయి..పి.చెంగయ్య పాడి రైతు కోత్తవంగల్లు

మా పశువులకు సరైన వైద్యం అందడంలేదు. టీకా మందులు వెయ్యడం లేదు. గతేడాది మా గ్రామంలో సూమారు 25కు పైగా గేదెలు, మూగ పశువులు మరణించాయి.



హలో లోకేశ్... సక్సెస్

'ఏటా సింగిల్ జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం. నిరుద్యోగులు పేపర్లు తీసుకుని వెతుక్కోవాల్సిన అవసరం లేదు. నోటిఫికేషన్‌లో ప్యూన్ నుంచి గ్రూప్ 1, 2 వరకు పోస్టులు ప్రకటిస్తాం. యూనిఫైడ్ పోర్టల్ తీసుకువస్తాం. ఒక వెబ్‌సైట్‌లో మీ వివరాలు నమోదు చేస్తే ఏ పరీక్షకైనా వెళ్లే వెసులుబాటు కల్పిస్తాం'

'చంద్రబాబు హయాంలో పెట్టుబడుల్లో, గ్రామీణ ఉపాధిలో, మహిళల భద్రతలో, సంక్షేమ కార్యక్రమాల్లో రాష్ట్రం నెంబరు వన్.జగన్ హయాంలో గంజాయి, డ్రగ్స్‌తో పాటు బూమ్‌బూమ్, ఆంధ్ర గోల్డ్, ప్రెసిడెంట్ మెడల్ వంటి ప్రమాదకరమైన మద్యానికి, కోడికత్తికి, గులకరాయికి, పరిశ్రమలను పక్క రాష్ట్రాలకు తరిమేయడంలో, పెట్రోల్, డీజిల్, గ్యాస్, కరెంట్ ధరలు పెంచడంలో నెంబరు వన్'

'సీసీసీ అంటే ఏంటో తెలుసా? చంద్రగిరి, చెవిరెడ్డి, చెవిలో పువ్వు. ఐదేళ్లలో 2 వేల కోట్లు సంపాదించాడు చెవిరెడ్డి.ఆయన పనైపోయింది కాబట్టే పక్క జిల్లాకు వెళ్లిపోయాడు. ఇప్పుడు జూనియర్ వచ్చి చెవిలోపువ్వు పెట్టేందుకు సిద్ధమయ్యాడు. రెండుసార్లు ఈ కుటుంబానికి అవకాశమిచ్చారు. మీ జీవితాలు మారాయా? ఒక్క పరిశ్రమైనా, ఉద్యోగమైనా వచ్చిందా?'



'ల్యాండ్, శాండ్, మైన్స్... ఏదీ వదిలిపెట్టడు ఈ పాపాల పెద్దిరెడ్డి.నేను జిల్లాలో పాదయాత్ర చేసినప్పుడు ఎక్కడికి వెళ్లినా ఒకే రకమైన టిప్పర్, ఒకే రకమైన జేసీబీ. దానిపై పీఎల్ఆర్. పాపాల పెద్దిరెడ్డి సామ్రాజ్యం ఏస్థాయికి వెళ్లిందో చూడండి.చిత్తూరు జిల్లాను క్యాన్సర్‌లా పట్టి పీడిస్తున్న ఈ కుటుంబానికి ఓటు ద్వారా రేడియేషన్ ఇవ్వండి.'

'మై డియర్ జగన్ టైం, డేట్ నువ్వు ఫిక్స్ చేయ్. నేను చంద్రబాబును తీసుకొస్తా. ఇక్కడే తిరుమల ఉంది. నువ్వు ముందు మెట్లు ఎక్కుతావా, లేదా చంద్రబాబు ముందు ఎక్కుతారో చూద్దాం. అప్పుడు మునిలోడు ఎవరో ప్రజలే నిర్ణయిస్తారు'

హలో లోకేశ్ కార్యక్రమం యువతలో ఉత్సాహాన్ని నింపింది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చంద్రగిరి సమీపంలోని ఐతేపల్లి వద్ద గురువారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల ప్రాంతాలనుంచీ వేలాదిమంది యువతీ యువకులు తరలిరావడంతో సభా ప్రాంగణం కళకళలాడింది. తొలుత టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పార్టీ పతాకాలతో తొండవాడనుంచి భారీ ర్యాలీ నిర్వహించారు.ప్రపంచానికే ఒక విజనరీ నాయకుడైన చంద్రబాబు నాయుడు జన్మించిన నేల ఈ చంద్రగిరి అంటూ ప్రసంగాన్ని మొదలుపెట్టిన లోకేశ్ ప్రసంగంలో రాజకీయ చెణకులు యువతచేత చప్పట్లు కొట్టించాయి.తరువాత పలువురు యువతీయువకులు అడిగిన ప్రశ్నలకు లోకేశ్ తనదైన శైలిలో సమాధానాలిచ్చి ఆకట్టుకున్నారు. అంతకుముందు బీజీఎస్ కల్యాణమండపంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అభ్యర్థులతో లోకేశ్ సమీక్షించారు. తాజా రాజకీయ పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఎన్ఆర్‌ఐలతో సమావేశమై ఫొటోలు దిగారు.అనంతరం పలువురు వైసీపీ నాయకులు ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు.

- చంద్రగిరి





సగంమందికీ అందని పెన్షన్లు

బ్యాంకు ఖాతాల్లో జమ కాని నగదు

సచివాలయాలు, బ్యాంకుల వద్ద వృద్ధులు, వికలాంగుల పడిగాపులు

తిరుపతి, మే 2 (ఆంధ్రజ్యోతి): సా... తా పెన్షన్లు జిల్లాలో సగంమందికి కూడా అందలేదు. జిల్లాలోని 2,70,390మంది పెన్షనర్లకు నెలవారీ రూ. 80.48 కోట్లు పంపిణీ కావాల్సి వుంది. ఏప్రిల్ నెలకు సంబంధించిన ఈ మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేసినట్టు ప్రకటించింది. ఇందులో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ఆధార్ కార్డు బ్యాంకు ఖాతాలకు లింకైన 2,00,868మందికి నేరుగా వారి ఖాతాలకు నగదు జమ చేసినట్టు ప్రకటించింది. మిగిలిన 69,522 మందికి రూ. 20.21 కోట్లు సచివాలయ సిబ్బంది ద్వారా ఇళ్ల వద్దనే పంపిణీ చేస్తామని ప్రకటించింది.బుధవారం 53,206 మందికి, గురువారం 64506 మందికి మొత్తం రూ. 18.79 కోట్లు పంపిణీ చేసినట్టు జిల్లా యంత్రాంగం ప్రకటన జారీ చేసింది.బ్యాంకు ఖాతాల్లో పెన్షన్ నగదు జమ చేసినట్టు అధికారులు ప్రకటించడంతో ఖాతాలు కలిగిన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఎండన పడి బ్యాంకులకు పరుగులు తీశారు.అయితే కొద్దిమందికి మాత్రమే నగదు ఖాతాల్లో జమైంది. ఎక్కువ శాతం మందికి జమ కాలేదని సిబ్బంది చెప్పడంతో ఇళ్లకు పోయి మళ్లీ రావడం ఎందుకని మధ్యాహ్నం వరకూ బ్యాంకుల వద్దే పడిగాపులు కాయడం కనిపించింది. ఖాతాల్లో జమ కాలేదని తెలిసి కొందరు, ఇళ్ల వద్దకు వచ్చి ఇస్తారని తెలియక కొందరు ఇలా పలువురు సచివాలయాలకు కూడా వెళ్లి వాకబు చేయడం కనిపించింది. సచివాలయాల్లో సిబ్బంది తమ దగ్గరున్న లిస్టులు పరిశీలించి కొందరిని తిరిగి బ్యాంకులకు పంపుతుండగా మరికొందరిని ఇళ్లకు వెళ్ళండి తామే వచ్చి ఇస్తామని చెప్పి పంపుతున్నారు.

బ్యాంకుల్లో సవాలక్ష సమస్యలు

బ్యాంకుల్లో నగదు కాని వారి సమస్య ఒకలా వుండగా నగదు జమైన వారి సమస్యలు రెండింతలు కనిపిస్తున్నాయి. పలువురు లబ్ధిదారుల ఖాతాలు యాక్టివ్‌గా లేవు. నెలల తరబడీ లావాదేవీలు జరపకపోవడంతో చాలావరకూ ఫ్రీజ్ అయ్యాయి. వాటిని తిరిగి యాక్టివ్ చేసి ఆపరేట్ చేయడానికి బ్యాంక్ పాస్ బుక్,ఆధార్ కార్డుల జిరాక్స్ ప్రతులు ఇవ్వాల్సి వస్తోంది.ఆ పనిపై ఒకటికి రెండు సార్లు బ్యాంకులకు తిరగాల్సి వస్తోంది. మరోవైపు ఖాతాల్లో మినిమం బ్యాలెన్స్ లేనివారికి ఆ వ్యవధికి తగ్గట్టు నెలకు రూ. 15 చొప్పున పెన్షన్ నగదులో ఆటోమేటిగ్గా కట్ అయిపోతోంది.



పెరుమాళ్ళపల్లి వృద్ధురాలికి హోసూరులో పెన్షన్ జమ

తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్ళపల్లి పంచాయతీలోని లక్ష్మీచెరువు గ్రామానికి చెందిన ఈమె పేరు లక్ష్మి. చెర్లోపల్లిలోని కెనరా బ్యాంకులో పెన్షన్ డబ్బులు తీసుకుందామని వెళ్ళి వాకబు చేస్తే ఇంకా జమ కాలేదని చెప్పారు. దాంతో పడుతూ లేస్తూ సచివాలయం దారి పట్టింది. అక్కడ విచారిస్తే పెన్షన్ తమిళనాడు రాష్ట్రం హోసూరులోని తమిళనాడు గ్రామీణ బ్యాంకు ఖాతాలో జమైందని చెప్పడంతో ఆమె ఖంగుతింది. తాను గతంలో హోసూరులో నివాసం వున్నామని, అయితే అక్కడ తనకు బ్యాంకు అకౌంట్ వుందన్న సంగతి కూడా తెలియదని, ఇపుడు పెన్షన్ డబ్బు కోసం అంత దూరం వెళ్ళి రావాలా అంటూ వాపోయింది.

ఎప్పుడు పడితే అప్పుడొచ్చి తీసుకోమంటున్నారు!



తూకివాకం పంచాయతీ ఎర్రంరెడ్డి పాలెం నుంచీ పెన్షన్ తీసుకుందామని ఎండనపడి వచ్చా. తీరా వస్తే అకౌంట్లో పెన్షన్ పడలేదని చెప్పారు. మళ్ళా ఎప్పుడు రమ్మంటారని అడిగితే చెప్పడం లేదు. ఎప్పుడు అకౌంట్లో డబ్బు పడితే అప్పుడొచ్చి తీసుకో అని చెబుతున్నారు. సరిగా సమాధానం చెప్పేవారే లేరు. ఎన్నిసార్లు తిరగాలో ఏమో...

-సుబ్బయ్య, ఎర్రమరెడ్డిపాలెం, రేణిగుంట మండలం

బ్యాంకులో పడలేదు... సచివాలయంలోనూ ఇవ్వడంలేదు!



నా వయసు 83 ఏళ్ళు చెర్లోపల్లి బ్యాంకులో పెన్షన్ పడిందేమోనని అడిగితే ఇంకా పడలేదన్నారు. దాంతో మల్లవరం సచివాలయానికి వచ్చి అడిగాము. ఇంకా లిస్టు రాలేదని చెబుతావుండారు. బ్యాంకులో పడుతుంది... మళ్ళా చెక్ చేసుకోండి... పడకపోతే మేమే ఇంటికి వచ్చి ఇస్తామని చెబుతా వుండారు. అంతా అయోమయంగా వుంది. ఎండకు తిరగల్లంటే ఇబ్బందిగా వుంది.

- రామయ్య, సి.మల్లవరం, తిరుపతి రూరల్ మండలం

మృత్యువులోను వీడని బంధం

రోడ్డుప్రమాదంలో ట్యాక్సీ డ్రైవరు సహా ముంబాయి దంపతుల మృత్యువాత



బస్సు ఢీకొనడంతో నుజ్జునుజ్జైన కారు - డ్రైవర్ మురుగన్ మృతదేహం



ఏర్పేడు, మే 2: బస్సు ఢీకొన్న ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులూ మరణించిన సంఘటన గురువారం సాయంత్రం ఏర్పేడు మండలంలో చోటు చేసుకుంది.సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు... ముంబాయికి చెందిన మెక్లోడియస్ ఫార్మాస్యూటికల్ కంపెనీలో చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న లలిత్ సింఘాల్(57), తన భార్య మంజు(52)తో కలిసి తిరుమల వెంకన్న దర్శనార్థం విమానంలో బుధవారం ఉదయం చెన్నైకి చేరుకున్నారు. అక్కడినుంచి ట్యాక్సీలో తిరుపతి వెంకన్న దర్శనానికి బుధవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. గురువారం ఉదయం శ్రీవారి దర్శనం తరువాత శ్రీకాళహస్తీశ్వరుడి దర్శనానికి బయలుదేరారు. మార్గమధ్యమైన ఏర్పేడు మండలం మేర్లపాక వద్ద ఉన్న పద్మావతి హోటల్ సమీపంలో జాతీయ రహదారిపై తిరుపతి వెళుతున్న తమిళనాడు ఆర్టీసీ ఏసీ బస్సు వీరి కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ట్యాక్సీ డ్రైవర్ మురుగన్(28) అక్కడికక్కడే మృతి చెందగా లలిత్ సింఘాల్, మంజు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న ఏర్పేడు పోలీసులు వీరిని తిరుపతి శివార్లలోని నారాయణాద్రి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ తుది శ్వాస విడిచారు.వారి కుటుంబసభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. ముగ్గురి మతృదేహాలను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.



దంపతులు అంజు- లలిత్ సింఘాల్(ఫైల్‌ఫొటోలు)

సకాలంలో వైద్యం అందక నిండు గర్భిణి మృతి



గర్భిణి చెల్లమ్మ మృతదేహం

కేవీబీపురం, మే 2 :సకాలంలో వైద్యం అందక ఓ గర్భిణి మృతి చెందింది.మృతురాలి కుటుంబీకుల కథనం మేరకు...కేవీబీపురం మండలం రంగయ్యగుంట పంచాయతీ తిమ్మినాయుడుగుంట గిరిజన కాలనీకి చెల్లమ్మకు బుధవారం రాత్రి ప్రసవనొప్పులు ప్రారంభమయ్యాయి.ఏఎన్ఎం, ఆశా వర్కరు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లమన్నారు.అయితే అవకాశం లేక గురువారం ఉదయం తీసుకెళదామని కుటుంబసభ్యులు నిర్ణయించుకున్నారు. అయితే గురువారం తెల్లవారుజామున చెల్లమ్మకు నొప్పులు అధికం కావడంతో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు.అప్పటికి మరో పేషెంటును శ్రీకాళహస్తికి తీసుకెళ్లిన అంబులెన్స్ అక్కడినుంచి కాలనీకి చేరుకునేటప్పటికి సమయం పట్టింది.చెల్లమ్మను అంబులెన్స్‌లో ఎక్కించి కొద్దిదూరం తీసుకువచ్చేసరికి బీపీ బాగా తగ్గిపోయి చెల్లమ్మ అపస్మారక స్థితికి చేరుకుని కాసేపటికి మృతి చెందింది.అంబులెన్సు సిబ్బంది ఆమెకు ఎటువంటి వైద్యం అందించలేదని చెల్లమ్మ కుటుంబ సభ్యులు ఆరోపించారు.అంబులెన్సు సిబ్బంది మాత్రం తాము ఫోన్ వచ్చిన వెంటనే బయల్దేరి 37నిమిషాల్లో కాలనీకి చేరుకున్నామని, వాహనంలో కావాల్సిన పరికరాలున్నా చెల్లమ్మ పరిస్థితి అప్పటికే విషమంగా ఉండడంతో ఆస్పత్రికి తీసుకెళ్లేసరికే మార్గమధ్యంలో మృతి చెందిందని తెలిపారు. ఆమెను తీసుకెళ్లి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి అప్పగించగా వైద్యులు పరీక్షించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు తెలిపారు.




వానొచ్చింది!

తిరుపతిలో వర్షం

తిరుపతి అర్బన్/తిరుమల, మే 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలుప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం చిరుజల్లులు కురిసాయి.వేసవితాపంతో అల్లాడిపోతున్న జనం వర్షం కురుస్తోందని ఆనందించేలోపు ఆగిపోవడంతో నీరసపడ్డారు.పెద్దవర్షం కాకపోవడంతో ఉక్కబోత మరింత పెరిగింది.తిరుమలలో మాత్రం ఉరుములు, భారీ ఈదురుగాలతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు భారీగా ఉరుములతో కూడిన వాన పడింది. వర్షం తర్వాత తిరుమల వాతావరణం చల్లబడింది. పాకాల మండలంలో గాలివానతో పలు చోట్ల చెట్లకొమ్మలు విరిగిపోయాయి. ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.రామచంద్రపురం మండలంలోని అనుపల్లి, వేపకుప్పం ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటివర్షం కురిసింది.మామిడికాయలు నేలరాలాయి. ఎండ తీవ్రతకు అల్లాడుతున్న జనం కొంత ఉపశమనం పొందారు.

నిమ్మరైతు పంట పండింది

గూడూరు అర్బన్, మే 2: గూడూరు నిమ్మమార్కెట్‌లో రైతులకు కాసుల పంట పండుతోంది. గురువారం కిలో నిమ్మకాయలను రికార్డు స్థాయిలో రూ.122కు డీబీఆర్ కంపెనీ కొనుగోలు చేసింది. వేసవితాపం ఉధృతంగా ఉండడంతో పాటు ఉత్తరభారత ప్రాంతాల్లో డిమాండ్ పెరగడంతో నిమ్మధరలకు రెక్కలొచ్చాయని వ్యాపారులు చెబుతున్నారు. 50 కిలోల టిక్కీ బస్తా ధర రూ.6,100 కాగా, లూజు 80 కిలోల బస్తా ధర రూ.9,760 పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. గతవారం ఇదే నిమ్మ ధరలు కాయల నాణ్యతను బట్టి కిలో ధర రూ.60నుంచి రూ.90వరకు పలికాయి. గురువారం కిలో రూ.80 నుంచి రూ.122 వరకు పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎండల తీవ్రత పెరుగుతుండడంతో ధరలు ఇంకా పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



జన కేతనం

ఆంధ్రజ్యోతి
శుక్రవారం 3 మే 2024

సెంటిమెంట్



నృసింహుడిని దర్శించుకున్నాకే ప్రచారం

ఏ ఎన్నికలైనా, ఏ పార్టీ అభ్యర్థులైనా మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నాకే ప్రచారం మొదలు పెడతారు. కందుకూరు నియోజకవర్గంలో ఈ సెంటిమెంట్‌ను ప్రతి ఒక్క నేత కూడా పాటిస్తారు. స్వర్గీయ మాజీ స్పీకర్ దివి కొండయ్య చౌదరి, మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం, స్వర్గీయ జడ్పీ మాజీ చైర్మన్ గుత్తా వెంకటసుబ్బయ్య తదితరులు ఈ సెంటిమెంట్‌ను కొనసాగించారు. తాజాగా పోటీలో ఉన్న టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు, వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్‌లు కూడా ఇదే పద్ధతిని కొనసాగించారు. ఈ ఎన్నికల్లో సెంటిమెంట్ ఎవరికి వర్క్ అవుట్ అవుతుందో జూన్ 4 వరకు ఎదురుచూడాల్సిందే.

- వలేటివారిపాలెం

హలో.. అక్కడ ఎవరు గెలుస్తారు ?

ఉత్కంఠ



'హలో.. మన దగ్గర ఎలక్షన్ ట్రెండ్ ఎలా ఉంది... ఈసారి ఎవరు గెలవబోతున్నారు. మన జిల్లాలో ఆ పార్టీకి ఎన్ని సీట్లు... ఈ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి..? పలానా అభ్యర్థికి మెజార్టీ ఎంత'... ? అంటూ దేశ, విదేశాల్లోనూ, పక్క జిల్లాల్లో ఉన్న బంధువులు, స్నేహితులు ఫోన్ల ద్వారా సమాచారం తెలుసుకుంటున్నారు. ప్రతిరోజు ఏదో ఒక సమయంలో స్థానికంగా ఉన్నవారికి కాని ఫోన్ చేసి సమాచారం కనుక్కుంటున్నారు. ఎక్కువగా తెలంగాణ, మహారాష్ట్ర, చెన్నై, అమెరికా, దుబాయ్‌ల నుంచి ఉదయగిరి వాసులకు ఫోన్లు వస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఉద్యోగాలు/ వ్యాపారాలు చేస్తూ అక్కడ స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నవారు జిల్లా రాజకీయాలపై ఆసక్తి చూపుతున్నారు. వీరితోపాటు ఉద్యోగం, చదువుల కోసం అమెరికాకు వెళ్లిన వారు కూడా గెలుపోటములపై ఆరా తీస్తున్నారు.

- ఉదయగిరి

ప్రలోభాల పర్వం షురూ !

మందుకు జోరు

- ఓటర్ల ఫోన్ నెంబర్ల సేకరణ
- వేర్వేరు నెంబర్ల నుంచి మనీ ట్రాన్స్‌ఫర్



ఇన్నాళ్లూ ఓ ఎత్తు. ఈ 10 రోజులు మరో ఎత్తు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను తమ దారిలోకి తెచ్చుకునేందుకు సర్వశక్తులా ఒడ్డుతున్నారు. బూత్‌ల వారీగా కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించి ఓటర్ల మొబైల్ నెంబర్లు సేకరిస్తున్నారు. కొంతమంది నాయకులు ఇప్పటికే ఫోన్ కాల్స్ ద్వారా వారిని పలకరిస్తున్నారు. కాగా మొబైల్ నెంబర్ల సేకరణపై భిన్న ప్రచారాలు సాగుతున్నాయి. నగదు బదిలీ కోసం వివరాలు తీసుకుంటున్నారన్న అభిప్రాయం పలువురిలో వ్యక్తమవుతోంది. నేరుగా నగదు పంపిణీకి క్షేత్రస్థాయిల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్న దృష్ట్యా పలువురు ఆన్‌లైన్‌లో బదిలీ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. యూపీఐ లావాదేవీలపై కూడా నిఘా ఉంటుందన్న ఎన్నికల అధికారుల హెచ్చరికల నేపథ్యంలో కొందరు కార్యకర్తలు జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. ఒక నెంబరు నుంచి ఎక్కువ మందికి డబ్బులు పంపడం కంటే, వేర్వేరు నెంబర్ల నుంచి పంపేందుకు వారు చర్యలు తీసుకుంటున్నారు. ఓటర్లకు సంబంధించి ఒకరిద్దరి నెంబర్లకు డబ్బులు పంపుతున్నారు. వారి ద్వారా ఆయా కుటుంబాల వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నారు.


- వలేటివారిపాలెం

పేద కుటుంబాల్లో తల్లిదండ్రులు తమ బిడ్డల విద్యావసరాల కోసం ఇబ్బంది పడకుండా అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులను జగన్మాయతో నమ్మించారు. ఎన్నికల సమయంలో ఓటర్లను బురిడీ కొట్టించేలా హామీలిచ్చిన జగన్ వీటి అమలు విషయంలో మాత్రం మాయలు చేశారు. పథకం ఆరంభం నుంచి ప్రతి ఏడాది కొత్త నిబంధనలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించుకుంటూ వచ్చారు. అనేక కొర్రీలతో అనర్హుల జాబితాను పెంచేశారు. అర్హులకు సైతం పూర్తిస్థాయిలో నగదు విడుదల చేయకుండా రెండో ఏడాది వెయ్యి, 3, 4 సంవత్సరాలు రూ.2వేలు తగ్గిస్తూ నిధులు మిగుల్చుకునేందుకు పన్నిన పన్నాగంలో సఫలీకృతమయ్యారు. గడిచిన ఐదేళ్లలో నాలుగు సార్లు మాత్రమే కోతలతో పథకాన్ని అందించి మాయ చేశారు.

- నెల్లూరు (విద్య)

- 'అమ్మఒడి' పథకంలో కోతలే కోతలు
- కొత్త నిబంధనలతో జాబితాలో పేర్ల గల్లంతు
- నిధులు మిగుల్చుకోవడంలో వైసీపీ సర్కారు సఫలీకృతం

జగన్మాయయ్యా..




ఇదేం మాయ!

జిల్లావ్యాప్తంగా 4,531 పాఠశాలల్లో 4 లక్షల మంది విద్యార్థులు, 215 జూనియర్ కళాశాలల్లో 50 వేల మంది ఇంటర్ చదువుతున్నారు. అమ్మఒడి ప్రారంభించిన తొలి సంవత్సరం 2019-20లో తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డులనే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన 2,20,607 మంది అర్హులకు రూ.15వేల చొప్పున నగదు జమ చేశారు. ఆ తర్వాత 2021-22లో 3,75,849 మందిని లబ్ధిదారులుగా గుర్తించగా వీరిలో 81,561 మందిని అనర్హులుగా ప్రకటించారు. మరో 6,698 దరఖాస్తులు పరిశీలనలో ఉంచామని చెపుతూ 2,43,497 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. పాఠశాలల పారిశుధ్యం మెరుగు పేరుతో ఒక్కో లబ్ధిదారుడికి వెయ్యి రూపాయలను తగ్గించి రూ.14వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. 2022-23లో ఈ జాబితాను మరింత వడబోసి 2,00,366 మందిని ఎంపిక చేసి విద్యా సంవత్సరం మధ్యలో మూడుసార్లుగా ఖాతాల్లో జమచేశారు. 2023-24లో అసలు ఈ పథకం ఇస్తారా లేదా అన్న సందేహాలు వ్యక్తం కాగా చివరకు నిబంధనలను మరింత కఠినతరం చేసి లబ్ధి దారుల సంఖ్యను 1,94,842 మందికి కుదించి నాలుగు విడతలుగా అందచేశారు.

నిబంధనలతో మెలిక

పథకం అమలుకు కొత్త నిబంధనలు తీసుకురావడంతో లబ్ధిదారుల సంఖ్యను కుదించేశారు. పలు కుటుంబాల్లో రూ.12వేల కంటే అధికంగా వేతనం పొందడం, అత్యధిక శాతం మంది 300 యూనిట్ల కంటే ఎక్కువగా విద్యుత్ వాడకం, 75శాతం విద్యార్థులకు హాజరు లేకపోవడం, తల్లుల పేరున్న రేషన్ కార్డుల్లో పిల్లల పేర్లు లేకపోవడం వంటి సాంకేతిక కారణాలతో ఎక్కువమందికి అమ్మఒడి తొలగించారు. రేషన్ కార్డులో కుటుంబ సభ్యులు ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లింపుదారుడు ఉన్నా, ఇంటి విస్తీర్ణం మోతాదుకు మించినా సంక్షేమ పథకాలు ఆపేశారు. అమ్మఒడికీ ఇవే నిబంధనలు వర్తింప చేసి విద్యార్థులపై అనర్హత వేటు వేశారు. వీటికి తోడు అన్ని అర్హతలు ఉన్నా అకౌంట్ల ఇన్‌యాక్టివ్ చూపడంతో మరికొంతమంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అమ్మఒడి లబ్ధిదారుల జాబితాలను సచివాలయాల్లో వెల్లడించగా వీటిలో అత్యధికంగా తిరస్కరణకు గురైన జాబితాలే ఉండటం గమనార్హం. ప్రధానంగా ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతోపాటు అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, ప్రైవేట్ సంస్థల్లో పీఎఫ్ సౌకర్యం ఉండే వారికి ఈ పథకం అందని పరిస్థితి ఏర్పడింది. ఇక విద్యుత్ వాడకం విషయానికి వస్తే మారిన జీవనశైలి నేపథ్యంలో గృహ అవసరాలకు విద్యుత్ ఆధారిత వస్తువుల వాడకం అధికమైంది. వీరిని అమ్మఒడికి అనర్హులంటూ తీసేశారు. అలాగే ఎన్నడూ లేని 75 శాతం హాజరు తప్పనిసరి చేయడంతో చాలామంది విద్యార్థులు ఈ పథకానికి దూరమయ్యారు. కరోనా నేపథ్యంలో చాలామంది పిల్లలను స్కూళ్లకు పంపకపోవడం, అత్యధికంగా వలసలు ఉండడం వలన హాజరు శాతం తగ్గతా దీనికి కోత విధించారు. అదేవిధంగా పట్టణాల్లో వెయ్యి చదరపు అడుగుల స్థలంలో ఇల్లు ఉన్నవారిని సైతం నిబంధనల పేరుతో నిలిపివేస్తూ కోతలే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరించడంతో విమర్శలకు గురైంది.



బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు

అమ్మఒడి జాబితాల్లో చాలామంది అర్హుల పేర్ల పక్కన ఇన్‌యాక్టివ్ అకౌంట్ అని చూపించింది. దీంతో వలంటీర్లు లబ్ధిదారులకు ఫోన్ చేసి మీ అకౌంట్ ఎన్‌పీసీఐ కాలేదని, వెంటనే బ్యాంకుకు వెళ్లి చేయించుకోవాలని, లేనిపక్షంలో అమ్మఒడి నగదు పడదని చెప్పడంతో తల్లులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. బ్యాంకుల వద్ద సర్వర్ పనిచేయడం లేదని కొందరు, తమ బ్యాంకులో నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)కు సంబంధించిన సర్వర్ లేదని, ప్రధాన బ్రాంచ్‌లకు వెళ్లాలని తెలపగా, కొన్నిచోట్ల గంటల తరబడి వేచిచూసిన తరువాత అకౌంట్‌కు ఎన్‌పీసీఐ చేయించుకున్నా అది మూడు రోజుల తర్వాత కానీ యాక్టివ్ కాదని చెప్పడంతో నిరుత్సాహానికి గురయ్యారు.

రెండుసార్లే ఇచ్చారు!

కావలిలోని ముసునూరుకు చెందిన ఆటోడ్రైవర్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు, జ్యోతి దంపతులకు వెంకట అనీష్, రిషేంద్ర ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఈ అన్నదమ్ముళ్లలో ఒక్కరికి మాత్రమే అమ్మఒడి అందింది. అదికూడా రెండుసార్లు మాత్రమే. మూడోసారి ఎందుకు రాలేదని అధికారుల చుట్టూ తిరిగినా వారు పట్టించుకున్న దాఖలాలు లేవు.

- బెల్లంకొండ జ్యోతి, ముసునూరు, కావలి

ఇంకా డబ్బులు పడలేదయ్యా!

2023-2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంకా డబ్బులు పడలేదు. పెనుబల్లి హైస్కూల్లో నా కూతురు భవ్యశ్రీ 10వతరగతి చదివి, పాసైంది. ఇంటర్‌లో చేర్పిద్దాం అనుకుంటే ఇంకా అమ్మఒడి డబ్బులు పడలేదు. ఇంతకూ పడతాయే లేదనసే అనుమానం ఉంది. ఆ డబ్బు పడితే కాలేజీ ఫీజు అవసరాలు తీరుతాయి.

- కావేటి కల్యాణి, పెనుబల్లి, బుచ్చిరెడ్డిపాలెం

చిత్తశుద్ధి గల నేతకే నా ఓటు

యువగళం



నాకు కొత్తగా ఓటు వచ్చింది. నిజమైన పేదలందరికీ మేలు చేకూర్చాలన్న చిత్తశుద్ధి గల నేతకే నా ఓటు. నిరుపేదల కోసం పథకాలు ప్రవేశపెట్టే నాయకుడిని ఎన్నుకోవాలి. విద్య, వైద్యం అందరికీ అందుబాటు లోకి తీసుకు రావడంపై దృష్టి పెట్టే నేతను ఎన్నుకోవాలి. పార్టీలకతీతంగా ఆలోచించి చిత్తశుద్ధి కలిగిన నాయకుడిని అసెంబ్లీకి పంపాలి. అదే నా ఆలోచన. అలాంటి వారినే గెలిపించాలి.

- మోడెం దేవర్షి
కోవూరు

ప్యాకేజీల వీరులు.. ఓట్లు లేని ధీరులు !

నోటి ముందు





తమ చేతిలో వందలాది ఓట్లు ఉన్నాయని, తాము ఏ పార్టీకి చెబితే వారంతా ఆ పార్టీకే ఓట్లు వేస్తారని చెప్పి కొంత మంది చోటా మోటా నేతలు అభ్యర్థుల వద్ద నుంచి రూ. లక్షల్లో ప్యాకేజీలు తీసుకోవడం నేడు అలవాటుగా మారింది. వీరి ధాటికి గ్రామాల్లో కొద్దోగొప్పో ఓట్లు ఉన్న నేతలు జీరోలుగా మారారు. ఓట్లు లేని ప్యాకేజీ వీరులు మాత్రం.. ఆహా... ఓహో... అంటూ ప్రచారం ఆర్భాటం చేస్తున్నారు. ఇలాంటి వారికి ప్యాకేజీలు ఇవ్వకపోతే అభ్యర్థులపై, పార్టీపై నెగిటివ్‌గా ప్రచారం చేస్తున్నారు. అంతేగాక వీరు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకుండా అజ్ఞాతంలోకి వెళ్తున్నారు. మరికొందరైతే ప్యాకేజీల కోసం పార్టీ మారుతున్నా మంటూ ప్రచారం చేసుకొంటున్నారు. ప్యాకేజీ వీరులు చేస్తున్న ఈ ప్రచారం ఆ నోటా ఈ నోటా పడి మండల స్థాయి నాయకుల ద్వారా అభ్యర్థుల దృష్టికి వెళ్తోంది. దీంతో తమ గెలుపునకు ఎక్కడ ఇబ్బంది జరుగుతుందోననే భయంతో అభ్యర్థులు వారిని పిలిపించి ప్యాకే జీలు ఇస్తున్నారు. కాగా ఓట్లులేని నాయకులకు ప్యాకేజీలు ఇవ్వ డంతో అవతల పార్టీ వారు ఎక్కడ విజయం సాధిస్తారోనని పలువురు గుసగుస లాడుతున్నారు.

- వలేటివారిపాలెం

మళ్లీ పాత రోజులొస్తున్నాయ్..!



ఏందిరా వచ్చేది పాత రోజులు...! ఎట్టావస్తయిరా కొండయ్యా...?

వస్తాయిలే ఎంకన్నా.. నిన్న చంద్రబాబు చెప్పిల్లా...!

ఏం చెప్పిండ్రా కొండయ్యా... చంద్రబాబు !


మన రైతులకు గతంలో మాదిరే గొర్రులు, నాగళ్లు, తైవాన్ పంపులు, డ్రిప్ పైపులు, స్పింక్లర్లు గట్రా... అన్నీ కూడా సబ్సిడీపై ఇస్తాడంట ఎంకన్నా ...

ఓ బౌనా... ఐతే పరవాలేదురా కొండయ్యా... జగన్ ఈ ఐదేళ్లలో రైతు భరోసా తప్పనిచ్చి ఏమీ ఈలేదురా మన రైతులకి... గతంలో చంద్రబాబు అన్నీ ఇచ్చిండు. మన జిల్లావోడు సోమిరెడ్డి వ్యవసాయమంత్రిగా ఉన్నప్పుడు జింక్, బోరాన్, ఐరన్ లాంటి సూక్ష్మపోషకాలు ఉచితంగా ఇస్తే కదా..? మనకి అప్పట్లో వడ్ల దిగుబడి బాగా వొచ్చి ఎకరాకి యాభై బస్తాలకి పైనైనే అయినయ్యి కొండయ్యా...

అవును ఎంకన్నా.. అదే నేను చెప్పేది... అంతే కాదన్నా రైతులకు ఏడాది ఇరవైవేల రూపాయలు కూడా ఇస్తాడంట !

ఏందీ... కొండయ్యా.. ఇరవైవేలా ?

వెటకారం



అవునన్నా మనకి జగను, మోదీ కలిపి ఇప్పుడు ఇచ్చేది ఏడాదికి పదమూడువేలా ఐదొందలు కదా... చంద్రబాబు ఇరవైవేలిస్తాడంట ఎంకన్నా...!

మరి జగను ఎంతిస్తానన్నాడు కొండయ్యా...?

ఏంది ఎంకన్నా.. ఆయనిచ్చేది... పదారుయేలు ఇస్తాడంట !

ఏందిరో పదారేలా.. నిజమా.. అదేంద్రా నాయనా ఐదేళ్లు సీఎం ఉంటే ఒక్క రైతుకు కూడా గొర్రులు, నాగేళ్లు, పంపులు కూడా ఈయలే... మళ్లా వచ్చినా కూడా ఇయ్య డేమో... ఒరే... మన రైతులకు మేలు చేసేది... చంద్రబాబేరా... ఆయున్నప్పుడు ట్రాక్టర్ నాగళ్లకు పదేలు కడితే ఇచ్చేవాళ్రా... మొన్నీమధ్య డెమాన్‌స్ట్రేటర్‌ని అడిగితే సబ్సిడీలు లేవని చెప్పినారు. చేసేది లేక కావలికి పోయి ఇరవైయేలు పెట్టి కనుక్కొచ్చారా...

అవును ఎంకన్నా... మన రైతులకి చంద్రబాబు ఐతేనే సబ్సిడీలు ఇచ్చేది... అందుకే ఆయనకే మన ఓట్లు ఏస్తే పోలా !

అంతేరా... రైతులందరం సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు ఇచ్చే చంద్రబాబుకే ఓట్లేసి గెలిపించుకుందాం రా... కొండయ్యా...!

- జలదంకి

ప్రతి 'సారీ'!

ఎన్నికల అస్త్రం

- అందరికీ ఉద్యోగ కల్పన.. కాలుష్యాన్ని నివారిస్తాం
- ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార అస్త్రాలివే!
- తీరా గెలిచాక ముఖం చాటేస్తున్న వైనం
- ఐదేళ్లయినా నెరవేరని, జగన్, కాకాణి హామీలు

ముత్తుకూరు : ఎన్నికల్లో బరిలో నిలిచే అభ్యర్థులకు యుద్ధప్రాతిపదికన గుర్తొచ్చేవి నిరుద్యోగం, కాలుష్యం. ప్రతి ఎన్నికల్లోనూ ఇవే అంశాలను ప్రధాన ప్రచార అస్త్రాలుగా మార్చుకుని ఓట్లు దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశాలను వదిలేసి మళ్లీ ఐదేళ్లు కాగానే నెత్తిన పెట్టుకోవడం పరిపాటిగా మారింది. 2005 ఎన్నికల్లో అప్పట్లో నిరుద్యోగం నిర్మూలన అనే అంశం తెరపైకి వచ్చింది. 2009లో దీనికి కాలుష్య నియంత్రణ తోడైంది. 2014, 2019 ఎన్నికల్లో ఈ రెండు అంశాలనే ప్రస్తావిస్తూ అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. నియోజకవర్గంలో ఎక్కడా నిరుద్యోగం అనే మాటే కనిపించదని, కాలుష్యాన్ని తరిమికొట్టే చర్యలు తీసుకుంటామని హామీలు గుప్పించారు. మండలంలో థర్మల్ కేంద్రాలు, అదానీ కృష్ణపట్నం పోర్టు, పామాయిల్ పరిశ్రమలు ఉన్నా స్థానికులు ఉద్యోగ అవకాశాలు కల్పించింది స్వల్పమే. అందులో అధిక శాతం రోజువారి కూలీలు కావడం గమనార్హం. కాంట్రాక్ట్ ఉద్యోగులుగా కొందరికి అవకాశం దక్కినా ఇప్పటివరకు పర్మినెంట్ చేసిన దాఖలాలు లేవు. మళ్లీ సార్వత్రిక ఎన్నికలు వచ్చిన నేపథ్యంలో మరోసారి నిరుద్యోగ నిర్మూలన, కాలుష్య నియంత్రణ తెరపైకి వచ్చాయి. ప్రధానంగా కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ తరలింపు అంశం ప్రధాన సమస్యగా ప్రస్తావనకు వస్తోంది. ఈ మూడు అంశాలను తాము అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామంటూ హామీలు గుప్పిస్తూ అధికార ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ముమ్మరం చేశారు. గత ఐదేళ్లలో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని, తాము అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామని ప్రజలకు చెప్పడంలో ప్రతిపక్షం కొంతమేర సఫలమైంది.



నేలటూరులోని థర్మల్ కేంద్రం



కాళ్లకు నల్లగా అంటుకున్న బొగ్గు

పేలని జ'గన్'!

వైసీపీ అధికారంలోకి రాగానే స్థానికులకు 70 శాతం ఉద్యోగాలు ఇస్తామని జగన్ తన పాదయాత్రలో హామీ ఇచ్చారు. మూడున్నరేళ్ల కిందట ప్రభుత్వం నుంచి జీవో తీసుకువచ్చి నిరుద్యోగం అనే మాటే కనిపించదని ప్రస్తుత మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి డాంబీకాలు పలికారు. ఆ తర్వాత ఉద్యోగాలు కల్పించే దిశగా ఎలాంటి చర్యలు లేవు. నైపుణ్య శిక్షణ కల్పిస్తామని ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పిన మాటలు గాలిలో కలిసిపోయాయి. మళ్లీ ఎన్నికలు రాగానే నిరుద్యోగ నిర్మూలన అంశాన్ని తెరపైకి తెచ్చారు.

కాలుష్య నియంత్రణ ఏదీ!?

ఏర్పడిన పరిశ్రమల ద్వారా ఏర్పడుతున్న కాలుష్యంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. థర్మల్ కేంద్రాల నుంచి వచ్చే బూడిద కాలుష్యం ఒకవైపు గ్రామాలను ముంచెత్తుతుండగా, కృష్ణపట్నం పోర్టులో దిగుమతి అవుతున్న బొగ్గు కాలుష్యం పరిసర గ్రామాలను తీవ్ర ప్రభావితం చేస్తోంది. అంతకుమించి పంటపాలెంలోని పామాయిల్ పరిశ్రమల వల్ల ఏర్పడుతున్న వాయు కాలుష్యం చుట్టుపక్కల గ్రామాల ప్రజలను అనారోగ్యం పాలుచేస్తోంది. రాత్రుళ్లు వచ్చే దుర్గంధం భరించలేక పోతున్నారు. గ్రామాల్లో ఊపిరితిత్తులు శ్వాసకోశ వ్యాధులతో రోజురోజుకు అధికమవుతుంది. పట్టించుకోవాల్సిన ప్రజాప్రతి నిధులు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేయగా మామూళ్ల మత్తులో తేలియాడుతున్న అధికారులు తూతూ మంత్ర చర్యలతో చేతులు దులుపుకుంటున్నారు.


నిరుద్యోగులను నట్టేట ముంచేశారు!



పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పిస్తూ జీవో తెచ్చామని చెప్పి నిరుద్యోగులను మభ్యపెట్టారు. ఒకరికి కూడా పరిశ్రమల్లో ఉద్యోగం కల్పించిన దాఖలాలు లేవు. మళ్లీ ఇప్పుడు నిరుద్యోగ నిర్మూలిస్తామని మాటలు చెబుతూ ఓట్లు దండుకునేందుకు వచ్చేశారు. వైసీపీ ప్రభుత్వం, మంత్రి కాకాణి నిరుద్యోగుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశారు.

- యల్లసిరి రాజేష్, పైనంపురం

పట్టించుకునేదెవరు!?



పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంతో ప్రజలు ప్రాణాలు పోతున్నా పట్టించుకునే వారు లేరు. పామాయిల్ పరిశ్రమల వల్ల వచ్చే వాయుకాలుష్యం కృష్ణపట్నం పోర్టులని బొగ్గు కాలుష్యం, థర్మల్ కేంద్రాల ద్వారా వచ్చే బూడిద కాలుష్యం ప్రజలను అనారోగ్యం పాలుచేస్తున్నాయి. పామాయిల్ కాలుష్యం వల్ల పరిసర గ్రామాల ప్రజలు ఊపిరితిత్తులు శ్వాసకోశ వ్యాధులతో అల్లాడుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రజాప్రతినిధులు, కాలుష్య నియంత్ర మండల అధికారులు పట్టించుకోలేదు.

- రొయ్యల రంగనాథ్, పంటపాలెం



డాక్టర్ ఆశాలత

ఆ ఇద్దరూ ఏమయ్యారు ?

ఐదేళ్ల కిందట తిరుపతి నగరంలో ఇద్దరు డాక్టర్లు నిరంతరం వార్తల్లో వ్యక్తులుగా ఉండేవారు. రాజకీయ ఉత్సాహంతో క్రియాశీలకంగా కనిపించేవారు. ఏమైందో ఏమో ఎన్నికల వేళ ఆ ఇద్దరి ఊసే తిరుపతిలో వినిపించడం లేదు. ఇద్దరిలో ఒకరు వైసీపీలో చేరాక ఉనికిని కోల్పోగా మరొకరు చేరడానికి వెళ్లి అనాదరణకు గురై మౌనంగా ఉండిపోయారు. సాయిసుధా హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి 2010 సమైక్యాంధ్ర ఉద్యమానికి సారథిగా రాష్ట్రవ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారు. టీడీపీ ఆరోగ్య విభాగం అధ్యక్షురాలిగా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. పార్టీ ఏ పని అప్పగించినా ఖర్చుకు వెనుకాడకుండా ఘనంగా నిర్వహించేవారు. భర్త డాక్టర్ సుకుమార్‌కు తిరుపతి ఎంపీ టికెట్ ఆశించి నిరాశపడిన సుధారాణి, తన భవిష్యత్తు మెరుగ్గా ఉంటుందనే నమ్మకంతో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలో చేరారు. అంతే ఆ తర్వాత ఆమె ఉనికి రాజకీయాల్లోంచి మాయమైంది. ఇప్పుడా పార్టీలో ఉన్నారో లేదో కూడా తెలియని స్థితి. తిరుపతిలో ప్రసిద్ధ గైనకాలజిస్ట్‌గా, టెస్ట్‌ట్యూబ్ బేబీ వైద్యనిపుణురాలుగా పేరు తెచ్చుకున్న డాక్టర్ రాయ ఆశాలత 2019 ఎన్నికలకు ముందు చంద్రబాబు సమక్షంలో తన భర్త వెంకటేశ్వర్లుతో సహా టీడీపీ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించి విఫలమవడంతో టీడీపీకి దూరమయ్యారు. అధికారంలోకి వచ్చిన వైసీపీలో అయినా తమ భవిష్యత్తును వెతుక్కుందామని ఆశపడ్డారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన భూమన కరుణాకర్ రెడ్డిని అభినందించేందుకు పుష్పగుచ్ఛం తీసుకుని ఆయన ఇంటికివెళ్లారు. అక్కడ వీరికి నిరాదరణ ఎదురవడంతో నిశ్శబ్దంగా వెనక్కివచ్చేశారు. ఎన్నికల సమయంలో తమ ఇంటికి వచ్చి సాయం కోరిన భూమన కరుణాకరరెడ్డి గెలిచాక ఇలా వ్యవహరించడంతో ఈ దంపతులు రాజకీయాలకే దణ్ణం పెట్టి దూరంగా ఉండిపోయారు.


- తిరుపతి, ఆంధ్రజ్యోతి



డాక్టర్ సుధారాణి

ఇదీ మందు

మనోడ్ని నమ్మొచ్చా?



ఎన్నికల తేదీ దగ్గరయ్యే కొద్దీ అభ్యర్థుల ఒంట్లో జ్వరం పెరుగుతోంది. బింకం సడలుతోంది. ఇగో కాస్త పక్కన పెట్టి కాళ్ల బేరాలకీ దిగేస్తున్నారు. రేణిగుంట మండలంలో కొద్ది రోజులుగా వైసీపీలో ఈ వాతావరణం కనిపిస్తోంది. నాయకుడి ధోరణితో ఐదేళ్లుగా ఆ పార్టీ స్థానిక నాయకులే విసిగిపోయారు. నాయకుడి ప్రత్యేక అనుచరులు భూకబ్జాలు, దౌర్జన్యాలు, బెదిరింపులు సాగాయి. బాధితులు స్థానిక నేతలను ఆశ్రయించేవారు. పార్టీకి చెడ్డపేరు వస్తుందని స్థానిక నేతలు నాయకుడి దగ్గర వాపోయేవారు. 'అదంతా నేను చేసుకుంటా.. మీరు జోక్యం చేసుకోవద్దు' అని ఆయన ఖరాకండీగా చెప్పేసేవారు. మరోదారి లేక అన్నీ దిగమింగుకుని మౌనంగా పార్టీలోనే ఉండిపోయినవారిలో కొందరు ఇప్పుడు పార్టీ మారడం మొదలుపెట్టారు. మరికొందరు అభ్యర్థి కోసం పనిచేయడానికి ముందుకు రావడంలేదు. పరిస్థితి గమనించిన నాయకుడు 'తప్పు చేశాను.. మరోసారి చేయను.. పార్టీ మారద్దు.. ఈ సారికి సహకరించండి' అంటూ స్వపక్ష నేతలనే బతిమలాడుకుంటున్నారు. బుజ్జగింపులతో దారిలోకి వచ్చి ఎన్నికల బాధ్యతలు స్వీకరించిన వారినీ ఆయన నమ్మడం లేదు. వారి కదలికలను నిరంతరం గమనించేందుకు షాడో పార్టీలను ఏర్పాటు చేశారనే ప్రచారం జరుగుతోంది. దీంతో నాయకుడి మాటలు నమ్మొచ్చా లేదా తేల్చుకోలేక రేణిగుంట మండలంలోని వైసీపీ నేతల్లో గందరగోళం నెలకొందని అంటున్నారు.

- రేణిగుంట

నోటికాడ కూడు లాగేసిన జగన్....



జగన్ అధికార పగ్గాలు చేపట్టిననాటి నుంచి కక్షపూరిత నిర్ణయాలు తీసుకుంటూనే ఉన్నారనడానికి ఈ చిత్రమే సాక్ష్యం. పేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వం స్థానిక పాత బస్టాండు సమీపంలో అన్నాక్యాంటీన్‌ను ఏర్పాటు చేసింది. నాడు నిత్యం అన్నదానసత్రంలా ఇది కళకళలాడింది. ఈ ప్రాంతంలో రెవెన్యూ, మండల, ఆర్‌అండ్‌బీ తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో ఎందరో వివిధ పనులపై వచ్చేవారు. వారితో పాటు స్థానిక కూలీలు కూడా వచ్చి రూ. 5లకే కడుపునిండా భోజనం చేసేవారు. వందలాది మంది ఆకలి తీర్చిన ఈ అన్నక్యాంటీన్‌ను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మూసివేశారు. ప్రస్తుతం ఈ భవనాన్ని బొగ్గులదిబ్బ ప్రాంత సచివాలయ కార్యాలయంగా మార్చేశారు. దీనిని చూసినప్పుడల్లా పేదల నోటి కాడ కూడు లాగేసుకున్న జగన్ సర్కారు తీరుపై పేదలు శాపనార్థాలు పెడుతుంటారు.

- గూడూరు

నాయకుల కాళ్లకు చెప్పులుండేవి కాదు



"ప్రజల కోసం పనిచేయాల్సిన నాయకులు మాట్లాడుతున్న భాష చూస్తే బాధేస్తోంది. ఒకప్పుడు ఓట్లకి డబ్బులు పంచుతారన్న మాటే

● మా రోజుల్లో...

వినబడేది కాదు. ఇప్పుడు వాళ్ళు ఎంత ఇస్తారు... వీళ్ళు ఎంతిస్తారు అనే మాటలే వినిపిస్తున్నాయి. రాజకీయాల్లో రోజురోజుకీ పరిస్థితులు మారిపోతూనే ఉన్నాయి. పూర్వం కాళ్లకు చెప్పులు లేని నేతలు కూడా ఉండేవారు. ప్రచార ఖర్చులకు డబ్బులుండేవి కావు. నమస్కారంతో ఓటు అడిగేవారు. ఇప్పుడు ఓట్లడగడానికి కూడా ఊరేగింపు గా రావడం విచిత్రంగా ఉంది."

- రామచంద్రా రెడ్డి (82), వేలవేడు, శ్రీకాళహస్తి మండలం

- శ్రీకాళహస్తి



జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు:	2,492
సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాలు:	1060
అద్దె భవనాల్లో ఉన్నవి:	1432
పనిచేస్తున్న కార్యకర్తల సంఖ్య:	2,468
లబ్ధి పొందుతున్నవారు:	1,36,390

వేతనాల కోసం పోరాటం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది (ఫైల్)



నగరికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తకు ఇద్దరు పిల్లలు. అద్దె ఇల్లు. ఆమె భర్త ఆటో నడుపుతాడు. ఈ పరిస్థితుల్లో వీరి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలేవీ వర్తించడం లేదు. పిల్లల చదువుకు అమ్మఒడి పథకం కూడా అందడం లేదని ఆమె వాపోతోంది. జగన్ అధికారంలోకి వచ్చాక కక్ష కట్టి తమకు పథకాలు ఏవీ అందకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

గూడూరుకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తకు భర్త అనారోగ్యంతో చనిపోయాడు. ఈమె కొద్దిపాటి జీతమే ఇంటిల్లపాదికీ ఆధారం. ఈమెకు ఇద్దరు పిల్లలున్నారు. భర్తను కోల్పోయిన అత్త కూడా ఈమెతోనే ఉంటుంది. అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నందున వితంతు పింఛను కూడా రాదని చెప్పడంతో కుటుంబాన్ని నడపడానికి నానా యాతనా పడుతోంది.

నేను విన్నాను.. నేను మరిచాను

● హామీలతో అంగన్‌వాడీలను ముంచేసిన జగన్ ● ఐదేళ్లలో కేవలం రూ.వెయ్యి మాత్రమే పెరుగుదల
● టీడీపీ హయాంలో మెరుగైన వేతన పెంపు

జగన్ తీపి మాటలు విని నిలువునా మోసపోయామని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చాక హామీల సంగతి పక్కన పెడితే పనిభారం మోపి, అప్పటి వరకు వర్తించిన సంక్షేమ పథకాలను తొలగించారంటూ నిప్పులు చెరుగుతున్నారు. గడిచిన ఐదేళ్లలో ఒక్క సమస్యను పరిష్కరించిన పాపాన పోలేదు. దీనికితోడు రకరకాల యాప్‌లు, సర్వేల పేరుతో పనిభారాన్ని మోపడంతోపాటు చాలీచాలనీ వేతనాలతో నాలుగున్నరేళ్లు అంగన్‌వాడీలకు నరకం చూపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని 42 రోజుల పాటు సమ్మె చేస్తే కనికరం లేకుండా ఉక్కుపాదంతో అణచివేశారు. మహిళలని చూడకుండా పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారు. ఎస్మా, ఉద్యోగాల తొలగింపు వంటి అస్త్రాలతో భయపెట్టి విధుల్లో చేరేలా చేశారని కార్యకర్తలు జగన్‌ను తూర్పారబెడుతున్నారు. ఇప్పటికీ సమ్మె కాలానికి పూర్తిగా సొమ్ము చెల్లించలేదని, మెనూ ఛార్జీలు పెంచకుండా వైసీపీ ప్రభుత్వం చేతిలో దగా పడ్డామని ఆవేదన చెందుతున్నారు.

అన్నొస్తాడు... మీకు మంచి చేస్తాడు.. తెలంగాణ ప్రభుత్వం కంటే రూ. వెయ్యి అదనంగా జీతం పెంచుతాను. మీ సమస్యలన్నీ తీరుస్తాను.
గత ఎన్నికల సందర్భంగా అంగన్‌వాడీలకు జగన్ చెప్పిన మాట ఇది.

టీడీపీ హయాంలోనే నయం

● 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కార్యకర్త వేతనాన్ని రూ.4,500 నుంచి రూ.10,500 వరకూ పెంచారు. ఆయాల వేతనాన్ని రూ.2,200 నుంచి రూ. 6 వేలకు పెంచారు. ఏకంగా 150 శాతం పెంచారు. జగన్ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పెంచిందని సిబ్బంది పెదవి విరుస్తున్నారు.

సమ్మె వేతనం మాటేమిటి

● గతేడాది డిసెంబరు 12 నుంచి ఈ ఏడాది జనవరి 22 వరకు అంగన్‌వాడీలు సమ్మె చేశారు. ప్రభుత్వ చర్చల్లో భాగంగా సమ్మె కాలానికి వేతనం ఇస్తామంటూ సీఎం జగన్ హామీ ఇచ్చారు. జీవో కూడా జారీ చేశారు. కానీ నేటికీ అదిగో ఇదిగో అంటూ ఊరిస్తున్నారే తప్పా ఆ ఊసే లేదు. ఐదేళ్లుగా కూరగాయలు, నిత్యావసరాలు, టీఏ, డీఏ బకాయిల గురించి పట్టించుకోవడం లేదు.

సమ్మెకు బహుమతి ఇది

సమ్మె సందర్భంగా 3,400 మంది అంగన్‌వాడీలకు పోలీసులు నోటీసులిచ్చారు. 2,040 మందిని గృహ నిర్బంధం చేశారు. 70 మందిపై బైండోవర్లు నమోదు చేశారు. 120 మందినిఇ అరెస్టు చేశారు. సీఎం జగన్ తమకు ఇచ్చిన కానుక ఇదేనని అంగన్‌వాడీ కార్యకర్తలు వ్యాఖ్యానిస్తున్నారు.

నాసిరకం ఫోన్లు... పనిచేయని యాప్‌లు

వైసీపీ పాలనలో పలు రకాల యాప్‌లు తీసుకువచ్చింది. అంగన్‌వాడీలకు ఇచ్చిన ఫోన్లు మాత్రం నాసిరకంగా ఉన్నాయి. యాప్‌లు, ఫోన్లు సరిగా పనిచేయక లబ్ధిదారుల వివరాలను నమోదు చేయలేక అంగన్‌వాడీలు ఇబ్బందులకు గురవుతున్నారు. వివరాలు నమోదు చేస్తే కానీ పోషకాహారం విడుదల రాదు. యాప్‌లు పనిచేయక, ఫోన్లకు సిగ్నల్ రాక సకాలంలో పోషకాహారం అందించలేక నానా మాటలు పడుతున్నామని కార్యకర్తలు వాపోతున్నారు.

- తిరుపతి(వైద్యం)




అమానుషంగా ప్రవర్తించడం బాధాకరం

అంగన్‌వాడీల జీతాలను పెంచకపోవడం దారుణం. ఐదేళ్లలో కేవలం రూ. వెయ్యి మాత్రమే పెంచడం అన్యాయం. చాలీచాలని జీతాలతో బతకలేక రోడ్డెక్కిన అంగన్‌వాడీలను పోలీసులతో ఈడ్చిపడేయటం, కేసులు నమోదు చేయడం దారుణం. అంగన్‌వాడీల విషయంలో జగన్ ప్రభుత్వ తీరు అమానుషం. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడమేనా అక్కాచెల్లెమ్మలపై సీఎం జగన్‌కు ఉన్న గౌరవం.

- వాణిశ్రీ, అంగన్‌వాడీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

నోట్ దిస్ పాయింట్

కరపత్రాల ప్రింటింగ్‌కు అనుమతి ఉండాల్సిందే



ఎన్నికల ప్రచారంలో కరపత్రాలది కీలకపాత్ర. ఓటర్లను బలంగా ప్రభావితం చేసే ప్రచార సాధనమిది. అందుకే దీని ముద్రణ విషయంలో ఎన్నికల కమిషన్ చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. ఈ క్రమంలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 127 ప్రకారం కేసులు నమోదు చేస్తారు. అవసరమైతే జైలుకు పంపుతారు. ఉదాహరణకు ప్రింట్ చేయాల్సిన ఫ్లెక్సీలు, కరపత్రాల నమూనాలను ప్రింటర్ తన పరిధిలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. ఈ అభ్యర్థనపై ఇద్దరు సాక్షులు సంతకం చేయాల్సి వుంటుంది. ఆ అధికారి వాటిని నిశితంగా పరిశీలిస్తారు. అప్పుడు ప్రింట్ చేసేందుకు అనుమతితో కూడిన డిక్లరేషన్ ఇస్తారు. డిక్లరేషన్ పొందిన తరువాత మాత్రమే ప్రింట్ చేయాలని ఎన్నికల చట్టం స్పష్టం చేస్తోంది. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే ప్రింటరే కాదు అభ్యర్థి కూడా ఆరు నెలలు జైలు శిక్ష,లేకుంటే రూ.2000 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

- తిరుపతి(నేరవిభాగం)

వీడియోగ్రాఫర్ల ఓటు మిస్



ఈసారి ఓటేసే అవకాశం మిస్సవుతున్నామని జిల్లాలో 400 మందికి పైగా వీడియోగ్రాఫర్లు బాధపడుతున్నారు. ఎన్నికల సందర్భంగా రకరకాల వీడియోలు తీయడానికి నియోజకవర్గానికి సుమారు 60 మంది ప్రయివేట్ వీడియోగ్రాఫర్లను ఎన్నికల అధికారులు నియమించారు. సాధారణంగా ఎన్నికల విధుల్లో ఉండే జర్నలిస్టులకు ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా అవకాశం కల్పించింది. ఆ కోటాలో తాముకూడా ఓటు వేయవచ్చని భావించిన వీడియోగ్రాఫర్లకు భంగపాటు ఎదురైంది. పోస్టల్ బ్యాలెట్ గడువు ముగియడం, అధికారులు ఐడీ కార్డులు జారీ చేయకపోవడంతో ఓటు వినియోగించుకోలేక పోతున్నామని వీరంతా ఆవేదన చెందుతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం)

బుజ్జగింపులకే పుణ్యకాలం సరి..

వైసీపీలో విభేదాల పంచాయితీలు కొలిక్కి రావడం లేదు. ఒక పక్క గడువు ముంచుకొస్తున్నా నగరి వైసీపీ అభ్యర్థి రోజా ఎన్నికల ప్రచారం మీద దృష్టిసారించలేకపోతున్నారు. పుణ్యకాలం కాస్తా పార్టీ అంతర్గత విభేదాల పరిష్కారానికే సరిపోతోంది. కుటుంబ సభ్యులకు ప్రచార బాధ్యతలను అప్పగించి ఆమె అసమ్మతి నాయకుల అనుచరులను మచ్చిక చేసుకునే పనిలో బిజీగా గడుపుతున్నారు. ఒక్కొక్కరికి ఒకటి పదిసార్లు ఫోన్లు చేసి మాట్లాడుతున్నారు. వీలైనంత వరకు నగరిలోని తన ఇంటికి పిలిపించుకుని బుజ్జగించేందుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. నిండ్రకు చెందిన ఒక మహిళా ప్రజాప్రతినిధిని తనవైపు తిప్పుకునేందుకు ఏకంగా ఐదుసార్లు ఆమె ఇంటికి వెళ్లాల్సివచ్చింది. దీంతో ఆ మహిళా ప్రజాప్రతినిధి ఎట్టకేలకు మంత్రి రోజాను నగరిలో కలిసి మద్దతు ప్రకటించింది. ఒక్కొక్కరి ఇంటి చుట్టూ ఇన్నిన్ని సార్లు తిరగాల్సి రావడం మంత్రి క్యాంప్‌లోని వైసీపీ నాయకులకు తలనొప్పిగా మారిందనే మాటలు వినబడుతున్నాయి. దీంతో ప్రచార పర్వంలో మంత్రి రోజా వెనుకబడ్డారని నియోజకవర్గ ఓటర్లు గుసగుసలాడుకుంటున్నారు.

- పుత్తూరు అర్బన్



ఈ పోలింగ్ స్టేషన్లు స్పెషల్ ...



దివ్యాంగులు, మహిళలు,యువత కోసం ఎన్నికల కమిషన్ ఈసారి ప్రయోగాత్మకంగా మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. మూడు కేటగిరీలుగా ప్రతి నియోజకవర్గంలో ఈ సేషన్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపిక చేసిన చోట మహిళలకు 1, యువతకు 2, దివ్యాంగులకు 2 వంతున వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఈ స్టేషన్లను తొలిసారి వినియోగించనున్నారు. ప్రత్యేకించి ఈ బూత్‌ల వద్ద తాగునీరు, ర్యాంపులు, టాయిలెట్లు లాంటి ప్రాథమిక వసతులు కల్పిస్తున్నారు. ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న చోట ఓటు వినియోగించుకోవడంపై రిటర్నింగ్ ఆఫీసర్లు అవగాహన కల్పిస్తున్నారు. స్లిప్పు తీసుకుని లోపలకు వెళ్లి ఓటు ఎలా వేయాలో వివరిస్తున్నారు. అల్లర్లు, అలజడులకు భయపడి ఓటర్లు దూరం కాకుండా ఈ ప్రత్యేక పోలింగ్ స్టేషన్లు ఉపయోగపడతాయని భావిస్తున్నారు. మహిళా కేంద్రాల్లో మహిళా సిబ్బంది మాత్రమే ఎన్నికల విధుల్లో ఉంటారు. ఇతర కేంద్రాల తరహాలోనే ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందని అధికారులు వివరించారు.



- తిరుపతి(కలెక్టరేట్)

● మీకు తెలుసా?

ఆ అధికారి మరీ అంత 'ఫ్యానా'..



హలో ...ఒక్కసారి ఆలోచించండి....మళ్ళీ మన ప్రభుత్వమే వస్తోంది... మీరు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలి...అధికారంలోకి వచ్చిన వెంటనే మంచి పోస్టింగ్ ఇప్పించే బాధ్యత నాది..అంటూ తిరుపతి పోలీసు శాఖలో చక్రం తిప్పుతున్న ఓ కీలక అధికారి పోలీసులందరికీ ఫోన్లు చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం(?) చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మీరే కాదు...మీ కుటుంబంలోని ప్రతి ఒక్కరూ మన ఫ్యాను గుర్తుకే ఓటేసేలా చూడండంటూ ప్రాధేయపడుతున్నారు. సదరు అధికారి మాటలు విని పోలీసులు ముక్కు మీద వేలేసుకుంటున్నారు. ఎంత బాస్ అయినా మరీ ఇంత ఓపెన్‌గా అడగడమేమిటంటూ పది రోజులుగా పోలీసు శాఖలో గుసగుసలాడుకుంటున్నారు.

- తిరుపతి(నేరవిభాగం)

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

కేక్, టీలతో సరి

కొంతమందికే భోజనం ● స్పృహ తప్పిన ఐదుగురు!

● రెండో విడత శిక్షణలో ఇబ్బంది పడ్డ పోలింగ్ సిబ్బంది

వెంకటగిరిటౌన్, మే 2: పట్టణంలోని విశ్వోదయ డిగ్రీ కళశాలలో వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పీవోలు, ఏపీవోలకు రెండో విడత శిక్షణ ఏఆర్‌వో ఆధ్వర్యంలో గురువారం జరిగింది. అయితే సదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి అధికారులు సరైన సదుపాయలు కల్పించకపోవడంతో వారు ఇబ్బంది పడ్డారు. ఉదయం 11.30 గంటలకు టీ, కేక్‌లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతాలల్లో భోజనం ఏర్పాటు చేశారు. ఆలస్యమవడంతో ఐదుగురు స్పృహ కోల్పోయారు. దీంతో వారిని సమీపంలోని వైద్య శిబిరానికి తరలించాల్సిన పరిస్థితి. మీటింగ్‌కు వెయ్యిమంది హాజరు కాగా అధికారులు కేవలం రెండు టెంట్లే ఏర్పాటు చేయడంతో ఎండలో కొందరు, వరండాల్లో కొందరు కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఏరియా ఆస్పత్రికి ఫ్యాన్ల వితరణ

గూడూరు, మే 2: స్థానిక ఏరియా ఆస్పత్రిలో గురువారం వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పది సీలింగ్‌ఫ్యాన్లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో రోగులు చికిత్సపొందే వార్డుల్లో వసతులు కల్పించేందుకు ఫ్యాన్లు అందించామన్నారు. డాక్టర్ రాజా, శివరామనాయుడు, ఆర్‌వీరావు తదితరులుపాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

గూడూరు, మే 2: స్థానిక సునీత సేవా సంస్థ కార్యాలయంలో గురువారం బలిజ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి ఆర్థికసాయం అందించారు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన సంధ్య 532 మార్కులు సాధించింది. దీంతో విద్యార్థినికి రూ.7,500 నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. సంఘ కన్వీనర్ ఎస్.సులక్ష్మి, కె.రాజేశ్వరి, పద్మావతి, సువర్ణలక్ష్మి, రాధిక, అరుణకుమారి, ఉషా, సాయి పాల్గొన్నారు.

దేశానికి మోదీ సేవలు అవసరం

తిరుపతి, మే 2 (ఆంధ్రజ్యోతి): దేశానికి మోదీ సేవలు అవసరమని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు అభిప్రాయపడ్డారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని వట్టంబేడు కుప్పం, కొత్త కుప్పం, సెల్వి కుప్పం గ్రామాల్లోని మత్స్యకార విద్యార్థులతో గురువారం భవిష్య భారత్ కార్యక్రమంలో భాగంగా ఓటుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి మండలి సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మోదీ నేతృత్వంలోని బీజేపీ గెలుపు దేశాభివృద్ధికి మలుపు అని పేర్కొన్నారు. ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం తేవడానికి గత నెల 28 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార అభివృద్ధి మండలి సభ్యుడు పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించండి

చిట్టమూరు, మే 2: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని గురువారం టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఎల్లసిరి గ్రామంలో పర్యటించి గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్ కుమార్‌ను, ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికీ తిరిగి అభ్యర్థించారు. కె.చెంచురామయ్య ఆచారి, ప్రతాప్‌రెడ్డి, రాజారెడ్డి, నాగూర్‌రెడ్డి, రంగారెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

సూళ్లూరుపేట, మే 2: మండలంలోని దామానెల్లూరు ఎంపీటీసీ సభ్యురాలు ఎస్.రాజేశ్వరి, వెలగలపొన్నూరు సర్పంచ్ టి.అనిల్ రెడ్డి, ఉగ్గుముడికి చెందిన శ్రీహరి, అంకయ్య సహా పెళ్లకూరు దళితవాడకు చెందిన 50 మంది వైసీపీ కార్యకర్తలు మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. టీ.సుధాకర్ రెడ్డి, వేనాటి సతీష్ రెడ్డి, తాటిపర్తి శ్రీనివాసులు రెడ్డి, కొక్కు శంకరయ్య, ఎస్.విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: మండలంలోని సంగవరానికి చెందిన వైసీపీ నాయకుడు పి.శ్రావణ్, చిలమనూరుకు చెందిన వలంటీర్లు చేజర్ల నాగరాజు, సెల్వరాజులు, ఊట్లపల్లికి చెందిన హఫీజ్ సహా ముప్పై కుటుంబాలకు చెందిన వారికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె గురు వారం పసుపు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందనే నమ్మకంతో పార్టీలో చేరామని చెప్పారు.

పట్టుబడిన మద్యంపై అధికారుల మౌనం!

సూళ్లూరుపేట, మే 2: సార్వత్రిక ఎన్నికల వేళ రాష్ట్ర సరిహద్దు బీవీపాలెం చెక్‌పోస్టులో పట్టుబడిన పుదుచ్చేరి మద్యంపై సెబ్ అధికారులు మౌనం వహిస్తున్నారు. చేపల రవాణా మాటున పుదుచ్చేరికి చెందిన మద్యం బాటిళ్ల కేసులను బుధవారం స్వాధీనం విషయం తెలిసిందే. తనిఖీలో భాగంగా టెంపోలో దాదాపు రూ.7.42 లక్షల విలువైన 300 మద్యం కేసులను స్వాధీనం చేసుకుని డ్రైవర్ ఫిరోజ్‌ను అదుపులోకి తీసుకుని పూర్తి సమాచారం కూపీ లాగారు. ఇంతలో ఏమైందో తెలియదు కానీ విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పడం వెనుక ఈ విషయమై గురువారం సూళ్లూరుపేట సెబ్ సీఐ సోమయ్య మీడియా సమావేశం నిర్వహించారు. అక్రమ రవాణాపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని విచారనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

ఆ ఫోన్ నెంబర్లు ఎవరివి..

డ్రైవర్ చెప్పిన ఫోన్ నెంబర్లు ఎవరివి.. అధికారులు వాటిని ఎందుకు దాచుతున్నారన్నది చర్చనీయాంశమైంది. నెల్లూరులోని ఓ ఐస్ ఫ్యాక్టరీకి తీసుకెళ్తున్నానని అక్కడికి వెళ్లిన తరువాత ఆ నెం బర్లకు ఫోన్ చేస్తే వారు వచ్చి సురుకు తీసుకెళ్తారంటూ చెప్పాడు. ఆ ఫోన్ నెంబర్లపై ఆరా తీశారని తెలుస్తోంది. అయితే సరుకు నెల్లూరుకు కాదు సింగరాయకొండకు తీసుకెళ్తున్నట్టు తెరలేపారు. ఇలా ఫోన్ నెంబర్లు అధికారుల వద్ద ఉన్నా, డ్రైవర్ ఇచ్చిన సమాచారం నిజమో కాదో నిర్ధారించకపోవడం పై విమర్శలు వినిపిస్తున్నాయి. కాకపోతే ఎన్నికల మద్యం కావడంతో పార్టీలకు చెందిన కీలక నేతల ఒత్తిడి పనిచేస్తుందా అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ మద్యం ఎవరిదన్నదీ అధికారులు తేల్చకపోతే మరిన్ని ఊహాగానాలకు తావిస్తున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది.



మీడియా సమావేశంలో సెబ్ సీఐ

గూడలిలో వైద్యశిబిరం

కోట, మే 2: మండలంలోని గూడలిలో నెల రోజులుగా జ్వరాలతో స్థానికులు బాధపడుతున్నారు. విడవని జ్వరాలతో నీర సించిపోయి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. 10 నుంచి 15 రోజుల చికిత్స తరువాత జ్వరాలు అదుపులోకి వస్తున్నాయి. గూడలిలోని పాత అరుంధతీ యవాడ, కొత్త అరుంధతీయవాడ, గిరిజన కాలనీలో 250 మంది వైరల్ జ్వరాల భారిన పడ్డారు. జ్వరం తగ్గిన తరువాత నీరసం, కీళ్లనొప్పుళ్లు, మోకాళ్లు, పాదాలు వాపులు వస్తుండటంతో ఆందోళ నకు చెందారు. దీంతో పంచాయతీ కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చిట్టమూరు మండలం గునపాటిపాళెం ప్రభుత్వ వైద్యాధికారి సౌజన్య ఆధ్వర్యంలో కీళ్ల నొప్పులు, వాపులతో బాధపడుతున్న గ్రామస్తులను పరీక్షించి చికిత్సలు అందించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ.. జ్వరపీడితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

వలంటీర్ల రాజీనామా

చిట్టమూరు/ కోట, మే 2: మండలంలోని మల్లాం, కోగిలి సచివాలయాల పరిధిలో 21 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. మల్లాం- 1లో 11 మంది, మల్లాం-2లో ఎనిమిదిమంది, కోగిలిలో ఇద్దరు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో నాగరాజుకు అందజేశారు. కోట మండల పరిధిలోని గూడలి, సిద్దవరం, వెంకన్నపాళెం, నెల్లూరుపల్లి కొత్తపాళెం పంచాయతీలకు చెందిన 16 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులుకు అందజేశారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

గూడూరు అర్బన్, మే 2: రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు ఏ.బాలకృష్ణమనాయుడు కోరారు. గురువారం జడ్పీ హైస్కూల్‌రోడ్డు, పీఎస్ఆర్ పార్కువీధి తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. గాడితప్పిన పాలనను సరైన మార్గంలో నడిపించాలంటే ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. దయాకర్, సురేష్, వెంకటేష్, మహేష్, దిలీప్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్ విద్యార్థికి అభినందన

కోట, మే 2: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ రెండో సంవత్సరం చదువుతున్న అభిషయ్ కీర్తన్‌పాల్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి అభినందించారు. ఈ ఏడాది గణతంత్ర వేడుకల్లో కీర్తన్‌పాల్ ప్రదర్శించిన ప్రతిభకు ఎయిర్ కమాండర్ బీఎంరెడ్డి, లెఫ్టినెంట్ జనరల్ దుర్గర్‌పాల్‌సింగ్ చేతుల మీదుగా మేడియన్ అవార్డు అందుకున్నట్టు ఇంజనీరింగ్ కళాశాల నౌకాదళ అధికారి డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు.

పించన్లను అడ్డుకున్న పాపం జగన్‌దే: నెలవల





ప్రచారంలో పాల్గొన్న విజయశ్రీ, మాజీ మంత్రి పరసారత్నం తదితరులు - ప్రచారంలో మాట్లాడుతున్న శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి

ఓజిలి/సూళ్లూరుపేట, మే 2: మండుటెండల్లో అవ్వాతాతలను ఇబ్బందులకు గురి చేయాలన్న దుర్బుద్ధితో సీఎం జగన్ వ్యవహరిస్తున్నారని ప్రస్తుత పించన్ల పంపిణీ పాపం జగన్‌దేనని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఓజిలి మండలం కొత్తచెరువు, మాచవరం, ముమ్మాయిపాళెం, తిరుమలపూడిల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ, మాజీ మంత్రి పరసారత్నం పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో టీడీపీ అభిమానులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ... చంద్రబాబు ముఖ్య మంత్రి అయిన వెంటనే రూ.4వేల పించన్‌ను ఇంటికే తీసుకొచ్చి ఇస్తామని ప్రకటించిన తరువాత వైసీపీకి పాలుపోని పరిస్థితి ఏర్పడిందన్నారు. అందుకే పించన్లను ఇంటివద్ద పంపిణీ చేయకుండా కుట్రలు చేశారని విమర్శించారు. సచివాలయాల సిబ్బందితో ఇంటివద్దకే పించన్లను అందించమని కోరుతున్నా పించన్‌దారులను ఇబ్బంది పెట్టారన్నారు. మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ఎన్నో పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చాయని, వేలాది మందికి ఉపాధి కలిగిందని కాని జగన్ ప్రభుత్వం పరిశ్రమలను వెళ్లగొడుతోందన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మండల అ ధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు, శ్రీనివాసులురెడ్డి, ప్రకాష్‌నాయుడు, వెంకట సుబ్బయ్య, కె.సత్యవరప్రసాద్‌రావు, మధు, సతీష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తా: విజయశ్రీ

తనను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తానని టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. సూళ్లూరుపేట మండలం మతకామూడి, ఉగ్గుమూడి, వెలగలపన్నూరు, సుగ్గుపల్లి, కొరిడి పంచాయతీల్లో ఆమె ముమ్మరంగా ప్రచారం చేశారు. అభివృద్ధి అంటే గుర్తుకు వచ్చేది చంద్రబాబు అని... అరాచకమంటే గుర్తుకువచ్చేది జగన్ అని మీకు అభివృద్ధి కావాలా, అరాచకం కావాలా అని ప్రశ్నించారు. తాను ఎప్పుడూ అందు బాటులో ఉండి సమస్యల పరిష్కానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి పరసారత్నం, నాయకులు వేనాటి సతీష్‌రెడ్డి, కొక్కు శంకరయ్య, బాలయ్య, తాటిపర్తి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలో 21, 22, 23 వార్డుల్లో పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



మతకామూడి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ





రాపూరు మండలం పెనుబర్తి ఎన్నికల ప్రచారంలో కురుగొండ్ల రామకృష్ణ - గోనుపల్లిలో కురుగొండ్ల, మెట్టుకూరు, చెన్నులకు గజమాల సత్కారం

ఎన్డీఏ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు





ప్రార్థనలో బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు - వైసీపీ నాయకులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి, (ఉపాధ్యాయనగర్), మే 2: బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్తా పనిచేయాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. గురువారం ఓ ప్రముఖ హోటల్‌లో పాస్టర్లతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్టియన్ సోదరులకు ఎన్డీఏ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమై పోవడమే కాకుండా వైసీపీ నాయకుల అవినీతితో రాష్ట్రం 20 యేళ్ల వెనక్కు వెళ్లిపోయిందన్నారు. ఈ ప్రభుత్వానికి బుద్ధిచెప్పి ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కేంద్రం అందిస్తున్న పథకాలకు జగన్ తన బొమ్మలను వేసుకొని ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల మయంచేసి దివాలా తీయించారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ అధ్యక్షతన వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయ కులకు, కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిం చారు. ఈ కార్యక్రమంలో కూడా తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు, జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం నాయకులంతా ఎన్నికల కార్యా చరణపై చర్చించారు. ప్రచారాన్ని మరింత ఉధృతంగా నిర్వహిం చేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. అలాగే తిరుపతి నగరంలోని వినాయకనగర్, క్వార్టర్స్, సంత ప్రాంతాల్లో తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు సతీమణి కొల్లూరి లక్ష్మి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే అది ఎన్డీఏ, టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు.

రాష్ట్రాన్ని దృష్టిలో పెట్టుకొని సైకిల్‌ను గెలిపించండి

రాపూరును అన్ని విధాలా అభివృద్ధి చేస్తా ● టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ

రాపూరు/డక్కిలి/ వెంకటగిరి మే 2: రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు కూటమి అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ కోరారు. గురువారం వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరు మండలం గోనుపల్లి, ఆకిలివలస, పెనుబర్తి, రాపూరు పట్టణంలో సుడిగాలి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వెంకటగిరి నియోజకవర్గంలో వైసీపీ నేతల అరాచకాలు మితిమీరిపోయాయని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఉచితంగా ఇచ్చే ఇసుక, మట్టిని అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ నేతలు దోచుకున్నారని ధ్వజమెత్తారు. కండలేరు జలాశయంలో చేపపిల్లలను వదలక పోగా ఉన్న మత్స్యసందపను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే వైసీపీ నేతలు తిన్నదంతా కక్కిస్తామని హెచ్చరించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కండలేరు జలాశయంలో చేపలను పట్టుకొనే హక్కు అక్కడి గిరిజనులకు ఇచ్చినట్టు గుర్తు చేశారు. వైసీపీ పాలనలో అందుకు విరుద్ధంగా ఒక నేత కనుసన్నుల్లో మత్స్య సంపదంతా తరలిపోతుందన్నారు. ఇక రాష్ట్రంలో తెలుగుదేశం గాలి వీస్తోందని ఆ ఉధృతికి ఫ్యాన్ రెక్కలు విరిగి పోవడం ఖాయమన్నారు. వెంకటగిరిలో తాను రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎంతో అభివృద్ధి చేశానన్నారు. ఈసారి కూడా వెంకటగిరిలో టీడీపీ జెండానే ఎగురుతుందని స్పష్టం చేశారు. ప్రచారంలో ఎం.ధనుంజయరెడ్డి, చెన్ను తిరుపాలరెడ్డి, చెన్ను అశోక్‌రెడ్డి, మధురెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎస్.ఎస్.ఆర్. నాయుడు, ఎన్.శివరామకృష్ణ, డి.వెంకటేశ్వర్లు రెడ్డి, ఖాజామోహిద్దీన్, ఏ.కోటేశ్వరనాయుడు, జి.వెంకటేశ్వర్లు రెడ్డి, వి.రాఘవరెడ్డి, కె.రమణమ్మ, జి.రవీంద్రారెడ్డి, ఎన్. వెంకటరమణారెడ్డి, రమణమ్మ, కస్తూరి, పచ్చిగళ్ల రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంచల నృసింహస్వామి సేవలో కురుగొండ్ల

ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని నృసింహస్వామిని కురుగొండ్ల రామకృష్ణ, జిల్లా సెంట్రల్ బ్యాంకు మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, పెంచలకోన దేవస్థానం మాజీ చైర్మన్ తిరుపాలరెడ్డితో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటగిరిలో తనకు విజయం చేకూర్చేలా ఆశీర్వదించాలని రామకృష్ణ నృసింహస్వామిని వేడుకోగా, వైసీపీ అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి ప్రసాదించాలని నృసింహ స్వామిని వేడుకున్నట్లు మెట్టుకూరు ధనుంజయ రెడ్డి తెలిపారు.



పెంచలకోనలో నృసింహస్వామిని దర్శించుకున్న కురుగొండ్ల

కూటమి విజయంతోనే రాష్ట్ర భవిష్యత్తు



సమావేశంలో ప్రసంగిస్తున్న కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ

బాలాయపల్లి, మే 2: రాష్ట్రాభివృద్ధి, బిడ్డల భవిష్యత్తు కూటమి అభ్యర్థులు గెలుపుతోనే సాధ్యమని కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ అన్నారు. గురువారం మండలంలోని హస్తకావేరి, పెండేరెడ్డిపల్లి, సంగవరం, చిలమనూరు, ఊట్లపల్లి, పాపి రెడ్డిపల్లి గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే రూ.4వేల ఫించను ఇంటికే చేరుస్తారన్నారు. అంతేకాకుండా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు, రాయి సత్యంనాయుడు, కె.శ్రీహరి, దాసరి రాజగోపాల్‌నాయుడు, కొర్రపాటి రామచంద్ర నాయుడు, మద్దూరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం పండుటాకుల విలవిల



చింతవరం కెనరా బ్యాంకులో రద్దీ

నాయుడుపేట/ తడ, మే 2: అసలే మే నెల... భానుడు చండ ప్రచండంగా నిప్పులు కురిపిస్తుండడంతో పాటు వడగాడ్పులతో సాధారణ జనమే తల్లడిల్లి పోయే పరిస్థితి... ఈ పరిస్థితుల్లో పింఛన్ల కోసం ఎదురుచూసే పండుటాకులు వ్యయప్రయాసాలకోర్చి బ్యాంకుల వద్ద, సచివా లయాల వద్ద పడిగాపులు కాశారు. ఈ పరిస్థితికి సీఎం జగనే కారణమంటూ గొనుక్కోవడం కన్పించింది.

చిల్లకూరు: సామాజిక పింఛనుదారులు గురువారం నగదు డ్రా చేసుకునేందుకు గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈనెల పింఛనుదారులకు ఆధార్ కార్డుతో అనుసంధానమైన ఖాతాలకు నగదును జమ చేశారు. చింతవరం, చిల్లకూరు ప్రాంతాల పింఛనుదారులు నగదును డ్రా చే సుకునేందుకు బ్యాంకుల్లో నిరీక్షించారు. ఇంటి వద్దకే సిబ్బందితో పింఛన్ అందించేలా చర్యలు తీసుకోని రాష్ట్రప్రభుత్వంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ: కలెక్టర్



స్ట్రాంగ్ రూం పరిశీలనకు వెళ్తున్న కలెక్టర్

వెంకటగిరి టౌన్, మే 2: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి సంబంధిత సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. గురువారం వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ డిగ్రీ కళశాలలో పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, సెక్టార్ ఆఫీసర్స్, వీఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, నైట్ డ్యూటీ, రెవెన్యూ సిబ్బందికి రెండో విడత శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ మాట్లాడుతూ... వంద శాతం పోలింగ్‌కు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. సమస్యాత్మక బూత్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పించాలన్నారు. అనంతరం స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్వో ధ్యాన్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని గోకులకృష్ణ కళాశాలలో ఆర్వో చంద్రముని ఆధ్వర్యంలో సార్వత్రిక ఎన్నికల విధులపై పీవో, ఏపీవోలకు రెండో విడత శిక్షణ తరగతులు జరిగాయి. తరగతులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ఏఈఆర్వో గోపాలకృష్ణ, ఎన్నికల డీటీ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని భూస్థాపితం చేసేందుకు కలసికట్టుగా పోరాడదాం





కోటలో రైతులు అందజేసిన నాగలితో పాశం సునీల్‌కుమార్ - ప్రచారంలో పెద్దఎత్తున పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

కోట, మే 2: రానున్న ఎన్నికలలో రాష్ట్రంలో దుష్టపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసేందుకు కలసికట్టుగా పోరాడుదామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని సిద్దవరం, కర్లపూడి, ఉత్తమనెల్లూరు, వంజివాకల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు పాశింకు హారతులు పట్టి దిష్టితీశారు. అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం జగన్ అనాలోచిత నిర్ణయాల కారణంగా రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే చంద్రబాబును సీఎం చేసుకోవాల్సి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సహా వివిధ కార్పొరేషన్లను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ఆయా సామాజిక వర్గాలను దగా చేసిన జగన్‌ను ఓటుతో తరిమికొడుదామన్నారు. ఉమ్మడి మేనిఫెస్టో రాష్ట్ర ప్రజల మన్ననలను పొందిందన్నారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి, డ్వాక్రా సంఘాలకు భరోసా వంటి పథకాలు మేనిఫెస్టోలో ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల్లో రైతులు నాగలిని, యాదవులు గొర్రెపిల్లను పాశం సునీల్‌కుమార్‌కు బహూకరించారు. చిల్లకూరు దశరథరామిరెడ్డి, పి.కోటేశ్వరరెడ్డి, రామలింగారెడ్డి, రమేష్, కోటేశ్వరప్రసాద్, వెంకటకృష్ణయ్య, సంజీవరెడ్డి, వెంకటేశ్వర్లు, బాబు, పురుషోత్తంరెడ్డి, గిరిధర్‌రెడ్డి, ఎన్.జగన్మోహన్‌రెడ్డి, టి.సురేష్‌బాబు, విజయ భాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బాలకృష్ణయాదవ్, మురళి, అనూష్, చెంగల్రావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ అండగా ఉమ్మడి మేనిఫెస్టో...

గూడూరు, మే 2: అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉమ్మడి కూటమి మేనిఫెస్టో నిలుస్తోందని టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. గురువారం చవటపాళెం ఎస్టీ కాలనీలో ప్రచారం ని ర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల అభ్యున్నతి, సంక్షేమ మే ధ్యేయంగా ఉమ్మడి కూటమి మేనిఫెస్టో ప్రజల్లో సూపర్‌హిట్‌గా నిలు స్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వం మద్యాన్ని నిషేధిస్తామని హామీ ఇచ్చి తుంగలో తొక్కి నాసిరకం బ్రాండ్ల విక్రయాలతో మంద్యంప్రియుల ఆరోగ్యాలతో చెలగాట మాడుతోందన్నారు. ప్రజలకు సుపరిపాలన అందాలంటే రాష్ట్రానికి చంద్రబాబు సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ విజ్ఞతతో ఆలోచించి అభివృద్ధికి పాటుపడే ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పి.నాగరాజు, బాబురావు, జగదీశ్, సుబ్బయ్య, రవి, గోవర్ధన్, గోవిందయ్య, శీనయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



చవటపాళెంలో ప్రచారం నిర్వహిస్తున్న సంధ్యారాణి